
రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ఉక్రేన్‌పై రష్యా డ్రోన్ల వర్షం : 19 మంది మృతి 08

'దొంగే దొంగ అని అరిచినట్లు 07

ఐసియులోకి విద్యావ్యవస్థ



సంపుటి 09, సంచిక: 217 | మంగళవారం | 07-07-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## పేదల జోలికొస్తే ప్రభుత్వాలకు
# మనుగడ ఉండదు

**'ప్రతి గుడిసెకు పట్టా, అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు ఇవ్వాలి' నినాదంతో ఇందిరాపార్క్ వద్ద వామపక్షాల మహాధర్నా**

- పేదోడి శ్రమ, చెమట బొట్ల నుంచే సంపద సృష్టి
- ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదు
- నిరుపేదల ఇల్లు, గుడిసెల కూల్చివేతలపై వామపక్ష నాయకుల ఆగ్రహం
- ల్యాండ్ మాఫియా భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి : కూనంనేని
- గుడిసెలు కూల్చితే బుల్డోజర్లకు ఎదురొడ్డి ఉద్యమిస్తాం : జాన్‌వెస్లీ

> 'భూదాన్ భూములు, ప్రభుత్వ భూములను ల్యాండ్ మాఫియా దొంగల్లా దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. నోరు లేని మూగజీవాల్లాంటి పేదలు తలదాచుకోవడానికి గుడిసె వేసుకుంటే మాత్రం కూల్చేస్తున్నారు. ల్యాండ్ మాఫియా నుంచి ఎన్ని వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారో 'శ్వేతపత్రం' విడుదల చేయాలి. 'హైడ్రా' పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయడం కాదు. పెద్ద పెద్ద కబ్జాకోరులను, 10 మంది పెద్ద చేపలను పట్టి జైల్లో పెట్టండి. మేం స్వాగతిస్తూ మీకు దండలు వేస్తాం'
>
> – కూనంనేని సాంబశివ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో నిరుపేదల ఇళ్లు, గుడిసెల కూల్చివేతలపై కమ్యూనిస్టు పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ స్థలం ఏదైనా కానీ వాటిలో నిరుపేదలు వేసుకున్న 'ప్రతి గుడిసెకు పట్టా, అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలి' అని డిమాండ్ చేస్తూ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సోమవారం వేలాది మంది నిరుపేదలు హైదరాబాద్‌లో కదం తొక్కారు. ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 'పేదవాడి శ్రమ, చెమట బొట్ల నుంచే సంపద సృష్టించబడుతోంది. అలాంటి పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టదు' అని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదని, కేవలం రేషన్ కార్డులు, పెన్షన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆయన విమర్శించారు. తొలుత సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు వామపక్షాల మహా ధర్నా ఉద్దేశాన్ని సభికులకు వివరించారు. అనంతరం వామపక్షాల నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా, సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, వామపక్షాల నాయకులు వనం సుధాకర్ (ఎంసిపిఐ), కె.గోవర్ధన్ (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), సదానంద్ (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్), భరత్ (ఎస్‌యుసిఐ) అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ఎంసిపిఐ, ఎంసిపిఐ(యు), ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు. 'పేదవాడి శ్రమ, చెమట బొట్ల నుంచే సంపద సృష్టించబడుతోంది. అలాంటి పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టదు' అని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం, బుల్డోజర్లు చేతిలో ఉన్నాయని పేదల గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూలుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెలుగుమట్ల, హనుమకొండలోని గుండ్ల సింగారం, తరువాయి 12లో

---

**అయోధ్య రామాలయ ట్రస్ట్**

## తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

**చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం**



**అయోధ్య:** భక్తుల విరాళాలను దుర్వినియోగం చేసిన ఆరోపణలపై శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్టు ఆమోదించింది. ఆయనతోపాటే భక్తుల విరాళాలను దోచుకున్న ఆరోపణలపై ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాను కూడా ట్రస్టు ఆమోదించింది. ఆయన స్థానంలో తాత్కాలికంగా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహించడానికి కృష్ణమోహన్‌ను ట్రస్టు నియమించింది. అదేవిధంగా ఆలయ ట్రస్టు కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం ఒక సిఇఒ(ప్రధాన కార్య నిర్వహణాధికారి) ని వెతికి పట్టుకునేందుకు ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు సోమవారం ప్రకటించింది. ఈ కమిటీలో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి ప్రమోద్ ఖోష్లా,పదవీ విరమణ చేసిన లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది,ట్రస్టీ సురేశ్ హవారే సభ్యులుగా ఉన్నారు. జులై 22వ తూదీప టస్టు మరో సారి సమావేశం జరుపుతుంది. అయోధ్య భక్తుల విరాళాల దుర్వినియోగంపై తీవ్రస్థాయిలో రాజకీయ దుమారం చెలరేగిన ఘటనలపై ఆలయ నిర్వాహకులు మూడు గంటలపాటు జరిగిన తరువాయి 8లో

---



## రూ.300 కోట్ల అక్రమాస్తుల కేసు
# డిఎస్‌పి భీమ్‌రెడ్డి అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో నమోదైన కేసులో డిఎస్‌పి భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు రోజుల క్రితం భీమ్‌రెడ్డికి చెందిన నివాసాలు, కార్యాలయాలు, ఇతర అనుబంధ ప్రాంతాల్లో ఎసిబి అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.300 కోట్ల విలువైన ఆదాయానికి మించిన అక్రమాస్తులను గుర్తించినట్లు ఎసిబి వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాలు, పత్రాల పరిశీలన అనంతరం భీమ్‌రెడ్డిని అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను ఎసిబి త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

---



## ఎంఎస్‌ఎంఇల గొంతు నొక్కుతున్నారు

- 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' కేవలం నినాదాలే : రాహుల్‌గాంధీ
- జైపూర్‌లో బస్సు, ట్రక్కు బాడీ-బిల్డింగ్ వర్క్‌షాప్ సందర్శించిన వీడియో విడుదల

**న్యూఢిల్లీ :** రవాణా మంత్రిత్వ శాఖ రూపొందించిన నిబంధనలు దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక బస్సు, ట్రక్కు బాడీబిల్డింగ్ వర్క్‌షాప్‌ల వంటి చిన్న తరహా పరిశ్రమల గొంతును నొక్కుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రోత్సాకాలు అందించాల్సిన ఎంఎస్‌ఎంఇలను ఉద్దేశపూర్వకంగా గొంతు పిసికివేస్తున్నారని తరువాయి 8లో

---



## హైదరాబాద్‌లో ఎకో పార్కులు

- పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి
- భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయాలని, పర్యాటక రంగంలో పెట్టుబడులకు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్‌వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై కసరత్తును ప్రారంభించాలని, ఈ సమ్మిట్ కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గుర్రంగూడ తరువాయి 8లో

---

## సైనికుల కాన్వాయ్‌పై
# మిలిటెంట్ల మెరుపుదాడి

- ఇద్దరు అసోం రైఫిల్స్ సిబ్బంది మృతి
- మరికొంత మందికి గాయాలు
- మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఘటన



**ఇంఫాల్/ న్యూఢిల్లీ :** మణిపూర్‌లో సోమవారం అనుమానిత మిలిటెంట్లు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఉఖ్రుల్ జిల్లాలో సైనికుల కాన్వాయ్‌పై మెరుపుదాడి చేశారు. దాడిలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ కొండ ప్రాంతంలోని నుంగ్‌షాంగ్ ఖోంగ్ వద్ద మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. పారామిలిటరీ దళానికి చెందిన కాన్వాయ్‌పై అనుమానిత మిలిటెంట్లు కాల్పులు జరిపారని ఒక సీనియర్ అధికారి చెప్పారు. 'మరణించిన వారిలో ఒక వారెంట్ ఆఫీసర్, ఒక డ్రైవర్ ఉన్నారు; వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉఖ్రుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, జిల్లా ప్రధాన కార్యాలయానికి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న నుంగ్‌షాంగ్ ఖోంగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. అసోం రైఫిల్స్ 40వ బెటాలియన్ ప్రధాన తరువాయి 8లో

---

## పోడు భూముల స్వాధీనం...
# రైతుల ఆగ్రహం

- ఆసిఫాబాద్ జిల్లా సుర్దాపూర్ గ్రామంలో రైతుల అందోళన
- పరిస్థితి ఉద్రిక్తం : నిరసనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం

ప్రజాపక్షం / ఆసిఫాబాద్



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పోడు భూముల స్వాధీనం ప్రక్రియ మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుర్దాపూర్ గ్రామంలో సుమారు 100 మంది రైతులకు సంబంధించిన సాగు భూములను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోడురైతులు, పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘర్షణ వాతావరణంలో జరిగిన తోపులాటలో ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన తమపై పోలీసులు లాఠీఛార్జ్, దాడికి ప్రయత్నించారని, ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం వల్లే మహిళలకు గాయాలయ్యాయని రైతులు తీవ్రంగా ఆరోపించారు. తరతరాలుగా, గత 50 ఏళ్లుగా తరువాయి 8లో

---

## 'సర్' ఓటర్ల ఫారాల పంపిణీ
# నేడు పూర్తి చేయాల్సిందే

**కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని నేటితో ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అదనపు సిఈఓ వాసం వెంకటేశ్వర్లు రెడ్డితో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్‌ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై సమీక్షించిన సిఇఒ, ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో వంద శాతం ఫారాల పంపిణీ జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల భర్తీలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమన్నారు. పనితీరు బలహీనంగా ఉన్న బిఎల్‌ఒలను గుర్తించి వారికి సూపర్‌వైజర్లు సహకరించాలని ఆదేశించారు. అవసరమైన చోట స్థానిక వాలంటీర్ల సేవలను వినియోగించి, ఓటర్లకు ఫారాల భర్తీలో సహాయం అందించాలని తరువాయి 8లో

---

## 2028 జూన్ నాటికి
# 'ఎస్‌ఎల్‌బిసి' పూర్తి చేస్తాం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ
- టన్నెల్‌లో పనిచేస్తున్న కార్మికుల భద్రతలో రాజీలోద్దని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎఎంఆర్‌ఎస్‌ఎల్ బిసి) ప్రాజెక్టును 2028 జూన్ నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టుపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ తరువాయి 8లో

---

## దేశ ఇంధన వ్యవస్థపై
# ఎల్‌నినో తీవ్ర ప్రభావం

- 'క్రెయా' నివేదిక వెల్లడి
- తగ్గనున్న విద్యుత్ ఉత్పత్తి
- భారీగా పెరుగనున్న వినియోగం



**న్యూఢిల్లీ:** ప్రపంచంలో రాబోయే సూపర్ ఎల్‌నినో ఎక్కడాలేనివిధంగా భారత దేశ ఇంధన వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని 'క్రెయా' (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్) సరికొత్త విశ్లేషణ చేసింది. ఎల్‌నినో ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే విషయంపై ప్రపంచదేశాలు అనేక దృక్కోణాలలో పరిశీలనలు చేస్తున్న పూర్వరంగంలో క్రెయా నివేదిక వెలువడింది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను చాలా తీవ్రంగా పెంచి ఎల్‌నినో ప్రభావం చూపించబోతోందని ఇప్పటికే చాలా స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా దేశంలో విద్యుత్ వాడకం గణనీయంగా పెరుగుతుంది. అదేసమయంలో విద్యుత్ ఉత్పత్తి కూడా గణనీయస్థాయిలో దెబ్బతింటుంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉష్ణగాలులు దేశంపై తీవ్ర తరువాయి 12లో

# అమెరికా (యుఎస్ఎ) @ 250

ప్రపంచంలో నెం.1దేశం అమెరికా సంయుక్త రాష్ట్రాలు(యుఎస్ఎ) గ్రేట్ బ్రిటన్ నుంచి తన స్వాతంత్ర్య 250వ జన్మదినాన్ని ఈనెల 4వ తేదీన కనువిందుగా, కనులకు విందుగొలిపే కార్యక్రమాలతో అట్టహాసంగా జరుపుకుంది. ఈ చరిత్రాత్మక సందర్భంలో అధ్యక్షుడిగా ఉండే అదృష్టం డొనాల్డ్ ట్రంప్‌కు దక్కింది. 250 ఏళ్ల క్రితం 13కాలనీలు తిరుగుబాటు చేసి తాము ఇంకెంతమాత్రం బ్రిటిష్ సింహాసనానికి లొంగి ఉండబోమని ప్రకటించిన 250సంవత్సరాలనాటి చరిత్రాత్మక సందర్భాన్ని అమెరికన్లు అట్లాంటిక్ సముద్ర తీరం నుంచి పసిఫిక్ మహాసముద్రం వరకు మిరుమిట్లుగొలిపే బాణాసంచా పేలుళ్లతో, సైనిక విన్యాసాలతో, కచ్చేరీలు, పెరేడ్‌లతో అత్యుత్సాహంగా జరుపుకున్నారు.1976లో ద్విశతాబ్ది ఉత్సవాల తదుపరి ఇది అతిపెద్ద పౌర ఉత్సవంగా అనేకమంది అభివర్ణించారు. దేశదేశాలనుంచి ప్రభుత్వాధినేతలు ట్రంప్‌కు శుభాకాంక్షల సందేశాలు పంపారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల అసాధారణ భిన్నత్వాన్ని ఉత్సవాలు ప్రతిబింబించాయి. న్యూయార్క్ తూర్పునది గగనతలం సంగీతానికి అనుగుణంగా ఫైర్‌వర్క్స్‌తో కాంతులీనింది. ఫిలడెల్ఫియా అమెరికా స్వాతంత్ర్య జన్మస్థలాన్ని పునఃసందర్శించింది. స్వాతంత్ర్య ప్రకటనను ప్రజలు చదివారు. అయితే ఒకవైపు మండిపోతున్న ఎండలు, మరోవైపు వర్షాలు ఉత్సవాల ఉత్సాహాన్ని నీరుగార్చాయి. మౌంట్ రష్మోర్‌లో ఉత్సవాలు జార్జి వాషింగ్టన్, థామస్ జెఫర్‌సన్, థియోడర్ రూజ్వెల్ట్, అబ్రహాం లింకన్ గ్రానైట్ ముఖచిత్రాల దిగువన ప్రారంభమైనాయి. అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగిస్తూ అమెరికా ఇప్పుడు మరో చారిత్రక క్రాస్‌రోడ్స్‌లో ఉందన్నారు. అమెరికా ప్రత్యేకతలను ప్రశంసించారు. "మనదేశ పూర్వీకులకు మన వందనాలు" అంటూ, 250 ఏళ్ల క్రితం స్వాతంత్ర్య ప్రకటనలో పొందుపరిచిన సూత్రాలను కాపాడుకోవాలని అమెరికన్‌లకు విజ్ఞప్తి చేస్తూ, దేశ వ్యవస్థాపక సూత్రాలకు కమ్యూనిజం కొత్త ప్రమాదం తెస్తోందని తన పచ్చి మితవాద బుద్ధిని బయటపెట్టుకున్నారు.

15వ శతాబ్దంలో జరిగిన తప్పు, 20వ శతాబ్దంలో దిద్దుబాటు అనే జోక్ గుర్తుచేసుకోదగింది : క్రిస్టఫర్ కొలంబస్ 1492లో ఇండియాకు(భారత్‌కు) సముద్రమార్గం అన్వేషిస్తూ ఒక ఖండానికి చేరాడు. అదే ఇండీస్ అని వాదించాడు. అక్కడున్న అమెరికా ఆదిమవాసులకు 'ఇండియన్స్' అని పేరుపెట్టాడు. అలా ఐదు శతాబ్దాలు గడిచిపోయాయి. 1965లో ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం (దేశ మూలాన్ని బట్టి అమెరికాలోకి ప్రవేశించే వారికి కోటా పద్ధతి రద్దు) వచ్చిన తర్వాతగాని విదేశాలనుంచి వలసలు పెరగలేదు. అప్పటి నుంచి – 1960 నుంచి 1990 వరకు భారత వలస జనాభా ప్రతి దశాబ్దంలో రెట్టింపు అయింది. ఇవాళ 54లక్షలమందికి పైగా ఉన్నారు. ట్రంప్ వలస ప్రజలకు వ్యతిరేకంగా కఠినంగా వ్యవహరిస్తున్నారు.

ఆర్థిక, పారిశ్రామిక, సైనికాభివృద్ధిలో అమెరికా నిజంగా అగ్రరాజ్యం. ప్రపంచస్థాయి ఆర్థిక, ద్రవ్య సంస్థల పెత్తనాన్ని ప్రపంచ దేశాల పై విధించిన అమెరికా, అంతర్జాతీయ చలామణీ కరెన్సీగా డాలర్‌ను స్థిరపరిచి నయా వలసవాదం ప్రవేశపెట్టింది. 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయవంతమైన నాటినుంచి కమ్యూనిజాన్ని మట్టుపెట్టటానికి అమెరికా చేయని ప్రయత్నం లేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఫాసిస్టునేత అడోల్ఫ్ హిట్లర్‌ను అగ్రరాజ్యాలు పీచమణిచినా తూర్పు యూరప్‌కు కమ్యూనిజం విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా వలస దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. ఆసియాలో తూర్పున చైనాలో కమ్యూనిస్టు విప్లవం విజయవంతమైంది. సోవియట్ యూనియన్ రోదసి, అణ్వాయుధాలు సహా అన్ని రంగాల్లో అమెరికాకు ఢీ కొంది. వర్తమాన దేశాల ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచింది. ఈ పోటీలో ఎట్టకేలకు సామ్రాజ్యవాదం గెలిచింది, 1991లో సోవియట్ యూనియన్ అంతరించింది. కమ్యూనిజం మరణించిందని, తమకు తిరుగులేదని, ప్రపంచంపై పెత్తనం తమదేనని విర్రవీగిన అమెరికా, దాని మిత్ర సామ్రాజ్యవాదులు త్వరలోనే భంగపడక తప్పలేదు. బహుళ ధ్రువ ప్రపంచం కోసం కమ్యూనిస్టు, వర్తమాన దేశాలు గట్టిగా తలపడుతున్నాయి.

చరిత్రలోని అనేక దశల్లో అమెరికా కూడా ఆటుపోట్లకు గురైంది. కమ్యూనిజాన్ని భూతంగాచూపి ప్రపంచంలోని నియంతలందర్నీ బలపరిచింది. అమెరికా ప్రయోజనాల రక్షణ అనే అసంబద్ధ వాదనతో అన్ని ఖండాలకు తన సైనిక శక్తిని విస్తరించింది. చిన్న ఆసియా దేశం వియత్నాంలో చావుదెబ్బతిని తోకముడిసినాక, మరెక్కడా అది ప్రత్యక్షంగా యుద్ధానికి దిగలేదు. 21వ శతాబ్దం ఆరంభంలో అధ్యక్షుడు బుష్ ఇస్లామిక్ దేశాలపై కత్తిగట్టి స్వల్పవిజయాలు సాధించినా ఆఫ్ఘనిస్థాన్‌లో 20సంవత్సరాలు తిష్టవేసిన అమెరికన్ సైన్యాలు తోకముడిచాయి. ఒకటి మాత్రం సత్యం – మిలటరీ పారిశ్రామిక కుబేరుల చేతిలో బందీ అయిన అమెరికన్ పాలకులు వారి ఆయుధాలు అమ్ముకోవటానికి వివిధ దేశాల్లో యుద్ధాలు సృష్టిస్తూ ఉంటారు.

అయితే స్వశక్తితో, వలస ప్రజల శ్రమశక్తితో ఏకైక అగ్రరాజ్యంగా ఎదిగిన అమెరికా తన ఆర్థిక శక్తితో ప్రపంచాన్ని శాసించగలుగుతున్నది. చక్రగతి ఆర్థిక సంక్షోభాలు ఎదురవుతున్నా ఆ భారాన్ని వర్తమాన ప్రపంచంపైకి మళ్లించి కోలుకోగలుగుతున్నది. ట్రంప్ రెండవసారి అధ్యక్షుడయినాక 'అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ దిగుమతులపై ఇష్టానుసారం సుంకాలు పెంచి మిత్ర, అమిత్ర దేశాలను గడగడలాడించారు. ఆ అధికారం ఆయనకు లేదని సుప్రీంకోర్టు బ్రేకువేసింది. ఇలా పలు ఏకపక్ష నిర్ణయాలు న్యాయవ్యవస్థ రద్దు చేసినా ట్రంప్ విర్రవీగుతూనే ఉన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి చేసిన సైనిక దాడి విఫలం కావటం ట్రంప్, అమెరికా ప్రతిష్టకు తిరుగులేని దెబ్బ. ప్రపంచంలో శాంతి, సామరస్యం నెలకొనాలంటే ఆధిపత్యం బదులు స్నేహం, సంప్రదింపుల అవసరం. కాని అమెరికా పాలకవర్గాల బాటే సపరేటు.



## ప్రభుత్వాన్ని సక్రమంగా నడపండి

మీరు (సువేందు అధికారి) ముఖ్యమంత్రి. మీరు గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. 10 లేదా 11 ఏళ్లపాటు టీఎంసీలో ఉన్నారు. టీఎంసీ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. మీరు నీటిపారుదల, రవాణా శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ తరఫున ఆరు జిల్లాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఈ రోజు నా కార్యకర్తలపై అరాచకాలకు పాల్పడకండి. ఒక రోజు ఆ పరిణామాలు మీకే ఎదురుకావచ్చు. ప్రతి చర్యకు ఒక ప్రతిచర్య ఉంటుంది. ప్రభుత్వాన్ని సక్రమంగా నడపండి.

- పశ్చిమ బెంగాల్ సిఎంను ఉద్దేశించి టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ




## లౌకిక జీవితంలో క్షమాగుణంతో మానసిక ప్రశాంతత!

మనకు చెడు చేసిన వ్యక్తి మన ఆదీనంలోకి వచ్చినపుడు వారిపై హానికరమైన లేదా ప్రతీకార చర్యలకు పూనుకోకుండా వదిలేయడాన్ని 'క్షమాగుణం', 'మన్నించడం', లేదా 'క్షమ' అంటాం. క్షమాగుణం ఓ శక్తివంతమైన ఆయుధం. క్షమాగుణంతో సంతోషం, ఆరోగ్యం సిద్ధిస్తాయి. అందువల్లనే క్షమయా సాధ్యతే సర్వమ్ అన్నారు పెద్దలు. తన పైకి రాయి విసిరిన వ్యక్తికి తియ్యనైన ఫలాలను ఇచ్చే వృక్షం, భూమాత ఓర్పును క్షమాగుణానికి నిలువెత్తు నిదర్శనం. 'క్షమయా ధరిత్రి' అని వింటున్నాం. భూ మాత క్షమాగుణానికి ప్రతీకగా నిలుస్తున్నది. పొరపాటు చేయడం మానవ సహజ గుణం. క్షమించడం దైవగుణం. మంచి పౌరులకు ఉండవలసిన గుణాల్లో క్షమాగుణం కూడా ప్రధానమైనది.

మనిషికి శాంతి, మనసుకు ప్రశాంతత కావాలి. క్షమాగుణం వల్ల మానసిక ప్రశాంతత కలగడం, అనవసర ఒత్తిడి నుంచి బయట పడడం, అనవసర గొడవలు తగ్గి మానవ సంబంధాలు మెరుగుపడడం జరుగుతుంది. సమస్త జంతువుల్లో మనిషికి మాత్రమే క్షమాగుణం ఉంటుంది. క్షమాగుణం ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రపంచ పౌర సమాజం ప్రతి ఏట 07 జూలై రోజున ప్రపంచ క్షమాగుణం దినం (గ్లోబల్ ఫర్గివ్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా వస్తున్నది. క్షమాగుణం ప్రాధాన్యాలను అవగాహన పర్చడం, దాని ప్రయోజనాలను వివరించడం లాంటి అంశాలను చర్చించడానికి ఈ దినోత్సవం ఉపకరిస్తుంది. క్షమించే వారిని చేతకానివాడిగా చూస్తున్న సమాజం మనది, కాని అది ఒక అసమానమైన గొప్ప గుణం అని తెలుసుకోవాలి. క్షమాగుణం లేని వారిలో ఆందోళన, ఒత్తిడి, బిపి, అసహజ భావోద్వేగాలు, ఆవేశాగ్ని, నిరాశలు పెరుగుతూ మానసిక ప్రశాంతత, జీవన సమతుల్యత లు తరుగుతాయి. 2026 ప్రపంచ క్షమాగుణం దినోత్సవం ఇతివృత్తంగా క్షమాగుణం శక్తిని తెలుసుకుందాం (పవర్ ఆఫ్ ఫర్‌గివ్‌నెస్) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

**క్షమించడం ఓ స్వయం నియంత్రణ:**

క్షమించడమనేది ఒక స్వయం నియంత్రణ. పశ్చాత్తాప బుద్ధి కలిగిన వాడికి క్షమాగుణం విలువ తెలుస్తుంది. నటించే వారికి క్షమాభిక్ష దుష్ఫలితాలను ఇస్తుంది. దోషికి తగిన శిక్ష విధిస్తేనే అది అతడిని నిర్దోషిగా మార్చుతుంది. ఓరిమికి పరాకాష్ఠ క్షమాగుణమే. ఇది ధీరుల, జ్ఞానవంతుల లక్షణం. ఎవరు కోపగించుకున్నా తాను నిబ్బరంగా ఉంటూ, కఠినమైన మాటలు పలికినా విననట్లు జవాబు ఇవ్వకుండా ఉండడం, అవమానం పొందినా మనసులో పెట్టుకోకుండా ఉండడం, ఆ వ్యక్తిని క్షమించడం లాంటి లక్షణా లు క్షమించే వారికి ఉంటాయి. క్షమాగుణంతో పాటు సహనశీలత ఉన్న వారు దైవ సమానులుగా భావించబడుతూ, మనిషిని మహాత్మున్ని చేస్తాయి. పగ వల్ల పగ పోదని గమనించాలి.

పగపై నీళ్లు చల్లే గుణమే క్షమాగుణం. క్షమాగుణం ఉన్న వారిలో పగ, కోపం లాంటివి ఉండవు. కోపంలోనూ, పగలోనూ చేసే పనులు విధ్వంసకరంగా, అత్యంత చెడు చేసేవిగా, మానవ సంబంధాలను తుంచేవిగా ఉంటాయి. అపకారికి ఉపకారం చేయడమే క్షమాగుణం అనబడుతుంది. క్షమాగుణం ఆచరణయోగ్యమే కాని అసాధ్యం కాదు. లౌకిక జీవితంలో సుఖశాంతులకు, ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నతికి ఉపయోగపడేది క్షమాగుణమే. ఓర్పు, క్షమ, శాంతి అనే గుణాలు జీవితాన్ని అర్థవంతంగా చేస్తాయి. బలహీనుడు ఎన్నడూ క్షమించలేడు, క్షమాగుణం బలవంతుడి లక్షణం. క్షమాపణ మన హృదయాలను, ఆత్మను స్వేచ్ఛగా మార్చుతుంది.


**(07 జూలై ప్రపంచ క్షమాగుణం దినం సందర్భంగా)**

# 'పౌరసత్వం' గందరగోళంతో చలికాచుకుంటున్న నేతలు

**సి.ఆదికేశవన్**

భారత పౌరులు తమ గుర్తింపు గురించి నిరంతరం భయంతో జీవిస్తున్నారు. పాస్‌పోర్ట్, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడిలు, రేషన్ కార్డులు, పాన్ కార్డులు లేదా డ్రైవింగ్ లైసెన్సుల వంటి సాధారణ పత్రాలు పౌరసత్వానికి రుజువు కావని నాయకులు పదేపదే ప్రకటిస్తున్నారు. ఇది ప్రజలను ఒకే ఒక మామూలు ప్రశ్న అడిగేలా చేస్తోంది. పౌరసత్వానికి అసలైన రుజువు ఏమిటి? ప్రభుత్వం వద్ద స్పష్టమైన సమాధానం లేదు. దానికి బదు లు అది అభద్రతను, విభజనను సృష్టించే అంతులేని చర్చను మరింతగా పెంచుతోంది.

పాత్రికేయులు ఈ విషయంపై బలమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వివాదం ఎందుకు పదేపదే తలెత్తుతోందని వారు ప్రశ్నించారు. 1947–50లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భాలలో ఇలాంటి సందేహాలు అరుదుగా ఉండేవి. నేడు మంత్రులు, అధికారుల ప్రకటనలు సామాన్య ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారవచ్చని వారు హెచ్చరించారు. పెళ్లిళ్లలో, రైలు ప్రయాణాలలో లేదా రోజువారీ సంభాషణల సమయంలో ప్రజలు పౌరసత్వ రుజువును అడగవచ్చు. 'నీ పౌరసత్వాన్ని రద్దు చేయిస్తాను' వంటి బెదిరింపులు సర్వసాధారణం కావచ్చు. చట్టం స్పష్టంగా ఉన్నప్పటికీ, ఆచరణలో గందరగోళంగా ఉంది. రాజ్యాంగంలోని 5 నుండి 11 అధికరణలు పౌరసత్వం గురించి వివరిస్తాయి. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం, ఒక వ్యక్తి పుట్టుకతో, వంశపారంపర్యంగా, నమోదు ద్వారా, సహజీకరణ(నేచురలైజేషన్)ద్వారా లేదా భూ భాగ విలీనం ద్వారా పౌరుడు ఎలా అవుతాడో వివరిస్తుంది. ఏ ఒక్క పత్రాన్ని అధికారిక రుజువుగా ప్రకటించరు. వివాదాలు తలెత్తినప్పుడు న్యాయస్థానాలు పాస్‌పోర్ట్, ఓటర్ ఐడిలు, లేదా జనన ధృవీకరణ పత్రాల వంటి అనేక పత్రాలను పరిగణనలోకి తీసుకుంటాయి. ప్రతి పౌరుడు తప్పనిసరిగా కలిగి ఉండవలసిన సార్వత్రిక ధృవీకరణ పత్రం ఏదీ లేదు.




సాధారణ పత్రాలకు పరిమితులు ఉన్నాయి. పాస్‌పోర్ట్ ప్రధానంగా ఒక ప్రయాణ పత్రం. సుమారు కోటిమంది భారతీయులు మాత్రమే దీనిని కలిగి ఉన్నారు. దీనిని పోలీసు వెరిఫికేషన్ తర్వాత జారీ చేస్తారు. అయినప్పటికీ, ఇది పౌరసత్వాన్ని నిరూపించబోదని అధికారులు చెబుతున్నారు. ఆధార్ ఒక గుర్తింపు సంఖ్య మాత్రమే, పౌరసత్వ రుజువు కాదు. ఓటర్ ఐడిలు ఓటు హక్కును ధృవీకరిస్తాయే తప్ప పూర్తి పౌరసత్వ హోదాను కాదు. ఈ గందరగోళం మరింత తీవ్రమైంది. 2020లో పార్లమెంటులో అడిగినప్పుడు ఏ ఒక్క పత్రాన్ని రుజువుగా అంగీకరించడానికి హోం మంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఏ ఒక్క పత్రం ఈ విషయాన్ని తేల్చదని సుప్రీంకోర్టు, ఎన్నికల అధికారులు కూడా స్పష్టం చేశారు. అయినప్పటికీ, అగ్ర నాయకులు పదేపదే చేస్తున్న ప్రకటనలు భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) వంటి ప్రక్రియల సమయంలో ఈ భయం తీవ్రంగా ఉంటుంది. బిహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో లక్షలాది పేర్లను తొలగించారు. ప్రజలు ఓటు హక్కును కోల్పోవడంతో పాటు రేషన్, పెన్షన్లు, ఉద్యోగాలకు సంబంధించి ముప్పును ఎదుర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో, జాబితాల నుండి తొలగించబడిన మహిళలకు అన్నపూర్ణ భండార్ వంటి పథకాల కింద ప్రయోజనాలు నిరాకరించారు.సుప్రీంకోర్టు దీనికి సంబంధించిన కేసులను పరిశీలిస్తోంది.

ఎన్ఆర్‌సి, సిఎఎ చుట్టూ అల్లుకున్న రాజకీయాలు విభేదాలను మరింత తీవ్రతరం చేశాయి. సిఎఎ తర్వాత దేశవ్యాప్త ఎన్ఆర్‌సిని తీసుకువస్తామని నాయకులు వాగ్దానం చేశారు. వారు 'చొరబాటుదారులు' లేదా 'ఘుస్‌పైటియా' అని అన్నారు. ఈ పదాలు తరచుగా ముస్లింలను లక్ష్యం గా చేసుకుని, అనుమాన వాతావరణాన్ని సృష్టించాయి. అయినప్పటికీ, ఈ తొలగింపులు హిందువులను కూడా ప్రభావితం చేశాయి. వాస్తవానికి ఎంతమంది 'బంగ్లాదేశీయులు' లేదా 'పాకిస్తానీలు' కనుగొనబడ్డారనే దానిపై స్పష్టమైన వివరాలు వెల్లడికాలేదు. భయాందోళనల ప్రచారం కొనసాగింది. మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేనలకు 'చొరబాటుదారుల ఓటు బ్యాంకులు' ఉన్నాయని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి ప్రకటనలు మొత్తం ఓటర్ల సమూహాల విధేయతను ప్రశ్నిస్తాయి. ద్వంద్వ ప్రమాణాలు పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. సాధారణ పౌరులు అనుమానాలను ఎదుర్కొంటుండగా, కొంతమంది 'పూజ్యనీయ' (గౌరవనీయ) వ్యక్తులు జవాబుదారీతనం నుండి తప్పించుకుంటున్నారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఆలయ వ్యవహారాల్లో ఆర్థిక అవకతవకలకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. సిట్ తన నివేదికను సమర్పించింది. కానీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ట్రస్టును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, అతన్ని 'పూజ్యనీయ'గా పరిగణిస్తున్నందున బాధ్యతకు సంబంధించిన ప్రశ్నలను కొట్టివేస్తున్నారు. కుమార్ సూటిగా ప్రశ్నించారు: 'పూజ్యనీయ' హోదా అనేది సాధారణ పౌరసత్వం, చట్టానికి అతీతమైన ఒక కొత్త వర్గమా?

అందుకు విరుద్ధంగా, పౌరులు భయంతో జీవిస్తున్నారు. ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించడం వల్ల రేషన్లు, పెన్షన్లు లేదా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. తొలగింపు పౌరసత్వాన్ని దానంతట అదే రద్దు చేయదని ఎన్నికల సంఘం చెబుతోంది. అయినప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు భయాందోళనలను వ్యాపింపజేస్తున్నాయి. ప్రజలు న్యాయవాదుల కోసం డబ్బు ఖర్చు చేస్తూ ఒత్తిడితో జీవిస్తున్నారు.

ఇందులోని రాజకీయాలు స్పష్టంగా ఉన్నాయి. ఇది పత్రాల లీకులు, భూ కుంభకోణాలు, పాలన వైఫల్యాలు వంటి నిజమైన సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తుంది. ప్రజాగ్రహం పెరిగినప్పుడల్లా, పౌరసత్వ చర్చలు మళ్లీ తెరపైకి వస్తాయి. ఇది సమాజాన్ని విభజించి, విమర్శలను అణచివేస్తుంది. నాయకులు జవాబుదారీతనం నుండి గుర్తింపు భయాల వైపు దృష్టిని మళ్లిస్తారు.

భారతదేశ బలం దాని రాజ్యాంగంలో ఉంది. రుజువులు వెలువడే వరకు చాలామంది పౌరులుగానే భావించబడతారు. నిరంతర సవాళ్లు ఈ సూత్రాన్ని బలహీనపరుస్తాయి. ప్రభుత్వం ఈ అస్పష్టతను అంతం చేయాలి. సాధారణ విషయాలలో ఏ పత్రాలు సరిపోతాయనేది స్పష్టంగా పేర్కొనాలి. పౌరసత్వాన్ని ఒక రాజకీయ సాధనంగా ఉపయోగించడం మానుకోవాలి.

ఎస్ఐఆర్, ఎన్ఆర్‌సి వంటి ప్రక్రియలు పారదర్శకంగా ఉండాలి. బాధితులకు త్వరితగతిన పరిష్కారం లభించాలి. కేవలం ఓటర్ల జాబితా తొలగింపుల ఆధారంగా సంక్షేమ ప్రయోజనాలను నిలిపివేయకూడదు.

పౌరసత్వాన్ని నిరూపించే ఉమ్మడి పత్రం ఏదీ లేనప్పుడు, మరి ఏది నిరూపిస్తుంది? పౌరుల ప్రధాన ప్రశ్న సమాధానం లేకుండానే మిగిలిపోయింది. స్పష్టత లేకపోవడం భయానికి, దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తుంది. ప్రజాస్వామ్యంలో పౌరులు సురక్షితంగా భావించాలి. రాజకీయ కారణాల వల్ల వారి గుర్తింపును రోజూ ప్రశ్నించకూడదు.

ఈ నిరంతర చర్చ సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది ఇరుగుపొరుగు వారిలో అనుమానాలను రేకెత్తిస్తుంది. ఇది సంస్థలపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. పౌరసత్వాన్ని ఒక ఆయుధంగా మార్చే స్థితిలో భారతదేశం లేదు. నాయకులు గందరగోళంపై స్పష్టతను, విభజనపై ఐక్యతను ఎంచుకోవాలి. అప్పటి వరకు, లక్షలాది మంది తమ భారతీయ ఉనికికే ముప్పు వాటిల్లుతుందేమోనన్న సందేహాల నీడలో జీవిస్తారు.

ఈ వైరుధ్యం బాధాకరమైనది. సాధారణ భారతీయులు భద్రత ఆశిస్తూ ఆధార్ కోసం క్యూలలో నిలబడతారు. విమానాశ్రయాలలో నిస్సహాయంగానూ, అదే సమయంలో సాధికారత పొందినట్లుగానూ భావిస్తూ దానిని ఉపయోగిస్తారు. అయినా, అది పౌరసత్వాన్ని నిరూపించదని అధికారులు వారికి గుర్తుచేస్తారు. ఇలాంటి సందేహాలే ఇతర పత్రాలను కూడా వెంటాడుతున్నాయి. ఈ విష వలయం పౌరులను ఆందోళనతో, విభేదాలతో నింపుతుంది.

రాజకీయ ప్రకటనలకు వాస్తవ పరిణామాలు ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి జనన ధృవీకరణ పత్రాలు లేవు. కఠినమైన తనిఖీలు మొదలైతే, నిజమైన పౌరులు వేధింపులకు గురికావచ్చు. ఆన్‌లైన్ పౌరసత్వ పోర్టల్, భారతీయులు తమ హోదాను ధృవీకరించుకోవడానికి సులభమైన ప్రక్రియను అందించడం లేదు. అందులోని ఫారాలు ప్రధానంగా విదేశీయులను లేదా సీఏఏ దరఖాస్తుదారులను లక్ష్యంగా చేసుకుంటాయి.

ఈ అస్పష్టత ఒక ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది. ఇది ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, వారి దృష్టిని మరల్చుతుంది. నాయకులు చొరబాటుదారుల గురించి హెచ్చరిస్తుండగా, సాధారణ హిందువులు, ముస్లింల జాబితాలు తొలగించబడతాయి. దీని సందేశం చాలా శక్తివంతమైనది. మీ పౌరసత్వాన్ని ఎప్పుడైనా ప్రశ్నించవచ్చు. మౌనం గా ఉండండి. భారతదేశానికి తక్షణ స్పష్టత అవసరం. ప్రభుత్వం రోజువారీ వినియోగం కోసం ఆమోదయోగ్యమైన రుజువులను నిర్వచించాలి. సంక్షేమ పథకాలను ఓటర్ల జాబితా వివాదాలతో ముడిపెట్టకుండా అది నిర్ధారించాలి. ఎన్ఆర్‌సి, ఎస్ఐఆర్ ప్రక్రియలలో పారదర్శకమైన విధానాలు అత్యవసరం. కేసులను సకాలంలో పరిష్కరించడం భయాన్ని తగ్గిస్తుంది.

పౌరసత్వం ఒక ప్రాథమిక హక్కు. అది భద్రతకు హామీ ఇవ్వాలి, కానీ ఆందోళనను సృష్టించకూడదు. ప్రస్తుత రాజకీయాలు భారతదేశం ఒక సమ్మిళిత దేశం అనే భావనను బలహీనపరుస్తున్నాయి. ఇది ప్రజలను మత, ప్రాంతీయ ప్రాతిపదికన విభజిస్తుంది. నిరుద్యోగం, విద్య,అవినీతి వంటి తీవ్రమైన సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తుంది.

కొంతమంది పాత్రికేయులు దీని కారణంగా కలిగే మానవ మూల్యాన్ని సరిగ్గానే ఎత్తి చూపారు. కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుక్కున్న ఇళ్లను కోల్పోతామని ప్రజలు భయపడుతున్నారు. వారు పెన్షన్లు, ఉద్యోగాల గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ వాతావరణం పౌరులను ఆత్మరక్షణలో ఉంచడం ద్వారా అధికారంలో ఉన్నవారికి ప్రయోజనం చేకూరుస్తుంది.

రాజ్యాంగం సమానత్వం, న్యాయాన్ని వాగ్దానం చేస్తుంది. మతం లేదా రాజకీయాల ఆధారంగా పక్షపాత సందేహాలకు అది అనుమతించదు. పౌరసత్వ భావనను గౌరవించాలి. పదేపదే చేసే సవాళ్లు ఎన్నికల సంఘం, హోం మంత్రిత్వ శాఖ వంటి సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

నాయకులు పౌరసత్వంతో రాజకీయాలు ఆడుతున్నంత కాలం, సామాన్య భారతీయులు బాధపడతారు. ఈ ప్రమాదకరమైన ఆటను ముగించాల్సిన సమయం ఆసన్నమైంది. పౌరులు నిరంతర అనుమానాలకు కాదు, మనశ్శాంతికి అర్హులు. భారతదేశ ప్రజాస్వామ్యం దానిపైనే ఆధారపడి ఉంది.

# వ్యవసాయ సంక్షోభంతో పెరిగిన పట్టణీకరణ

## 'విబి – జి రామ్ జి' కి, ఇందిరమ్మ ఇండ్లకు దూరమైన పట్టణ పేదలు

దేశ వ్యాప్తంగా పట్టణ పేదలు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ఉపాధి, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. పాలకులు పట్టణ పేదలను విస్మరిస్తున్నారు. వ్యవసాయ రంగం ఆటుపోట్లకు గురై తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోవడం, దీనితోపాటు వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణ, గ్రామీణ పేదలు పట్టణాలకు ఉపాధి కోసం వెళ్లేందుకు కారణమైంది. గ్రామాల్లో వ్యవసాయ పనులపై మాత్రమే ఆధారపడి జీవించిన పేదలు పట్టణాలలో వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రభుత్వాలు పట్టణ పేదల గురించి, సంక్షేమ పథకాల అమలు గురించి ఆలోచన చేయడం లేదు. దశాబ్ద కాలంలో పట్టణీకరణ వేగం పుంజుకోవడంతో పట్టణాల జనాభా దాదాపు రెట్టింపు అయింది.

ఖమ్మం జిల్లా జనాభా 12 లక్షలకు పైగా ఉండగా ఒక ఖమ్మం నగరంలో ఐదులక్షలకు పైగా జనాభా కేంద్రీకృతమైంది. దేశ వ్యాప్తంగా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. పట్టణాల మౌలిక వసతుల కల్పన ప్రభుత్వాలకు భారంగా మారింది. ఇదే సమయంలో పట్టణ పేదలు ముఖ్యంగా నివాస స్థలాల సమస్యను ఎదుర్కొంటున్నారు.

**నివాస స్థలాల కోసం ఎదురు చూపు :**

ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చిన పేదలు అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఏ పట్టణమైనా చుట్టూ 20 నుంచి 30 కిలోమీటర్ల మేర వెంచర్లు విస్తరించాయి. పెరిగిన ధరలతో సామాన్యులు 50 గజాలు కూడా కొనలేని పరిస్థితి. సొంత స్థలం లేక అద్దెలు చెల్లించలేని పేదలు పట్టణ, నగర ప్రాంతాల్లో ఖాళీగా ఉండి నిరుపయోగంగా ఉన్న స్థలాల్లో గుడిసెలు వేసుకుని తలదాచుకుంటుంటే పాలకులు కన్నెర్రజేస్తున్నారు. సంపన్నులు, పారిశ్రామిక వేత్తలు ఏదో ఒక వంకతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోని పాలకులు పేదల గుడిసెలపైకి బుల్‌డోజర్లను పంపి కూల్చివేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో పాలకులు ఎవరైనా నివాస స్థలాలను పంపిణీ చేయలేదు. వామపక్షాలతో పాటు వివిధ సంఘాలు పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా పాలకులు స్పందించ లేదు. పెరిగిన పట్టణీకరణ నేపథ్యంలో ఇండ్ల స్థలాల డిమాండ్ రోజు రోజుకు పెరుగుతుంది. పట్టణ పేదలను గుర్తించి ఇండ్ల స్థలాల సమస్యకు ఒక పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో పాలకులు ఎవరైనా ప్రతిఘటన తప్పక పోవచ్చు. పారిశ్రామిక వేత్తలకు, ఇతర సంపన్న వర్గాలకు ఎకరాలకు ఎకరాలు కట్టబెడుతున్న పాలకులు పేదలకు నివాస స్థలాలు ఇచ్చేందుకు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇప్పటికైనా మొదలైన నివాస స్థలాల సాధన పోరాటాలు భవిష్యత్తులో మరింత బలపడే అవకాశం ఉంది.

**వర్తించని ఉపాధి హామీ :**

యుపిఎ ప్రభుత్వం హయాంలో పేదలకు ఉపాధి కల్పించేందుకు తీసుకు వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పట్టణ పేదలకు వర్తింపజేయలేదు. బిజెపి ప్రభుత్వం అప్పటి జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడంతో పాటు నియమ నిబంధనలలోనూ మార్పులు తీసుకువచ్చింది. రాష్ట్రాల వాటాను పెంచింది. ఇన్ని మార్పులు తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం పట్టణ పేదలకు మాత్రం అవకాశం కల్పించలేదు. పట్టణ పేదలకు విక్షిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి – జి రామ్ జి) పథకాన్ని వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో కొంత బడ్జెట్‌ను కేటాయించి విబి జీ రామ్ జీ పథకాన్ని వర్తింపజేస్తే పేదలకు కొంత ఊరటనిచ్చినట్లు అవుతుంది.

**ఇందిరమ్మకు దూరమేనా :**

ఇందిరమ్మ ఇండ్లకు నిరుపేదలు దూరంకాక తప్పటం లేదు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎల్1, ఎల్2, ఎల్3 అని ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులను మూడు కేటగిరీలుగా విభజించారు. మొత్తం ఇందిరమ్మ ఇంటి కోసం వచ్చిన దరఖాస్తులను ఎల్1, ఎల్2, ఎల్3లుగా విభజించి ఎల్1లో నివాస స్థలం ఉండి ఇండ్లు లేని వారిని చేర్చారు. ఎల్2లో స్థలం, ఇల్లు రెండు లేని వారిని చేర్చారు. ఎల్3లో ప్రస్తుతానికి నివాసం ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసిన వారిని ఎల్3లో చేర్చారు. అయితే పట్టణ ప్రాంతాల్లో ఎల్2లో ఉన్నవారే అధికంగా ఉన్నారు. నివాస స్థలం లేదన్న కారణంతో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయడం లేదు. దీనితో పట్టణాల్లో నివసిస్తున్న పేదలు ఇందిరమ్మ ఇండ్లకు దూరమవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం లక్షల సంఖ్యలో ఇండ్లు మంజూరు చేశామని చెబుతున్నా దానిలో నివాస స్థలం లేని పట్టణ పేదలకు అవకాశం దక్కడం లేదు. నివాస స్థలాలను పంపిణీచేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తేనే పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్దిదారులుగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నివాస స్థలాలపై దృష్టిసారిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. లేకపోతే పట్టణాల్లో జాగాలేని నిరుపేదలు ఇందిరమ్మ ఇంటికి దూరం కావాల్సిందే. అయితే ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నివసించే ఇండ్ల సమూహాలలో అవకాశం కల్పిస్తే కొంత ఉపశమనం పొందుతారు.

**వెంకట్, ఖమ్మం**

ప్రజాపక్షం
Telugu National Daily


# భవిష్యత్తులో ఎల్కతుర్తి మరింత అభివృద్ధి

- రహదారి నిర్మాణంతో గ్రామాలకు కనెక్టివిటీ
- బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భవిష్యత్తులో అభివృద్ధిలో మరింత ముందంజలో నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి జంక్షన్ వద్ద మడిపల్లి నుండి ఎల్కతుర్తి జంక్షన్ వరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్పర్సన్ & హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీలతో కలసి సోమవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామాలకు మండల కేంద్రానికి రహదారి అనుసంధానం (కనెక్టివిటీ) పెరుగుతుందన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి కోర్టు, విద్యుత్ ఉప కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలు వస్తున్నాయన్నారు. తద్వారా ఎల్కతుర్తి మరింత అభివృద్ధిని భవిష్యత్తులో సాధిస్తుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రహదారి నిర్మాణానికి అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలని కోరారు. రహదారి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి కావాలని సూచించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో కనెక్టివిటీ పెరిగి గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కుడా సీపీవో అజిత్ రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎల్కతుర్తి నుండి దామెర వెళ్లే ప్రధాన రహదారిని మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు**

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఉప సర్పంచ్ రాజు, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసిల్దార్ ప్రసాదరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫార్మా రంగంలో... తెలంగాణ అత్యుత్తమ ఫలితాలు

- మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కర్కపట్ల బయోటెక్ పార్కులో సిరో ఫార్మా కంపెనీని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం ఫార్మాకు బ్రాండ్ ఇమేజ్ సాధించుకొని అదే పరంపర కొనసాగిస్తుండగా, క్యాన్సర్ నిర్మూలనకు సిరో ఫార్మా చక్కటి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రతి పది మందిలో ఐదుగురు క్యాన్సర్ బారిన పడుతుండగా, భవిష్యత్తులో క్యాన్సర్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యాన్సర్‌కు సంబంధించిన ఔషదాలను రోగులకు తక్కువ ధరలో అందించడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. అయితే పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉండగా, ఇకో సిస్టమ్‌ను ఇంకా బలోపేతం చేసి సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రగతి, పరిశ్రమల ఏర్పాటు, ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫార్మాను ప్రతిపక్ష పార్టీలు అడ్డుకుంటుండగా, తాము వెనక్కి తగ్గడం లేదని అన్నారు. అలాగే మింట్ పాలసీని ఆపాలని చూస్తున్నప్పటికీ సరికొత్త వ్యూహాలతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. అంతే కాకుండా జహీరాబాద్‌లో నేషనల్ మోడల్ మాన్యుఫాక్చరింగ్ జోన్ చేయాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం నుండి లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరో సంస్థ చైర్మన్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.



# విద్యాసంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 10న పిలుపునిచ్చిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విలీనం, పోస్టుల భర్తీ ఆలస్యం, మౌలిక వసతుల కొరత కారణంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ సంక్షోభంలో పడిందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, విద్యా సంస్థలకు తగిన నిధుల విడుదల, ఎన్ఇపి2020పై విస్తృత చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. బంద్‌ను విద్యార్థులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# అటవీ, పర్యావరణ శాఖలు బలోపేతం

- నూతన ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌కు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అటవీ, పర్యావరణ శాఖలను బలోపేతం చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల పర్యావరణ, అటవీశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్ సోమవారం జూబ్లీహిల్స్‌లోని మంత్రి కొండా సురేఖ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాఖలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడవుల సంరక్షణ వంటి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పలు కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మధ్య సంక్షిప్తంగా చర్చ జరిగింది.


# విప్‌ల కార్యాలయాలు ప్రారంభం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ ప్రాంగణంలో శాసనమండలి విప్ లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, శాసన సభ విప్ వేముల వీరేశం నూతన కార్యాలయాలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే తెలంగాణ శాసనసభ చరిత్రలో తొలిసారిగా ఏర్పాటు చేసిన మీడియా అడ్వైజరీ కమిటీ ప్రత్యేక కార్యాలయాన్ని కూడా వారు ప్రారంభించారు. దేశంలో ఏ రాష్ట్ర శాసనసభలోనూ, పార్లమెంట్‌లోనూ లేని విధంగా ఈ ప్రత్యేక కార్యాలయాన్ని తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో మీడియా అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోచైర్మన్ పరిపూర్ణ చారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# రక్షణ, అంతరిక్ష రంగాల్లో తెలంగాణ యువత సత్తా చాటాలి

- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రక్షణ, అంతరిక్ష పరిశోధనలు, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలంగాణ యువత మరింత ముందుకు రావాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని, ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే ప్రపంచ స్థాయి అవకాశాలను కూడా అందిపుచ్చుకోవచ్చని ఆయన ఉద్బోధించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి, ఎన్‌సిసి క్యాడెట్ కె. యాదయ్య భారత వాయుసేనకు చెందిన బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ (ఐఎఎం)లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'సతత శయనానుసంధానం' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వేలాది మంది యువతలో అత్యంత కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపికైన కొద్దిమంది అభ్యర్థుల్లో యాదయ్య ఒకరిగా నిలవడం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఇది వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, రాష్ట్ర యువత సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.శాస్త్రీయ పరిశోధనలు, రక్షణ వ్యవస్థ, అంతరిక్ష విజ్ఞానం వంటి వ్యూహాత్మక రంగాల్లో భారతదేశం ప్రపంచ నాయకత్వం వైపు అడుగులు వేస్తున్న ఈ తరుణంలో యువత తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జెపిఎన్‌సిఈ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, ప్రిన్సిపాల్ డా.పి.కృష్ణమూర్తి, సాయితేజ, ఈఈఈ విభాగాధిపతి వెంకటేష్, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సందర్శించే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదు

కెసిఆర్, కెటిఆర్‌పై కాంతం తీవ్ర విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శించే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకోవడానికే ఈ ప్రాజెక్టును నిర్మించారని విమర్శించారు. అలాగే, నయీం వ్యవహారం, విదేశీ పెట్టుబడులు, నిజాం ఆస్తులు తదితర అంశాలపై కూడా కేసీఆర్ కుటుంబంపై పలు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఎన్‌డిఎస్ఎ సూచనల మేరకే ప్రభుత్వం కాళేశ్వరం అంశంలో నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.

# నత్తనడకన సర్ డిజిటలైజేషన్

- కేవలం 7.8 శాతం మాత్రమే పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ పనులు అత్యంత నత్తనడకన సాగుతున్నాయి. తాజాగా అందిన అధికారిక నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా కేవలం 7.80 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో 3,06,21,142 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. దీనితో రాష్ట్రంలో మొత్తం 90.52 శాతం ఫారాలు పంపిణీ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టమవుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో పంపిణీ వేగంగా జరిగినప్పటికీ, వాటిని ఆన్‌లైన్ సిస్టమ్‌లోకి అప్‌లోడ్ చేసి, డిజిటైజేషన్ ప్రక్రియలో మాత్రం తీవ్ర ఆలస్యం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 26,38,708 ఫారాల డిజిటైజేషన్ మాత్రమే పూర్తయింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే, నిర్మల్, జోగులాంబ గద్వాల జిల్లాలలో వంద శాతం ఫారాల పంపిణీ పూర్తి చేసి ముందంజలో నిలిచాయి. ఇక డిజిటైజేషన్ ప్రక్రియలో యాదాద్రి భువనగిరి జిల్లా 34.88 శాతంతో రాష్ట్రంలోనే అత్యధికంగా రికార్డు సృష్టించింది. దీని తర్వాతి స్థానంలో ఖమ్మం జిల్లా 20.90 శాతం డిజిటైజేషన్‌తో మెరుగైన పనితీరును కనబరిచింది. మరోవైపు, రాజధాని హైదరాబాద్ పరిసర జిల్లాలు ఈ ప్రక్రియలో అత్యంత వెనుకబడి ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో డిజిటైజేషన్ కేవలం 1.08 శాతం మాత్రమే నమోదై రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచింది. అలాగే రంగారెడ్డి జిల్లాలో 2.48 శాతం, వికారాబాద్‌లో 2.67 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5.51 శాతం మాత్రమే డిజిటైజేషన్ పనులు పూర్తయ్యాయి. అధికారులు ఫారాల పంపిణీని వేగంగా పూర్తి చేసినప్పటికీ, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఎన్నికల సంఘం యంత్రాంగం ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

# 'సర్' గడువు పెంచాలి

- సిఇఒకు బిఆర్ఎస్ వినతి
- డూప్లికేట్ ఓట్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ బిఆర్ఎస్ నేతలు సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, సోమా భరత్, కర్నె ప్రభాకర్, వై.సతీష్ రెడ్డి, సుమిత్రానంద్ తదితరులు సిఈఓను కలిశారు. అనంతరం మాజీ ఎంపి వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు పార్టీ తరపున ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బిఎల్ఓల పనితీరుపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, వాటన్నింటిని సిఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పలుచోట్ల బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణి చేయడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చాలా మంది ఓటర్లకు ఇప్పటికీ ఫారాలు అందలేదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికి మరో 20 రోజులే గడువు ఉండటంతో, ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా గడువును పొడిగించాలని కోరినట్లు తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని సిఈఓ హామీ ఇచ్చారని వినోద్ కుమార్ చెప్పారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరామన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లయితే వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. అదే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ల పేర్ల నమోదులో కూడా గందరగోళం నెలకొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వినోద్ కుమార్ తెలిపారు. పేర్లు, ఇతర వివరాల్లోని పొరపాట్ల సవరణపై బిఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పాటు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిఈఓను కోరినట్లు చెప్పారు.

# క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యం



- యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు యువ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించనున్న యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ తదుపరి సీజన్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో నగరంలోని సుమారు 20 ప్రైవేట్ ఫుట్‌బాల్ అకాడమీలు, క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. లీగ్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం, ప్రతిభావంతులైన యువ ఫుట్‌బాలర్లను గుర్తించి ప్రోత్సహించడం, తెలంగాణలో సుస్థిర ఫుట్‌బాల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ ఏడాది జనవరి, జూన్ నెలల్లో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య సహకారంతో స్కౌటింగ్ బృందాలను ఏర్పాటు చేసి యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్‌కు రెండు పైలట్ ఎడిషన్‌లను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ అనుభవాల ఆధారంగా ఈసారి బాలురు, బాలికల విభాగాల్లో వివిధ వయోపరిమితి కేటగిరీలలో పూర్తి స్థాయి లీగ్‌ను నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.సోనిబాలా దేవి, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య టెక్నికల్ డైరెక్టర్ సయ్యద్ షబీర్ పాషా, భాగస్వామ్య సంస్థ స్పోర్ట్స్ ప్యాడాక్ వ్యవస్థాపకుడు పృథ్వి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, కోచ్‌లు, వివిధ ఫుట్‌బాల్ అకాడమీలు, క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. యువ ఫుట్‌బాలర్లకు నాణ్యమైన పోటీ వేదికను అందించడంతో పాటు రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు బలోపేతమైన పునాది వేయడంలో యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ కీలక పాత్ర పోషిస్తుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు అధికారులు తెలిపారు.

# మరో 7 పిఎసిఎస్‌లకి ప్రత్యామ్నాయ పిఐసిల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని మరో 7 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పిఎసిఎస్) ప్రత్యామ్నాయ నాన్‌అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (పిఐసి) కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకారం ఈ కమిటీ ఆరు నెలలపాటు లేదా ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందన్నారు. కరీంనగర్ జిల్లాలోని దేవంపల్లి, గట్టుదుద్దెనపల్లి, యాదాద్రి జిల్లా భువనగిరి, చందుపట్ల బిబినగర్, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి, వికారాబాద్ జిల్లాలోని పూడూరు పిఎసిఎస్‌లకు ప్రత్యామ్నాయ నాన్‌అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలను నియమిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలు వెంటనే బాధ్యతలు స్వీకరించి ఆయా సహకార సంఘాల నిర్వహణను పర్యవేక్షించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ అండ్ రిజిస్ట్రార్‌ను మంత్రి ఆదేశించారు.

# ప్రజలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్



- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలాడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జియో టెక్నికల్ రిపోర్టులు, ఇతర సాంకేతిక పరీక్షల ద్వారా డ్యాం సేఫ్టీ చర్యలు తీసుకోలేదని, 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ' (ఎన్‌డిఎస్ఎ) స్పష్టం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రిపేర్ పనులు ప్రారంభించకపోవడం వారి ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు సోమవారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిని పూర్తిగా మర్చిపోయారని, కేవలం కొందరు అధికారులపై నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై రేవంత్‌రెడ్డికి ఉన్న ఈ హఠాత్తు మమకారం వెనుక రహస్యం ఏంటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**హైడ్రా పేదల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చుతున్న కాంగ్రెస్**

హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' పేరుతో పేదవాళ్ల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూలగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం పార్టీకి సంబంధించిన అక్రమ కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని రాంచందర్‌రావు ప్రశ్నించారు. ఎంఐఎంకు సంబంధించిన ఫాతిమా విద్యాసంస్థలు స్పష్టంగా నిబంధనలను ఉల్లంఘించిందని, విద్యాశాఖ కూడా అనుమతులు లేవని కోర్టుకు తెలిపిందని ఆయన తెలిపారు. హైడ్రా కూడా ఇది ఆక్రమణే అని అంగీకరించినప్పటికీ, ఫాతిమా విద్యాసంస్థల భవనాలను ఎందుకు కూల్చివేయడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంఐఎంతో ఉన్న దోస్తీ వల్లే వివక్ష చూపుతున్నారని, హైడ్రా అంటే కేవలం పేదవాళ్ల ఇళ్లను కూల్చడానికే ఉందా అని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎంఐఎంకు చెందిన అక్రమ సంస్థపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా పక్షపాత వైఖరిపై బిజెపి పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేస్తుందని రాంచందర్ రావు హెచ్చరించారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్-57

**NIT No.** 13/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27, **పని పేరు:** 51 కంప్యూటర్ ఆపరేటర్లు (1 నెం.లు), **అంచనా విలువ:** రూ. 18.50 లక్షలు, **ప్రారంభ తేది:** 06.07.2026 మ.2:00గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 09.07.2026 మ.2:30గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 7893066262, హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సెల్ నెం. 9063836115. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సీఎంసి.**

**DIPR R.O. No. : 5571-PP/CL/ADVT/2026-27, Date: 06-07-2026**

**ఇస్నాపూర్ పురపాలక మండలి కార్యాలయం**
సంగారెడ్డి జిల్లా.

**E1/MP/ENGG/15/2026** — **ఆసక్తి వ్యక్తీకరణ** — **తేదీ: 06.07.2026**

ఇస్నాపూర్ పురపాలక సంఘంలో రెండు సంవత్సరాల కాలానికిగాను ఎలాంటి గ్రాంటుల తోనైనా ఇస్నాపూర్ పురపాలకసంఘం పరిధిలో సమగ్ర భూగర్భ మురుగునీటి పథకం, నీటి సరఫరా ప్రాజెక్టు, రోడ్ల అభివృద్ధి, ఉద్యానవనాలు, నాలుగురోడ్ల కూడళ్ళ మెరుగుదలలు, భవంతులు, కాలువలు, ఇత వివిధ అభివృద్ధి పనులు కింద డిపిఆర్‌లను సిద్ధం చేసేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్ల (ఇదే తరహా పనులలో)నుండి సీల్డు కవర్లలో ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం.ఆసక్తి ఉన్నవారు రూ.5000/-లు డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించి ఆర్ఎఫ్‌పి డాక్యుమెంటు కోసం దరఖాస్తు చేసుకోగలరు. ఇస్నాపూర్ పురపాలకసంఘం కమిషనర్ పేరుతో ఈ డిమాండ్ డ్రాఫ్టులు ఇవ్వాలి.
షెడ్యూలు జారీ చేయడానికి చివరితేదీ: తేదీ: 10.07.2026. సమయం సాయంత్రం 4.00 గంటలు.
ఆసక్తి వ్యక్తీకరణ సీల్డు కవర్లు సమర్పించే చివరి తేదీ. తేదీ:10.07.2026 సమయం సాయంత్రం 4.30 గంటలు

**షరతులు:**

1. కన్సల్టెంట్ ఏ రాష్ట్రంలోనైనా, ఏ విభాగంలోనైనా ఎంప్యానల్ చేసుకుని ఉండాలి.
2. తెలంగాణ రాష్ట్రంలోని ఒకేఒక యుఎల్‌బిలో రూ.100 కోట్లకు తక్కువ కాకుండా ఉన్న ప్రాజెక్టులో పనిచేసి ఉండాలి.
3. ఆర్థిక లావాదేవీల పరంగా గడచిన ఐదు సంవత్సరాలలో ఆ సంస్థ సగటున రూ.5.00 కోట్లు టర్నోవరు చేసి ఉండాలి.
4. ఇదే తరహా పనులలో అనుభవం ఉన్న కన్సల్టెంట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
5. పై షరతులను నెరవేర్చగల / అంగీకారం తెలియజేసే సంస్థలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
6. సీలు చేసిన ఇ.ఓ.ఐలను సమ్మతించడానికి లేదా తిరస్కరించడానికి ఇస్నాపూర్ పురపాలకసంఘం కమిషనర్‌కు సంపూర్ణ అధికారాలు ఉన్నవి.

వివరణాత్మకమైన విధివిధానాలను మరియు ఆర్థిక బిడ్ ఫార్మాట్‌ను అభ్యర్థన మేరకు ఆసక్తిగల సంస్థలకు ఇవ్వబడును. ఇతర పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పురపాలక సంఘం కమిషనర్‌ను కార్యాలయం పనివేళల్లో సంప్రదించగలరు.

**సం/- కమిషనర్**
**స్థలం: ఇస్నాపూర్** — **ఇస్నాపూర్ పురపాలక సంఘం**

**DIPR R.O. No. : 5596-PP/CL/ADVT/2026-27, Date: 06-07-2026**

# ఓవర్ మెన్ ఖాళీలను భర్తీ చేయాలి

ఎస్‌కె బాజీ సైదా

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** క్యాడర్ స్కీం ప్రకారం అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్లకు తక్షణమే ఓవర్ మెన్ గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) శ్రీరాంపూర్ ఏరియా నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి పిలుపులో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా మాట్లాడుతూ 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు క్యాడర్ స్కీం ప్రకారం మూడేళ్ల సర్వీస్ పూర్తి కాగానే ఓవర్ మెన్ గ్రేడ్ బి హోదాకు అర్హులవుతారని పేర్కొన్నారు. అయినప్పటికీ యాజమాన్యం ఖాళీలు లేవనే కారణంతో ప్రమోషన్లు నిలిపివేస్తోందని విమర్శించారు. మరోవైపు వారికి ప్రమోషన్ ఇవ్వకుండానే ఓవర్ మెన్ విధులు నిర్వహింపజేస్తున్నారని, దీనివల్ల సంస్థలో ఖాళీలు కనబడకుండా కృత్రిమంగా చూపిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం వెంటనే స్పందించి ప్రమోషన్లు కల్పించాలని, లేనియెడల ఈ నెల 22 నుంచి మొదటి షిఫ్ట్ నుండి సీనియర్ మైనింగ్ సర్దార్లు తమ మైనింగ్ సర్దార్ డ్యూటీలు మాత్రమే నిర్వహిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు, బ్రాంచ్ మైనింగ్ స్టాఫ్ అధ్యక్షులు అడ్డు శ్రీనివాస్, నాయకులు గొర్రె నరసయ్య, శెట్టి శంకరయ్య, క్రాంతి, అఖిల్, కళ్యాణ్ పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/జన్నారం :** జులై 7న జరిగే ఎంఆర్‌పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం మంచిర్యాల జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. జన్నారం మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ మండల ఇన్చార్జి కొండపురి ప్రభుదాస్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి మందకృష్ణ మాదిగ సందేశాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిప్పకుర్తి మల్లేశం మాదిగ, జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, చిప్పకుర్తి సతీష్ మాదిగ, జంగం రవి పాల్గొన్నారు.

# మండల నూతన సెర్ప్ ఎపిఎం నియామకం



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ బావిత మండల సమైక్య నూతన ఎపిఎంగా నేరడిగొండ సిసి లింగరాజుని ఇన్‌చార్జిగా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఇదివరకు పనిచేసిన ఎపిఎం లీలారాణి,ని డిఆర్డీఏ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎపిఎం మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికై ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందేలా చూస్తామని అన్నారు.

# గోరింటాకు పూజలపై విశ్వహిందూపరిషత్ అభ్యంతరం

**ప్రజాపక్షం/నస్పూర్ :** మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఓ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గోరింటాకు పూజ, ఆడపడుచుల కొంగు బంగారం కార్యక్రమాలను రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నస్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్‌కు విశ్వహిందూ పరిషత్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి వేముల రమేష్ మాట్లాడుతూ గోరింటాకు పూజ, ఆడపడుచుల కొంగు బంగారం వంటివి పూర్తిగా హిందూ సంప్రదాయాలకు చెందిన కార్యక్రమాలని పేర్కొన్నారు. ఖంఖాఎ పంజాతన్ ఎ గుల్షనా ఎ వార్సి చమన్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు మతమార్పిడులు, లవ్ జిహాద్ వంటి అంశాలను ప్రోత్సహించేలా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయా మతాలకు సంబంధించిన సందల్, ఉరుసు, ఖవ్వాలి వంటి కార్యక్రమాలను నిర్వహించుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే హిందూ మహిళలతో ఈ తరహా పూజలు నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, నగర అధ్యక్షుడు మొగిలయ్య, కార్యదర్శి రాజేశం, హిందూ వాహిని విభాగ్ ప్రముఖ్ ఆదర్శ్ భారతీయన్, బిజెపి సీనియర్ నాయకులు తుల మధుసూదన్ రావు, బద్రి నారాయణ, కటుకూరి తిరుపతి, భీమయ్య, సందీప్ పాల్గొన్నారు.

# ముఖర్జీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** దేశ ఐక్యత కోసం పోరాడిన మహనీయుడు, భారతీయ జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని బిజెపి నాయకుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణ బిజెపి కార్యాలయంలో ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత, అఖండత కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముఖర్జీ పోరాడారని కొనియాడారు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవంటూ కాశ్మీర్ విలీనం కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం మరవలేనివన్నారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా జీవించిన ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# విద్యార్థినిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలకేంద్రంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిలకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మెన్ షేక్ అజీమ్ లాల్ జుక్కల్ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా నోటుబుక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ చేతుల మీదుగా విద్యార్థులకు నోటుబుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమగు విద్యా సామాగ్రిని అందించడం గొప్ప సామాజిక సేవా అని కొనియాడారు. సమాజ అభివృద్ధికి విద్యే బలమైన ఆయుధమని, ప్రతీ విద్యార్థికి అండగా నిలవడం ప్రతీ ఒక్కరి భాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు కేక్ కట్ చేసి వారికి తినిపించడమే కాకుండా చిన్నారులతో ఆనందాన్ని పంచుకున్నారు. నాయకులు, విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిసుదర్శన్‌రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ పురోగతిపై సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బిఎల్ఒలు, సూపర్‌వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మంగళవారంలోగా పూర్తిచేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించే విషయంలో ఓటర్లకు సహకరించేలా పట్టణ ప్రాంతాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, వివరాల డిజిటలైజేషన్ సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా బిఎల్ఓ సూపర్‌వైజర్లు ఎన్యుమరేషన్ ఫారంల స్క్రూటినీలో అప్రమత్తంటా ఉండూ కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారంపై ఓటరు సంతకం, లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బిఎల్ఓ సంతకం ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కాగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వివరాలు పంపాలన్నారు,. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 96 శాతం పూర్తయిందని అర్బన్‌లో కూడా మంగళవారం వరకు పూర్తి చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్లకు సహకరించేలా నగరంలో సర్కిల్ వారిగా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డపీఈఓ శ్రీనివాస్‌రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అర్జీదారులు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని నగారే శ్యాంరావు, ఆగిపోయిన పింఛన్‌ను పునరుద్ధరించాలని బుర్క వెంకటి దరఖాస్తు చేసుకున్నారు. భూ ఆక్రమణలపై వక్కులం గ్రామానికి చెందిన పార్వతి, భూమి పట్టా సమస్యపై చునార్కార్ మురళీబాయి, రహదారి ఆక్రమణపై శేఖ నాబోతుమ్మ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వెంకటులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తాజుదీన్



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ఇందిర పార్క్‌లో జరిగే మహాధర్నకు సదాశిపేట నుంచి సిపిఐ నాయకత్వం తరలి వెళ్లారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో ప్రతి పేద వాడికి ఇంటి స్థలం, పూరి గుడిసె వేసుకున్న వారికి పట్టాలిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు అవుతన్నప్పటికీ గత ఎన్నికలు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తాజుదీన్ విమర్శించారు.

అధికార పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ఇందిరాపార్క్‌లో వామపక్ష పార్టీలతో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదాశివపేటలో వేసుకున్న ప్రతి పూరిగుడిసెకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇల్లు జాగ ఉన్నవారికి ఇందిరమ్మ, నిర్మాణం కింద ఆరు లక్షల రూపాయాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వామ పక్షాల ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపటడం జరిగింది. ఈ ధర్నాకు సదాశివపేట నుంచి ఎం.ఎ.రెహమాన్, ఉస్తపా, వెంకట్ గౌడ్, జ్యోతి సాదకలి కళావత, తస్లీమ్, రాజమ్మ, తదితరులు వెళ్లారు.

# ఎస్ఆర్‌పి 3 గనిలో వరుస ప్రమాదాలు

గనుల్లో సన్నగిల్లుతున్న భద్రత
ఎస్ఆర్‌పి 3 గనిలో ప్రమాదం..
కార్మికుడికి తీవ్ర గాయం



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఎస్ఆర్‌పి 3 భూగర్భ గనిలో అధికారుల ఒత్తిడి, నిర్లక్ష్య వైఖరి కారణంగా వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం జరుగుతున్న ఈ సంఘటనలతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గనిలో మొదటి బదిలీలో జరిగిన ప్రమాదంలో ట్రామర్‌గా విధులు నిర్వర్తిస్తున్న చుంచు పోశమల్లు అనే కార్మికుడి కుడికాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు అధికారులకు సమాచారం అందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కరీంనగర్ లోని సన్ షైన్ ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. గనిలోని త్రీ సిమ్, త్రీ లెవెల్‌లో ఎండ్‌లెస్ వద్ద ఖాళీ టబ్బులను తీసుకెళ్తున్న సమయంలో కుక్క కడుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కార్మికులు తెలిపారు.

యాజమాన్యం నాణ్యమైన కుక్కలను అందించడం లేదని, ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంతో పట్టించుకోలేదని వారు వాపోయారు. రక్షణ సూత్రాలను పక్కనపెట్టి, కేవలం ఉత్పత్తే లక్ష్యంగా అధికారులు కార్మికులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కార్మికులు వారి పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో సైతం అదనపు పనులు చేయాలంటూ వేధిస్తున్నారని ఆవేదన చెందారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్నతాధికారులు రక్షణ వారోత్సవాలను ఆర్భాటంగా నిర్వహిస్తున్నప్పటికీ, భూగర్భ గనులలో మాత్రం రక్షణ చర్యలు పూర్తిగా సన్నగిల్లుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గనులలో భద్రత ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకొని కార్మికుల్లో ధైర్యం నింపాలని డిమాండ్ చేశారు.

# ఇష్టపడి చదవండి.. లక్ష్యాన్ని సాధించండి

పటాన్‌చెరు శాసన సభ్యుడు
గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** ఇష్టపడి చదివి క్రమశిక్షణతో ముందుకు సాగితే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చునని పటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో ఎంకెపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి ప్రభావంతులకు నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంకెవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు రూ.5,000ల చొప్పున నగదు పుసర్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ భవిష్యత్తుకు బంగారు బాటను వేస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలో అత్యాధునిక సౌకర్యాలతో పాటు ఆధునిక వసతులతో కూడిన భవనాలు నిర్మించి అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. పటాన్చెరు కేంద్రంలో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీమాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు అశోక్, ప్రభాకర్, వెంకటేష్, ,రాజు ఇమాన్ ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షుడు మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రజాసమస్యలే ప్రభుత్వ ధ్యేంగా ఒక వైపు ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే శివ్వంపేట మండలంలో మాత్రం ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. వివిధ రకాల ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న శివ్వంపేట మండలంలో మాత్రం ఏ శాఖకు సంబంధించిన అధికారి మాత్రం సమయపాలన పాటించకపోవడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే అని ఆయన అన్నారు. ఇలాంటి అధికారుల నిర్లక్ష్యం వల్లే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్నారని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/మెదక్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని దెబ్బతిన్న ప్రధాన రహదారులకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ నవీన్ అధికారులను ఆదేశించారు. సోమవారం చమన్, దాయర, పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లోని రోడ్లను కమిషనర్ నవీన్, కాంగ్రెస్ నాయకులు కానుగు భూపతి రాజు, పూసల సంతోష్ కౌన్సిలర్లు మన్సూర్ అహ్మద్, గౌస్ ఖురేషి, మాజి కౌన్సిలర్లు అవారి రాజశేఖర్, డిఇ సత్యనారాయణ, ఇఇ నితిన్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పరిస్థితిని పరిశీలించి, అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన రోడ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో నాయకులు గాజుల సురేష్ తదితరులు ఉన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు సత్వరంగా ,పారదర్శకంగా పరిష్కరించడానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోన గ్రివెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి వివరాలను తెలుసుకుని సంబందిత శాఖల జిల్లా అధికారులకు వినతులను అందజేసి తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 66 ఫిర్యాదులు అందినట్లు అదికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 35, సంగారెడ్డి డివిజన్ లో 13, అందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్, డివిజన్‌లో 6, జహీరాబాద్ డివిజన్ లో 12 పిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ,కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 131 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ సాయన్న, ఏసీపీ ప్రకాష్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భీమ్‌గల్ ప్రధాన రహదారి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** గత సంవత్సరం కురిసిన వర్షం వరదతో భీమ్‌గల్ బడాభీమ్‌గల్ వెళ్లే మార్గంలో బ్రిడ్జి నుంచి అర కిలోమీటర్ వరకు రోడ్డు తెగిపోయి గుంతలుగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. పలు ప్రాంతాలకు ప్రధాన రహదారి కావటంతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చొరవతో ప్రధాన రహదారి మరమ్మతుల పనులు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బోదిరే స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, జెజె నర్సయ్య ప్రారంభించి మాట్లాడారు.

పలు గ్రామాలతో పాటు జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి ఇదే ప్రధానం కావటంతో ప్రజల ఇబ్బందులు గ్రహించి మరమ్మతులు కోసం పనులు ప్రారంభించామన్నారు. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నాణ్యమైన రోడ్డును నిర్మించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బోదిరే స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, జెజె నర్సయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# టిజిఎస్ఆర్టీసి కార్గో పార్సిల్ సేవల్లో 10 శాతం ఛార్జీల తగ్గింపు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రయాణీకులు, వ్యాపారులు వినియోగదారులకు టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో కార్గో మిగిలిన పార్సిల్ సేవల ఛార్జీలపై 10 శాతం తగ్గింపు కల్పిస్తున్నట్లు 1 డిపో మేనేజర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ 1 డిపో కార్గో, పార్సిల్ కార్యాలయానికి సంబంధించిన అన్‌క్లెయిమ్ పార్సిల్ ఈనెల 7న బస్టాండ్‌లోని కార్గో కార్యాలయం ముందు మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ప్రజలు, వ్యాపారులు నిర్ణీత సమయానికి హాజరై వేలంలో పాల్గొనాలని కోరారు.

# కోర్టు భవనాన్ని పరిశీలించిన ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఇటీవల నిర్మాణం పూర్తయిన నూతన కోర్టు భవనాన్ని సోమవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు సందర్శించి పరిశీలించారు. త్వరలో ప్రారంభం కానున్న భీమ్‌గల్ కోర్టు కార్యకలాపాల దృష్ట్యా భవనంలోని మౌలిక సదపాయాలు, కోర్టు హాళ్లు, న్యాయవాదుల గదులు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీన్, సీనియర్ న్యాయవాది భూపతిరెడ్డి, న్యాయవాదులు ఏలేటి గంగాధర్, చైతన్య, సురేష్ తదితరులు భవనాన్ని సందర్శించారు. కోర్టు ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించినట్లు సమాచారం. కోర్టు ప్రారంభోత్సవాన్ని త్వరలోనే నిర్వహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** భారత మాజీ ఉప ప్రదాని దేశంలో సామాజిక న్యాయ సాదనకు అవిరళ కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్మ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి స్థానిక మాజీ ప్రతినిధులు ,పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు బిక్షపతి శంకర్ వెంకటేశ్ బల్వంత బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ,వివిధ సంఘాల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం Telugu National Daily


## రాష్ట్రంలో... అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుండగా, పూరి గుడిసె లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా ములుగులో లబ్ది దారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను వారు పంపిణీ చేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తుండగా, రెండవ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్ లో నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇండ్లకు నిధులు ఇస్తుండగా, రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా వర్తింపజేస్తుండగా, అర్హులైన ప్రతి పేద లబ్ది పొందాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో అరకొర ఇండ్లు కేటాయించగా, సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అత్యధికంగా మంజూరు చేసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట ఆంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, ఆత్మ కమిటీ చైర్మన్ కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళా కళాశాలకు జాతీయస్థాయి అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు జాతీయస్థాయి బెస్ట్ ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు 2026 లభించింది. కళాశాల తరఫున చైర్మన్ వూటుకూరి నరేందర్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డును జూలై 4న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని గురుగ్రామ్‌లో ఉన్న హోటల్ లెమన్ ట్రీలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో స్వీకరించారు. అజిలెక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డు కార్యక్రమంలో 1983 ప్రపంచ కప్ విజేత, మాజీ భారత క్రికెట్ జట్టు సభ్యుడు, మాజీ బీసీసీఐ సెలక్షన్ కమిటీ చైర్మన్ సందీప్ పాటిల్ చేతులమీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ భారత హై కమిషనర్ అంబాసిడర్ సంగీత బహదూర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడం, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడం, కెరీర్ మార్గదర్శకత్వం ద్వారా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును రాష్ట్రంలోని కరీంనగర్‌కు చెందిన ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ జర్నలిస్టులదే



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమానంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (హెచ్–143) వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేములవాడ ప్రెస్ క్లబ్ భవనం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించబడిన జర్నలిస్టుల అందరి ఆస్తి అని పేర్కొన్నారు. ఈ భవనం ఏ ఒక్క జర్నలిస్టు సంఘానికి మాత్రమే పరిమితం కాకుండా, వేములవాడ ప్రాంతంలోని అన్ని జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలు, సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ కోసం ఏర్పాటు చేయబడిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏ ఒక్క సంఘానికే పరిమితం చేయకుండా, గుర్తింపు పొందిన వేములవాడ ప్రాంతంలోని అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు ఎలాంటి వివక్ష లేకుండా వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సభ్యులు జితేందర్, ఉపాధ్యక్షులు సిహెచ్.దేవరాజు, విష్ణు, జబ్బార్, పంపరి నాగరాజు, జిల్లా రమేష్, కముటాల విజయ్, చౌటుపల్లి వెంకటేష్, షబ్బీర్, ఇమ్రాన్, అజర్‌లు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో... కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన సినీ నటి అనసూయ

**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్‌లో కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభం



సందర్భంగా సినీ నటి అనసూయ భరద్వాజ్ ఆట పాటలతో సందడి చేశారు. కాగా కాసం ఫ్యాషన్స్ మాల్ ను అనసూయ భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, అధునాతన కలెక్షన్స్, నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందని స్పష్టం చేశారు. అయితే కాసం 28వ ఫ్యాషన్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందని ఆమె చెప్పారు. పట్టణంలో పెద్ద ఎత్తున షాపింగ్ మాల్ ప్రారంభించడంతో అనసూయ అభిమానులు, యువత పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రజల మన్ననలు పొందుతూ నాణ్యమైన వస్త్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ వస్త్ర దుకాణంతో గజ్వేల్ పట్టడంతో పాటు సమీప ప్రాంతాల 150 మంది యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి గుప్త, గాడిపల్లి భాస్కర్, రుక్మయ్య గుప్త,ప్రభాకర్ గుప్త, సంతోష్ గుప్త, అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, ఫణిత్, కాసం సాయికృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.


## మామిడి సాగులో శాస్త్రీయ విధానాలు పాటించి

# అధిక ఆదాయం పొందాలి




జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** మామిడి సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులను, రైతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడితో పాటు నాణ్యమైన పంటను సాధించి రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి మామిడి వర్క్ షాప్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొని మామిడి సాగులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతూ రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు విధానాలను అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. మామిడి వంటి ఉద్యాన పంటలు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, నాణ్యమైన నాట్లు, నీటి సంరక్షణ పద్ధతులు, ఉద్యాన పంటల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు విధానాలతో ముందుకు సాగాలని, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, ఉద్యాన రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ మామిడి రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను పొందవచ్చన్నారు. మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పురుగు వ్యాధుల నివారణ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ భగవాన్ మామిడి సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. నాణ్యమైన మొక్కల ఎంపిక, శాస్త్రీయ పద్ధతుల్లో తోటల ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి యాజమాన్యం, సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు తెగుళ్ల సమగ్ర నివారణ ,కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిల్వ, మార్కెటింగ్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, తహసిల్దార్ అబ్దుల్ మజీద్ , స్థానిక సర్పంచ్ సల్లూరి శోభన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ అధికారి లత, ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది, డ్రిప్ సిబ్బంది, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మామిడి రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## 10న చలో హైదరాబాద్

ఎఐటియూసి గౌరవాధ్యక్షుడు వెన్న మహేష్

**ప్రజాపక్షం/జగిత్యాల:** ఎన్ హెచ్ఎమ్ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 10న వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించనున్నచలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియూసి గౌరవాధ్యక్షుడు వెన్న మహేష్ పేర్కొన్నారు.
జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జగిత్యాల జిల్లా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెన్న మహేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యప్రసాద్ కు అందజేశారు.
ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సరైన గౌరవం, ఉద్యోగ భద్రత, సముచిత వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని, ఏజన్సీ వ్యవస్థను రద్దు చేయాలని, నేరుగా ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం 15,600 చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగులు చందు, సురేష్, తిరుమలేష్, భారతి సోమలక్ష్మి , జయమ్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** పిల్లల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఈనెల 13న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ఈనెల 13న 1 నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలందరికీ విధిగా నులిపురుగుల నివారణ మాత్రలు (అల్బెండజోల్) వేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం వైద్య ఆరోగ్య, విద్యా, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీ, మెప్మా, డి ఆర్ డి ఏ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ మాత్రల పంపిణీ, ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, మాత్రల ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈనెల 13న మాత్రలు వేసుకోలేకపోయిన పిల్లల కోసం ప్రత్యేకంగా ఈనెల 20న మలి విడత కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా వ్యవహరించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 2,59,365 మంది 1 నుండి 19 లోపు పిల్లలు ఉన్నారని, 924 పాఠశాలల్లో, 66 జూనియర్ కాలేజీల్లో, 777 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని 632 మంది ఆశాలు, 777 మంది అంగన్వాడీ టీచర్లు, 990 మంది పాఠశాల, కళాశాలల ప్రతినిధులు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీలో చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రల ప్రాధాన్యత తెలియజేయాలని, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులకు తప్పనిసరిగా మాత్రలు వేసేలా చూడాలని ఆదేశించారు. టామ్ టామ్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




ప్రజా పోరాటాల్లో చురుకైన

## పాత్ర పోషించిన వెంకన్న

**ప్రజాపక్షం/కరీంనగర్:** చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు దొంతరవేని వెంకన్న కమ్యూనిస్టు పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ విధేయుడుగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించేవాడాని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కొనియాడారు. గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన వెంకన్న కుటుంబాన్ని చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు.వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ వెంకన్న పార్టీ పట్ల, సైద్ధాంతిక అవగాహన కలిగించుకొని మండలంలో, గ్రామంలో సిపిఐ బలోపేతం కోసం కృషి చేసాడని, గ్రామ శాఖ కార్యదర్శిగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పార్టీ అప్పగించిన పనిని తూచా తప్పకుండా అమలు చేసేవాడని, నిరంతరం పార్టీ బలోపేతం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి వెంకన్న అని, నీతి నిజాయితీగా, అంకిత భావంతో ఉండేవాడని, అలాంటి నాయకుడు మృతి చెందడం అత్యంత బాధాకరమని వెంకన్న మృతి సిపిఐకి తీరని లోటని వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వెంకటరెడ్డి తెలిపారు. పరామర్శించిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తెరాల సత్యనారాయణ సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య,శాఖ కార్యదర్శులు మంద ఎల్లయ్య, ఎం.డి ఉస్మాన్ పాషా, ఎలగందుల రాజు , సిపిఐ మండల నాయకులు తాళ్ళపెల్లి చంద్రయ్య, బందెల శ్రీనివాస్, సింగిరెడ్డి బాల్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు కల్పించాలి

ఆర్జీవన్ జిఎంకు ఎఐటియుసి నాయకుల వినతి




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణిలో 2016–2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓం.ఎం.హెచ్) కేడర్ స్కీమ్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన అనంతరం ఓవర్ మెన్, గ్రేడ్ బి హోదాకు అర్హులయినప్పటికీ, ఓవర్ మెన్ ఖాళీలు లేవు అనే కారణంతో వారి ప్రమోషన్లు అనవసరంగా నిలిపివేయబడ్డాయని,తక్షణమే ఖాళీలతో సంబంధం లేకుండా వారికి ప్రమోషన్స్ ఇచ్చే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు.సోమవారం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి లో సీనియర్ మైనింగ్ సర్దార్ లకు ఓవర్మన్ ప్రమోషన్ ఇవ్వకుండానే వారితో ఓవర్ మెన్ విధులను నిరంతరం నిర్వహింపజేయడం జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీని వలన సంస్థలో వాస్తవ ఓవర్ మెన్ లు అవసరం ఉండగా, ఖాళీలు ప్రతిబింబించడం లేదని, ఓవర్ మెన్ ల పోస్టుల ఖాళీలు కృత్రిమంగా తగ్గినట్లుగా కనిపిస్తూ, అర్హులైన ఉద్యోగులకు రావలసిన ప్రమోషన్లు దాదాపు మూడేళ్ళ నుంచి ఇవ్వకుండా యాజమాన్యం ఆలస్యం చేస్తుందని ఆయన అన్నారు.ఈ పరిస్థితి కేడర్ స్కీమ్ యొక్క ఉద్దేశ్యానికి, ఉద్యోగుల న్యాయమైన హక్కులకు విరుద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా మైనింగ్ స్టాఫ్ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కేడర్ స్కీమ్ ప్రకారం అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓం.ఎం.హెచ్) లందరికీ తక్షణమే ఓవర్ మెన్, గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సంస్థలోని ఓవర్ మెన్ ఖాళీలను భర్తీ చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని,లేనియెడల జూలై 22 మొదటి షిఫ్ట్ నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్ కంపెనీ ఇచ్చిన ఆఫీస్ ఆర్డర్ ప్రకారం మైనింగ్ సర్దార్ డ్యూటీ మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, స్వామి, మాదన మహేష్, సిద్ధమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, రాజు, మహేందర్, శ్రీనివాస్, నాయకులు గొడిశెల నరేష్, పాల్గొన్నారు.

## విడిసి ఆధ్వర్యంలో బెల్ట్ షాపుల టెండర్‌పై వివాదం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం ఆత్మకూరు గ్రామంలో విడీసీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెబుతున్న బెల్ట్ షాపుల టెండర్ ప్రక్రియపై వివాదం నెలకొన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు బెల్ట్ షాపులను నిర్మూలించాలని చెబుతుండగా, స్థానికంగా మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహారాలు జరుగుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, గతంలో బెల్ట్ షాపులు నిర్వహించిన కొందరిపై మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ మద్యం దుకాణ యజమాని తన వద్ద నుంచే మద్యం కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపించారు. అందుకు వారు నిరాకరించడంతో ఈ ఏడాది వారి నిర్వహణకు అడ్డంకులు సృష్టిస్తామని బెదిరించినట్లు తెలిపారు.అలాగే, ఈసారి టెండర్ ప్రక్రియలో గ్రామానికి చెందిన ఓ బినామీ వ్యక్తి పేరుతో సుమారు రూ.4.20 లక్షలకు టెండర్ దాఖలు చేయించారని, టెండర్ పొందిన వ్యక్తి ఒక షాపును ఉచితంగా ఇవ్వాలని, టెండర్ మొత్తాన్ని ముగ్గురు కలిసి చెల్లించాలని, అదనంగా ప్రతి షాపు నుంచి రూ.10 వేల చొప్పున గుడ్‌విల్ పేరుతో వసూలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.టెండర్ దక్కించుకున్న వ్యక్తి గ్రామ పెద్దల సమక్షంలో షాపును ప్రారంభించి, దానికి సంబంధించిన ప్రచారం సోషల్ మీడియాలో నిర్వహించినట్లు కూడా గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని ప్రశ్నించే వారిని గ్రామ బహిష్కరణ చేస్తారనే భయంతో పలువురు బహిరంగంగా మాట్లాడేందుకు వెనుకాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎక్సైజ్ (అబ్కారీ) శాఖ సీఐ వినోద్ రాథోడ్ వివరణ:** మాట్లాడుతూ,ఈ వ్యవహారంపై గ్రామస్థుల ఆరోపణల నేపథ్యంలో స్పందించిన ఎక్సైజ్ (అబ్కారీ) శాఖ సీఐ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ ప్రభుత్వ విధానాలకు విరుద్ధమని, చట్టవిరుద్ధంగా ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే విచారణ నిర్వహించి, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజలు కోరుతున్నారు.




## బురదమయమైన సిసి రోడ్డుపై మట్టి తొలగింపు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో గుంతలమయంగా మారిన సీసీ రోడ్డు సమస్య ఎట్టకేలకు తీరింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై నీరు నిలవడంతో,సర్పంచ్ చొప్పరి సంపత్ తాత్కాలిక ఉపశమనం కోసం రోడ్డుపై మట్టి పోయించారు. అయితే, ఆ మట్టి కాస్తా వర్షపు నీటితో కలిసి తీవ్ర బురదగా మారింది. దీనివల్ల వాహనదారులు, గ్రామస్థులు కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీల్లేకుండా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దారుణ పరిస్థితిపై 'ప్రజా పక్షం' దినపత్రికలో బురదమయంగా సీసీ రోడ్డు.. గ్రామస్థుల తీవ్ర ఇబ్బందులు అనే శీర్షికతో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు.బురదగా మారిన ఆ నాణ్యత లేని మట్టిని రోడ్డుపై నుండి పూర్తిగా తొలగించి, నడవడానికి వీలుగా కొత్త మట్టిని పోయించారు.అలాగే మరికొద్ది రోజుల్లోనే ఇక్కడ కొత్త సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని అధికారులు,సర్పంచ్ ఈ సందర్భంగా గ్రామస్థులకు హామీ ఇచ్చారు.తమ సమస్యపై స్పందించి వార్త ప్రచురించిన ప్రజాపక్షం పత్రికకు, తక్షణమే చర్యలు తీసుకున్న అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారానికి అడుగు దూరంలో ఉన్నాం

ఎంపి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడానికి అడుగు దూరంలో ఉన్నామని, పక్కాగా అధికారంలోకి వస్తామని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎంపి రఘునందన్‌రావు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజలు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని, మోడీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పాల్గోనాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడానికి ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకం అన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్, విద్యాసాగర్, చింత సంతోష్, తుంగ కనకయ్య, విభీషణ్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఎస్‌సి హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి: ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్ స్థానికంగా నివాసం ఉండకుండా మెట్పల్లి నుంచి రాకపోకలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మంద రాకేష్ జిల్లా కేంద్రంలోని జిల్లాఎస్సీ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ను కలిసి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వార్డెన్ స్థానికంగా నివసించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా నాయకులు బల్మూరి సాయికిరణ్, గుంటి మహేష్, వినీత్,కార్తీక్,మహేష్,అబ్దుల్ సమద్,తదితరులున్నారు.

## సిపిఐ సీనియర్ నేత బత్తుల మృతి

సందర్శించి సంతాపం తెలిపిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బత్తుల ఆంజనేయులు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సిపిఐ సహాయ కార్యదర్శి చింతల దశరథం, సీనియర్ నాయకులు ఎస్.కె. సర్వర్, ఎఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, శాఖ కార్యదర్శి చల్లా కాంతారావులు సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంజనేయులు అమర్ హై అంటూ పెద్ద ఎత్తుననినాదాలు చేశారు.

## రైతు భరోసా నిధులు జమ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రైతు భరోసా పథకానికి సంబంధించి ఏడు ఎకరాల వరకు ఉన్న రైతులకు సోమవారం నిధులు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3,30,377 మంది రైతులకు గాను రూ. 352.24 కోట్లు నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఏడు ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో 18001 మంది రైతులకు రూ.20.10 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 82811 మంది రైతులకు రూ.87 .06 కోట్లు, పాలేరు 77578 మంది రైతులకు రూ. 77.64 కోట్లు, మధిర నియోజకవర్గంలో 87068 మంది రైతులకు రూ. 91.24 కోట్లు, వైరా నియోజకవర్గంలో 63710 మంది రైతులకు రూ. 75.13 కోట్లు, ఇల్లందు నియోజకవర్గంలో 1209 మంది రైతులకు రూ.1.06 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజావాణి ద్వారా ప్రజలు అందించిన దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఆయన ఆయా శాఖల అధికారులకు అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అధికారులపై ఉన్న నమ్మకంతో జిల్లా వ్యాప్తంగావచ్చిన దరఖాస్తులు సమర్పించారని, వాటిని ఆయా శాఖల అధికారులు పూర్తిగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఐటిడిఎలో :** ఐటిడిఎలోని సమావేశం మందిరంలో గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిఓ రాహుల్ గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ గిరిజనులకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలు దశలవారీగా అందిస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో నివశించే వారు వానా కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేస్తూ సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలని, సమస్యలు ఉంటే వెంటనే వాటిపై నివేదికలు అందించాలన్నారు.

## 'సర్'పై అవగాహన ర్యాలీ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో 'సర్' కార్యక్రమంపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు వారి ఓటర్ ఫామ్ పూరించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫామ్ నింపాలని, అదేవిధంగా వార్డులో బూత్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువ కలిగింది, అలాంటి ఓటు కోల్పోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అనంతరం కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో వార్డులో ముమ్మరంగా జరుగుతుంది. ప్రతి ఓటర్ ఓటు హక్కును భద్రపరచుకునే విధంగా సుమారు 700 పైగా సర్ అప్లికేషన్‌లను ఆన్‌లైన్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వుంద్రు శ్యామ్‌బాబు, పమ్మి అశోక్, రాజగోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కొమ్ము రవికి జాతీయ స్థాయి సాహిత్య పురస్కారం



ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొమ్ము రవికి జాతీయ స్థాయి సాహిత్య పురస్కారం అందుకొని మండలానికి గర్వకారణంగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక, సవ్యసాచి గ్రూప్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 169వ అఖిల భారత ద్విశతాధిక కవి సమ్మేళనం కృష్ణవేణి కవితోత్సవంలో కొమ్ము రవి రచించిన 'ఐసియు' కవితా సంకలనం జాతీయ స్థాయిలో ఎంపికైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు కొమ్ము రవిని జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్, అధ్యక్షత వహించగా, జి.ఈశ్వరిభూషణం, డాక్టర్ టి పార్థసారథి, కావూరి శ్రీనివాసశర్మ తదితరులు ప్రముఖులు పాల్గొని పురస్కారాన్ని అందజేశారు. కొమ్ము రవి సాధించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపుపై సిపిఐ మండల నాయకులు, ముష్టికుంట్ల గ్రామస్థులు, సాహితీ అభిమానులు అభినందనలు తెలిపారు.

# ఖరీఫ్‌కు వరణుడి దెబ్బ



ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల దృష్టి ఏదీ?

ప్రజాపక్షం/ ఖమ్మం : వర్షాకాలం, పునాస పంటలకు ఈ ఏడాది వాతావరణం అంత అనుకూలంగా లేదు. వాతావరణ పరిస్థితులను గమనిస్తుంటే 'వరపటి కాలమే'నని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. మృగశిరలోనే ముల్లు మెత్తబడుతుందంటారు ఈ ఏడాది మృగశిర ఆరుద్ర కార్తెలలో కూడా సరైన వర్షం పడలేదు. పునర్వసు కార్తె ప్రారంభమైనా వర్షం కురిసే పరిస్థితి కనిపించడం లేదు. ఆకాశం మేఘావృతమై ఉండటం, ఎప్పుడో ఒకసారి నాలుగు చినుకు లు రాలటం మినహా ఇంత వరకు దుక్కులు పొ ర్లే వర్షం కురవలేదు. భారీ మధ్యతరహా ప్రాజెక్టులే కాదు వాగులు, వంకలలో నీరు చేరలేదు. వరి సాగు ఈసారి ఖరీఫ్‌లో సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మెట్ట పంటల సాగు కూ డా అత్తు బిత్తుగానే ఉంది. సాంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, అపరాల పంటలకు సాగుకు అంత అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిసారించాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు వాతావరణ పరిస్థితులను దృ ష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాల పంటలను రైతులు సాగు చేస్తారు. వీరికి ప్రత్యామ్నాయం ఏమిటన్నది అధికారులు వివరించ లేదు. వరి పంట భూముల్లో వరి తప్ప ప్రత్యామ్నాయ పంటలను సాగు చేడయం సాధ్యం కాదు. పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగుతో పోల్చి చూసినప్పుడు వరి అంత లాభసాటి పంట కాకపోవడంతో ఇప్పటికే మెట్ట పంటలకు సానుకూలంగా ఉన్న మాగాణి భూములను మెట్ట భూములుగా మార్చి వేశారు. ఇక పత్తి, మిర్చి లాంటి వాణిజ్య పంటలకు ప్రత్యామ్నా యం కనిపించడం లేదు. ఒకప్పుడు ఆహార పం టగా చెప్పుకునే మొక్కజొన్న ఇప్పుడు వాణిజ్య పంటగానే రైతులు భావిస్తున్నారు. వాణిజ్య పం టల స్థానంలో అపరాల పంటలు సాగు చేసి నష్టపోయేందుకు రైతులు సిద్ధంగా లేరు. దశాబ్ద కా లంగా అతివృష్టి అనావృష్టి కారణంగా అపరాల పంట చేతికి వచ్చిన దాఖలాలు లేవు. ఉద్యానవన పంటలకు సంబంధించి అనువైన భూము లు ఉండి నీటి వసతి గల చోట పామాయిల్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దేశీయ అవసరాల రీత్యాల పామాయిల్‌కు ఉన్న డిమాం డ్, ప్రభుత్వ పోత్సాహం వెరసి పామాయిల్ సాగు పెరిగేందుకు కారణమవుతుంది. మామి డి, నిమ్మ, జామ లాంటి ఇతర తోటల సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. పామాయిల్‌కు భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకమే పామాయిల్ సాగు విస్తరణ పెరిగేందుకు కారణమవుతుంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయడంలో కొంత వైఫల్యం కనపడుతుంది. స్వల్ప కాలిక పంటలకు దీర్ఘకాలిక పంటలు మా త్రమే ప్రత్యామ్నాయం కాకుండా తిరిగి స్వల్పకాలిక పంటలనే ప్రత్యామ్నాయంగా చూపి సాగు చేయిస్తే ఫలితాలు ఉండవచ్చు.

## నేటి నుండి సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు

ప్రారంభించనున్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ


హాజరుకానున్న 300 మంది ప్రతినిధులు

జయప్రదం చేయాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాచలం : నేటి నుండి మూడు రోజులుపాటు భద్రాచలం కేంద్రంగా సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిచనున్నట్లు ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. శిక్షణ తరగతుల ఏర్పాట్ల పర్యవేక్షణకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమకాలీన రాజకీయ అంశాలపై ప్రముఖులు ఇందులో విస్తృత బోధన చేయనున్నారని తెలిపారు.7, 8 తేదీల్లో గోదావరి కరకట్ట సమీపంలోని కమ్మ సత్రంలో, 9వ తేదీన రాఘవ నిలయం రెడ్ల సత్రంలో జరిగే శిక్షణా తరగతులతో పార్టీ సిద్ధాంత పరిపుష్టి, బలోపేతం సాధ్యమవుతుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణా తరగతులలో ఇరు జిల్లాల నుంచి సుమారు 300 మంది సమితి సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించనున్నార ని, ముఖ్య అతిథిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొననున్నారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు సాగే ఈ తరగతులలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ యుగల్ రాయలు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మోహన్ రెడ్డి, సోమసుందర్, ఎస్.వేణుగోపాల్, చలసాని వెంకట రామారావు, బాగం హేమంతరావు, వి.మల్లికార్జున్ రావులు పలు ముఖ్యమైన అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగపడే ఈ శిక్షణా తరగతులను సిపిఐ శ్రేణులు, సమితి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారు.

## పంచాయతీ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎఐటియుసి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన చాదిరాశి పల్లి పుల్లయ్య ప్రమాదంలో మరణించడంతో అతని కుటుంబానికి రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ మల్లేష్ రమేష్ తదితరులు వినతిపత్రం అందించారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించి డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో, ఎంపీవోల దృష్టికి తీసుకెళ్లామని వారు వివరించారు.

## రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/చింతకాని : గత నెల 30న చింతకాని మండలం జగన్నాధపురంలో జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల దృష్ట్యా వాయిదా పడిన నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర సిపి సునీల్ దత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సభా స్థలి నిర్వహణపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాల గురించి వివరాలు సేకరించారు. ఈ నివేదికను సీఎంవోకి నివేదిస్తామన్నారు. ఏర్పాట్లను వేగవంతం చేయాలని , సభ నిర్వహణ తేదీ ఎప్పుడు నిర్ణయించినా సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు, ఈవెంట్ మేనేజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, వైరా ఏసీపీ సారంగపాణి, జిల్లా అధికారులు, చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి, నాయకులు కొప్పుల గోవిందరావు, నాగార్జున , తాళ్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులు మంజూరు చేయాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉద్యోగ, పెన్షనర్ల హెల్త్ కార్డులు ఈనెల 15లోగా మంజూరు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు వజ్జా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జెఎసితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 15 నాటికి ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలు చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఖమ్మం నుండి పెన్షనర్లు ఆందోళనకు సిద్ధంగా ఉన్నారన్నారు. పిఆర్‌సి ప్రయోజనాలు, డిఎలు ప్రకటించకుండా, హెల్త్ స్కీం ఉత్తర్వులు విడుదల చేయకుండా ఉద్యోగ, పెన్షనర్ల వేతనాల నుండి కొంత మొత్తాన్ని మినహాయించడం శోచనీయమన్నారు. 2024 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వేలాది పెన్షనర్లకు నేటి వరకు పూర్తి ప్రయోజనాలు చెల్లించ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్త్‌కార్డు జీవోను అమలు చేసి ఆసుపత్రుల లిస్టును వెంటనే ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచందర్‌రావు, దుర్గాదేవి, సుగుణ, రాజేంద్రన్, జనార్థన్, వెంకటనారాయణ, బసవరాజు, రమేష్ పాల్గొన్నారు.

# ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే

ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాపక్షం/ఇల్లందు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాల సీజన్ వ్యాధుల నివారణ కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో డ్రై డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిల్వ నీటి తొలగింపు, దోమల ఉత్పత్తి కేంద్రాల నిర్మూలన, పారిశుద్ధ్య చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించి సీజన్ వ్యాధుల నివారణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిల్వ నీటికి చెక్, దోమలకు బ్రేక్, ఆరోగ్యవంతమైన గ్రామమే మన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌పి భూముల ఆక్రమణలను తొలగించండి

కలెక్టర్‌కు సిపిఐ వినతి



ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం కార్పొరేషన్ 12వ డివిజన్‌లో కొందరు సంపన్నులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్ఎస్‌పి స్థలాలను ఆక్రమించి స్థిర నివాసాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు గాంధీ మాట్లాడుతూ 12వ డివిజన్‌లో ఎన్ఎస్‌పి కాలువలకు సంబంధించిన స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో పేదలు నివసిస్తుంటే న్యాయస్థానాల ద్వారా పేదలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసిన వ్యక్తులే ఇప్పుడు ఆక్రమణలకు పాల్పడుతున్నారని గాంధీ తెలిపారు. కొందరైతే రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేశారని వీటిని పరిశీలన చేసి తిరస్కరించాలని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయ న కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వెంకన్న, జాకీర్, అక్రం, సత్యనారాయణ, రమణ, స్వామి, వెంకట్, ముత్త య్య, సైదులు, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

డిజిపి సి.వి. ఆనంద్



ప్రజాపక్షం/మణుగూరు: జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి సి.వి. ఆనంద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని డిజిపి తెలిపారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు, సీసీటీవీ నిఘా, సైబర్ నేరాల విచారణ వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే ముఠాలను తీవ్రవాదుల మాదిరిగానే పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులపై అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం కలెక్టర్ ఆదేశాను సారం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం, వరదలు, భూకంపాల పట్ల విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ హైదరాబాద్ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ బెటైన్ సింగ్ మాట్లాడుతూ వరదలు, భూకంపాలు వచ్చినప్పుడు చాకచక్యంగా వ్యవహరించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ఏపివో అజయ్ కుమార్, రెస్క్యూ టీమ్ సభ్యులు సందీప్‌కుమార్ రెడ్డి, సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డా॥ శ్రీనివాస్, ఐక్యూ ఏసి కో ఆర్డినేటర్ డా॥ ఎం. సునంద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా॥ పిచ్చయ్య, డా॥ రమణ, ధర్మయ్య, ఎన్‌సిసి కమాండెంట్ డా॥ ఓంకార్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల మంజూరు కోరుతూ ఎమ్మెల్యేకు వినతి



ప్రజాపక్షం/అశ్వాపురం: తుర్రవారిగూడెం గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం సర్పంచ్ కుంజ జాన్, ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరించేందుకు తక్షణం సిసి రోడ్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. గ్రామ అభివృద్ధిపై స్పందించిన ఎమ్మెల్యే నిధుల కేటాయింపుతో పాటు రోడ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిఆర్‌సి 2023ను వెంటనే ప్రకటించాలి

జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టి. రత్నకుమార్




ప్రజాపక్షం/బోనకల్: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, పిఆర్‌సి 2023ను వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు టి. రత్నకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో పిఆర్‌టియూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా పూర్వ అధ్యక్షుడు వై. వెంటేశ్వరరావు ముష్టికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. వేల కోట్ల రూపాయలు చెల్లించకుండా రెండు సంవత్సరాలు గడిచిపోయిందని, పిఆర్‌సి గడువు ముగిసి మూడేళ్లు దాటినా కొత్త పిఆర్‌సి ప్రకటించకపోవడం బాధకరమని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సిపిఎస్ రద్దు, పెండింగ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు, పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మద్దినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు ఎన్ రవికిరణ్, మండల మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరాణి, జ్యోతిర్మయి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

హిందూమహాసముద్ర భద్రత లక్ష్యంగా

# మూడు దేశాల పర్యటనకు మోదీ

● మొదట ఇండోనేసియాలో పర్యటన ● జకర్తా విమానాశ్రయంలో స్వాగతం పలికిన దేశాధ్యక్షుడు



**జకర్తా:** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొదట సోమవారం ఇండోనేసియా చేరుకున్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత కార్యకలాపాలు,'మహాసాగర్' దార్శనిక దృష్టి విధానాలను విస్తరింప ఈ ప్రాంత దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో ఇండోనేసియా,ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో నరేంద్రమోదీ పర్యటన చేస్తారు. హిందూ మహా సముద్ర ప్రాంతంలో నౌకా కార్యకలాపాలు స్వేచ్ఛగా సజావుగా కొనసాగేందుకు వీలుగా అంతర్జాతీయ నిబంధనలు విధిగా పాటించేందుకు ఈ ప్రాంత దేశాలమధ్య సమ్మిళిత తత్వంతో సంబంధ బాంధవ్యాలు బలోపేతం కావాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వంతో మహాసాగర్ దార్శనిక దృక్పథాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దీనికి విస్తారమైన ప్రచారం కల్పించి, సంకల్పశుద్ధితో ఈ ప్రాంతంలో నౌకాకార్యక్రమాలు,ప్రాదేశిక సముద్ర జలాల రక్షణ, అంతర్జాతీయ నిబంధనలు సజావుగా కొనసాగించడం లక్ష్యంగా మోదీ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇండోనేసియా పర్యటనలో భాగంగా రాజధాని జకర్తాకు చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో సహా మరో నలుగురు మంత్రులు స్వాగతం పలికారు. సంప్రదాయబద్ధంగా సైనికుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ విషయాన్ని మోదీ స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 2018లో రెండు దేశాలమధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య బంధం విస్తరించిన తర్వాత ఇండోనేసియాలో మోదీ చేస్తున్న మొదటి ద్వైపాక్షిక పర్యటన ఇదే. ''మా దేశాల రెండూ 2018లో మొదటిసారి ప్రజల ప్రయోజనాలకు వీలుగా సంబంధాలను పెంపొందించుకున్నాం, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి సంబంధాలు వృద్ధి చెందాయి,అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో, నేనూ యోగ్యకర్త నగర సమీపంలో ఉన్న ప్రంబనన్ ఆలయ సముదాయ భవనాన్ని సందర్శించాం,రెండు దేశాలమధ్యా సన్నిహితమైన సాంస్కృతిక సంబంధాలకు ఈ పర్యటన ఒక భరోసా ఇస్తుంది, ఇండోనేసియా కూడా భారతదేశ ఆర్థిక వ్యవస్థతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకోవాలనే సదుద్దేశంతో ఉంది'' అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. యోగ్యకర్త నగరానికి 17 కి.మీ దూరంలో ఉన్న శతాబ్దాలపూర్వంనాటి ఈ ఆలయాన్ని ఇండోనేసియాలో ఉన్న అతిపెద్ద హిందూ దేవాలయంగా పరిగణిస్తారు. ఇండోనేసియాకు బయలుదేరేముందుగా నరేంద్రమోదీ ఢిల్లీలో మాట్లాడుతూ, యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్,ఇండో–పసిఫిక్‌లో స్వేచ్ఛగా, అందరినీ సమ్మిళితం చేసుకుని నౌకాయానాన్ని నిబంధనలకు అనుగుణంగా సజావుగా తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యాన్ని తన పర్యటన బలోపేతం చేస్తుందని ఉద్ఘాటించారు. మహాసాగర్ లేదా హిందూ మహాసముద్రంలో భద్రతకు వీలుగా భారత దార్శనిక భద్రతా దృక్పథం అన్ని ప్రాంతాలకు ఉపయోగపడుతుందన్నారు. 2025 జనవరినెలలో ప్రబోవో సుబియంతో భారత్‌లో పర్యటించారు. గణతంత్ర దినోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇరు దేశాలమధ్య పురాతన కాలం నుండి బలమైన నాగరికత సంబంధాలు ఉన్నాయి. ప్రజలమధ్య కూడా అనుబంధం ఉంది. ఇండోనేసియా పర్యటన తర్వాత ప్రధానమంత్రి మెల్‌బోర్న్ చేరుకుంటారు.

# 'దొంగే దొంగ అని అరిచినట్లు'

● విరాళాల చోరీపై ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలపై పోలీసులకు విహెచ్‌పి లేఖ ● తీవ్రంగా మండిపడిన కాంగ్రెస్ ● నైతిక పతనం బయటపడకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమని వ్యాఖ్య




**న్యూఢిల్లీ :** రామ మందిరంలో విరాళాల చోరీపై పలువురు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణల గురించి అయోధ్య పోలీసులకు విహెచ్‌పి లేఖ రాయడంపై కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడింది. ఇది 'దొంగే దొంగ అని అరిచినట్లు' ఉందని, తమ సంస్థలోని నైతిక పతనం బయటపడకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమని కాంగ్రెస్ పేర్కొంది. రామ మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలను పరిశీలించి, ఆ ఆరోపణలను నిరూపించేందుకు వారిని పిలిపించాలని కోరుతూ విహెచ్‌పి అయోధ్య పోలీసులకు లేఖ రాసిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ పైవిధంగా విమర్శించింది. రామ మందిర విరాళాల చోరీ కేసులో ప్రతిపక్ష నాయకులపై దాడి చేస్తూ విహెచ్‌పి రాసిన లేఖ 'దొంగే దొంగ అని అరిచినట్లు' ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. గతంలో 'రూ. 1,400 కోట్ల రామ మందిర కుంభకోణం' అంటూ నిర్మోహి అఖారా ఆరోపణలు ఎదుర్కొన్న అదే విశ్వహిందూ పరివార్ (విహెచ్‌పి), ఇప్పుడు ఆ ఆరోపిత దోపిడీని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను విచారించాలని డిమాండ్ చేస్తోందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఈ డిమాండ్ ఎంత సిగ్గుమాలినదో, అంతే అసంబద్ధమైనది. తానే పరిశీలనలోకి వచ్చిన విహెచ్‌పికి, ప్రతిపక్షంపై వేలెత్తి చూపడానికి నైతిక అధికారం గానీ, విశ్వసనీయత గానీ లేవు' అని వేణుగోపాల్ అన్నారు. 'అసలు, ఈ ఆలయ ట్రస్ట్‌ను ప్రధాని మోదీ ఏర్పాటు చేశారరు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ విహెచ్‌పి ఉపాధ్యక్షుడు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్; ట్రస్ట్ చైర్మన్ భారత ప్రధానికి ముఖ్య కార్యదర్శి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిజెపి పాలనలో ఉన్నాయి. అలాంటప్పుడు, ప్రియాంకజీ, అఖిలేశ్‌జీ లేదా ఇతర ప్రతిపక్ష నాయకులకు ఈ విషయంతో అసలు సంబంధం ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. విహెచ్‌పి, సంఘ్ పరివార్ పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయాయని ఆయన పేర్కొన్నారు. మందిర నిర్మాణానికి పూర్తి ఘనత తమదేనని చెప్పుకున్న బిజెపి నాయకత్వం, తామే నియమించిన ట్రస్ట్ ఇప్పుడు విచారణను ఎదుర్కొంటున్న తరుణంలో ఎందుకు మౌనంగా ఉందని వేణుగోపాల్ ప్రశ్నించారు. 'తీవ్రమైన ప్రశ్నలతో ఇరుక్కుపోయి, అభాసుపాలైన వారు ఇప్పుడు తమ నైతిక పతనం బయటపడకుండా ఉండేందుకు... హడావిడి సృష్టించడం, అమాయకత్వం నటించడం, వాస్తవాలను వక్రీకరించడం, విమర్శకులను భయపెట్టడం, ప్రజల దృష్టిని మళ్లించడం వంటి పనులు చేస్తున్నారు' అని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ జరగాలన్న తమ డిమాండ్‌ను మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఉన్న సిట్ కేవలం రామమందిర నిధులను దోచుకున్న వారిని రక్షించే ఒక విస్తృతమైన యంత్రాంగం మాత్రమే అని వేణుగోపాల్ పేర్కొన్నారు. విహెచ్‌పిని తీవ్రంగా విమర్శించిన ఆయన, హిందూ సమాజానికి తామే కాంట్రాక్టర్లమనే ధోరణిని వారు మానుకోవాలని సూచించారు.

## 9వ రోజుకు సోనమ్ నిరాహారదీక్ష




**న్యూఢిల్లీ :** విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద బొద్దింక జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన సోమవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. మరోవైపు, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక నిరాహార దీక్ష కూడా తొమ్మిది రోజుల నుంచి కొనసాగుతోంది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి ఆయన మొత్తం 6.9 కిలోల బరువు తగ్గారు. వైద్యులు అందించిన ఆరోగ్య బులెటిన్ ప్రకారం, వాంగ్‌చుక్ రక్తపోటు 107/67 ఎంఎం హెచ్‌జిగా, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 72 ఎంజి/డిఎల్‌గా నమోదైంది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి ఆయన బరువు తగ్గినట్లు ఆ బులెటిన్ ధృవీకరించింది. కాగా, నిరసన ప్రదేశంలో మహిళా వలంటీర్లను రికార్డ్ చేయమని ప్రభుత్వం పోలీసులను ఎందుకు కోరిందని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. 'మహిళా వలంటీర్లను రికార్డ్ చేయమని ప్రభుత్వం పోలీసులను ఎందుకు కోరింది? ఆదివారం రాత్రి, కొంతమంది అధికారులు మహిళా వలంటీర్ల ఫోటోలు తీస్తూ పట్టుబడ్డారు. నిలదీయగానే, వారు అక్కడి నుంచి పారిపోయారు' అని ఆయన ఆరోపించారు. దీప్కే సోమవారం మహారాష్ట్రకు వెళ్లి తన స్వస్థలమైన ఛత్రపతి సంభాజీనగర్‌లో పేపర్ లీక్ ఆరోపణలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులకు సిజెపి సంఘీభావంగా నిలుస్తుందని, ఆఫ్‌లైన్ పరీక్షలు జరపాలన్న వారి డిమాండ్‌కు మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. జంతర్ మంతర్‌లోని నిరసన స్థలంలో వేరే వేదికపై సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అనుబంధ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ)కు చెందిన పలువురు సభ్యులు తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు.

# జమ్ముకశ్మీర్‌లో పోటెత్తిన వరదలు

*రోడ్లు బురదమయం, కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు*





**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో మేఘా విస్ఫోటనం సంభవించింది. ఆదివారం రాత్రి కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా దోడా–కిష్టవర్ జా తీయ రహదారి ఆకస్మిక వరదలకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దోడా, కిష్టవర్ కొండ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలో రహదారిపై భారీగా బు రద, బండరాళ్లు, శిథిలాలు పేరుకుపోవడంతో అనేక వాహనాలు అందులో కూరుకుపోయా యి. జాతీయ రహదారిలోని కొంత భాగం దెబ్బతినడంతో, రాకపోకలను నిలిపివేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. ప్రేమ్‌నగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన అనేక వాహనాలు వరద శిథిలాలలో చిక్కుకుపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదని వారు చెప్పారు. అధికారులు రోడ్డును శుభ్రపరిచే, పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. రహదారిని తిరిగి తెరిచే వరకు ప్రయాణికులు ఆ రహదారికి దూరంగా ఉండాలని, అధికారిక ట్రాఫిక్ సూచనలను పాటించాలని సూచించారు. పొరుగున ఉన్న కిష్టవర్ జిల్లాలో కూడా, భారీ వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం ప్రాంతం సమీపంలో పెద్ద కొండచరియలు విరిగిపడ్డాయి, బురద కూడా ప్రవహించింది. ఆకస్మిక వరదల కారణంగా భారీ పరిమాణంలో బురద, బండరాళ్లు ప్రాజెక్ట్ ప్రాంతంలోకి కొట్టుకువచ్చాయని, దీనివల్ల ట్రక్కులు, డోజర్లు, ఇతర నిర్మాణ పరికరాలతో సహా అనేక వాహనాలు పూడిపోయాయని, నిర్మాణ సామ గ్రి కూడా దెబ్బతిందని అధికారులు తెలిపారు. అనేక వాహనాలు తీవ్రంగా దెబ్బతిని శిథిలాల కింద చిక్కుకుపోయాయని, చిక్కుకున్న వాహనాలను వెలికితీయడానికి, ప్రభావిత ప్రాంతాన్ని పునరుద్ధరించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. రియాసి జిల్లాలోని ఎత్తైన ప్రాంతాల్లో కూడా చిన్నపాటి ఆకస్మిక వరద ఘటనలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని లోతట్టు ప్రాం తాల్లో భారీ వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ యంత్రాంగం ఇంతకుముందే వాతావరణ హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా నదీ తీ రాలు, వాగుల సమీపంలో నివసించే ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని, అసురక్షి త ప్రదేశాలకు దూరంగా ఉండాలని కోరింది. వాతావరణ శాఖ ప్రకారం, సోమవారం ఉదయం 8.30 గంటల నాటికి గత 24 గంటల్లో జమ్ము ప్రాంతంలో అత్యధికంగా 90 మిల్లీమీటర్ల వర్షపాతం సాంబాలో నమోదైంది. ఆ తర్వాత కతువా (66.2 మిల్లీమీటర్లు), కత్రా (44.4 మిల్లీమీటర్లు), దోడా (42 మిల్లీమీటర్లు), జమ్మూ (41.8 మిల్లీమీటర్లు), ఉధంపూర్ (40.6 మిల్లీమీటర్లు), భదేర్వా (33.6 మిల్లీమీటర్లు), కిష్త్వార్ (24 మిల్లీమీటర్లు), రియాసి (10.5 మిల్లీమీటర్లు), బటోటే (4.7 మిల్లీమీటర్లు), రాంబన్ (4.5 మిల్లీమీటర్లు), బనిహాల్ (0.4 మిల్లీమీటర్లు)లలో వర్షపాతం నమోదైంది.

## బెంగాల్‌లో 24న రాజ్యసభ ఎన్నికలు




**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు రెబెల్ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపిల రాజీనామాలతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు ఈనెల 24న ఉప ఎన్నికలు జరగనున్నాయి. సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ స్థానాలన్నింటినీ బిజెపి గెలుచుకునే అవకాశం ఉంది. రాజీనామా చేసిన ఆ ముగ్గురు టిఎంసి రాజ్యసభ సభ్యుల్లో సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్ర కాష్ చిక్ బరైక్ ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత నాయకత్వా న్ని ప్రశ్నించిన వీరు, జూన్ నెలలో వేర్వేరు తేదీల్లో తమ పదవులకు రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన నే పథ్యంలో, ఈ మూడు ఉప ఎన్నికల తర్వాత రాజ్యసభలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య పెరగనుంది.రాయ్ పదవీకాలం సెప్టెంబర్ 18, 2029 వరకు, దేవ్ పదవీకాలం ఏప్రిల్ 2, 2030 వరకు ఉండేవి. కొత్తగా ఎన్నికయ్యే ఎంపిలు ఆయా స్థానాలకు సంబంధించి మిగిలి ఉన్న పదవీకాలం వరకు కొనసాగుతారు.

నెతన్యాహు వ్యాఖ్యలపై మోదీ మౌనం

## 'దేశ నాగరికత విలువలకే తీరని ద్రోహం'

**కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ చర్యలపై 'స్వయం ప్రకటిత, అవార్డుల కోసం ఆరాటపడే విశ్వగురువు' వహిస్తున్న మౌనం దేశ నాగరికత, విలువలకే తీరని ద్రోహమని విమర్శించింది. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం మండిపడింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి వాన్స్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్ మద్దతును ప్రస్తావించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ సోమవారం ఈ మేరకు వ్యాఖ్యానిస్తూ, తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'నెతన్యాహు చేసిన వ్యాఖ్యలు తప్పు. నిస్సందేహంగా ఇజ్రాయెల్, మోదీ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంది. అయితే, గాజాలో పిల్లలను కూడా వదలకుండా సాగుతున్న మరణకాండ, వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లను బలవంతంగా తొలగించి స్థానభ్రంశం చేయడం, ఇరాన్‌పై వైమానిక దాడులు, దక్షిణ లెబనాన్‌లో క్రూరమైన సైనిక చర్యలను కోట్ల మంది భారతీయులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇవన్నీ మానవత్వంపైనే జరుగుతున్న దాడులు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. అంతకుముందు, భారత్ నుంచి తమకు మద్దతు ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. అమెరికా ఇరాన్ శాంతి చర్చల్ని ఇజ్రాయెల్ గౌరవించాలని, యావత్ ప్రపంచంలో శక్తిమంతమైన అమెరికా మద్దతు మాత్రమే ఇజ్రాయెల్‌కు ఉందని ఉపాధ్యక్షుడు వాన్స్ చేసిన వ్యాఖ్యలను నెతన్యాహు తిప్పికొట్టారు. తమకు అనేక దేశాల అండ ఉందని, అందులో చిన్న దేశమైన ఇండియా కూడా ఉందని స్పష్టం చేశారు. అలాగే, ఫేస్‌బుక్‌లోనూ తనకు మద్దతు ఉందని తెలిపారు. అంతేకాదు, తమ దేశంలోని అగ్రశ్రేణి సైబర్ భద్రత నిపుణుల సాయాన్ని అనేక దేశాలు కోరుతుంటాయని, చాలా దేశాల నేతలు ఫోన్ చేసి, వారి సమస్యలు చెప్పి ఏఐ, సైబర్ నిపుణుల చేయూతను కోరుతుంటారని పేర్కొన్నారు. అయితే, ప్రపంచంలో సైబర్ రంగంలో ఇజ్రాయెల్ రెండోస్థానంలో ఉందని, తమ సాంకేతికత ఎంతో మేలైనదని ఆయన స్పష్టం చేశారు.

## 'మహా' విధాన్‌భవన్ వద్ద విపక్ష నేతల నిరసన


● వరదల నుంచి ప్రజలను రక్షించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శ




**ముంబయి:** దేశ ఆర్థిక రాజధాని ముంబయిని గత నాలుగైదు రోజుల నుంచి ముంచెత్తుతున్నాయి. వరదల బారి నుంచి ప్రజలను రక్షించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. మౌలిక సదుపాయాల జాడే కనిపించడం లేదని విమర్శించాయి. సోమవారం ముంబయిలోని విధాన భవన్ మెట్లపై ప్రతిపక్ష శాసనసభ్యులు నిరసన చేపట్టారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ముంబయి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో శిథిలమవుతున్న మౌలిక సదుపాయాలను బట్టబయలు చేశాయని ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల సమయంలో మౌలిక సదుపాయాల నిర్వహణ లోపం సామాన్య ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సతేజ్ పాటిల్, విజయ్ వడెట్టివార్, శివసేన (యుబిటి) ఎమ్మెల్సీ అంబాదాస్ దాన్వే, ఇతర ప్రతిపక్ష సభ్యులు పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల జాడెక్కడ అంటూ నినాదాలు చేస్తూ, శిథిలమవుతున్న మౌలిక సదుపాయాల కారణంగా ముంబయి వాసుల ప్రాణాలను ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని మండిపడ్డారు. తొలివిడత వర్షానికే ముంబయి స్తంభించిపోయిందని నినాదాలు చేస్తూ, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్, ఇతర పౌర మౌలిక సదుపాయాల వైఫల్యాల కారణంగా సంభవిస్తున్న మరణాలపై వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇదిలా ఉండగా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న మిస్సింగ్ లింక్ ప్రాజెక్ట్‌పై సవివరమైన ప్రకటన జారీ చేయాలని ఎన్‌సిపి (ఎస్‌పి) లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సూలే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను కోరారు. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో సోమవారం పుణె–ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే, పాత పుణె–ముంబయి హైవే రెండింటిపైనా ట్రాఫిక్ నిలిపివేశారు.

## బిజెపిలో అధికార పోరు

● 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం సమన్వయంతో పనిచేయడం లేదు
● కేంద్రం, యుపి సర్కార్ మధ్య ఘర్షణ : అఖిలేశ్ యాదవ్



**లక్నో:** అయోధ్యలో ప్రజల విశ్వా సం, మతపరమైన భావనలు దెబ్బతింటున్నాయని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపి ంచారు. బిజెపి, ఉత్తరప్రదేశ్ ప్రభు త్వం మధ్య అధికార పోరు జరుగుతోందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన యాదవ్, పాలన, అభివృద్ధి ప్రాజెక్టులు, జయప్రకాష్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్ (జెపిఎన్‌ఐసి) పరిస్థితి, ఇంజనీరింగ్ విద్య, భవిష్యత్తు ఎన్నికల సన్నాహాల విషయంలో బిజెపిని విమర్శించారు. అయోధ్యలోని రామమందిర విరాళాల వివాదంపై స్పందిస్తూ, ప్రజల మత విశ్వాసాలను కాపాడటం కంటే అంతర్గత విభేదాలకే బిజెపి నాయకత్వం ఎక్కువ ప్రాధాన్యతనిస్తోందన్నారు. 'మా విశ్వాసం, భక్తితో ఆటలాడుతున్నారు. ఏం జరుగుతుందో అందరికీ తెలుసు, అయినా వారు మౌనంగా ఉన్నారు. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం సమన్వయంతో పనిచేయడం లేదు; దానికి బదులుగా, వారి మధ్య ఘర్ష ణ నెలకొంది. అక్కడ అధికార పోరు జరుగుతోంది, వారికి విశ్వాసం లేదా భక్తి పట్ల ఎలాంటి గౌరవం లేదు' అని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు సంపద మత్తులో అంధులయ్యారని, ఈ వివాదం అధికార యంత్రాంగంలో ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ బిజెపిలోని అంతర్గత విభేదాలను సూచిస్తోందని యాదవ్ ఆరోపించారు.

పహల్గామ్ ఉగ్రదాడి కేసు..

# నిందితుడిగా హాఫీజ్ సయీద్

● జమ్ములోని ప్రత్యేక ఎన్‌ఐఎ కోర్టులో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో గతేడాది జరిగిన ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) కీలక అడుగు వేసింది. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా చీఫ్, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హాఫీజ్ సయీద్‌ను ఈ దాడిలో నిందితుడిగా పేర్కొంది. ఈ మేరకు జమ్ములోని ప్రత్యేక ఎన్‌ఐఎ కోర్టులో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. సయీద్‌ను అతని వ్యక్తిగత హోదాలోనే కాకుండా, లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్) అధినేతగా కూడా ఎన్‌ఐఎ నిందితుడిగా చేర్చింది. సరిహద్దుల అవతలి నుంచి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కుట్రలను, ఈ కేసులో హాఫీజ్ సయీద్ పాత్రను శాస్త్రీయ, క్షేత్రస్థాయి ఆధారాలతో సహా ఎన్‌ఐఎ కోర్టుకు సమర్పించింది. హాఫీజ్ సయీద్‌పై బిఎన్‌ఎస్ 2023తో పాటు ఉగ్రవాద నిరోధక చట్టం 1967లోని పలు కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది. భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడం, సరిహద్దు అవతలి నుంచి ఉగ్రదాడులకు వ్యూహాత్మక కుట్రలు పన్నడం వంటి తీవ్రమైన ఆరోపణలను చార్జ్‌షీట్‌లో ఎన్‌ఐఎ మోపింది. గతేడాది డిసెంబర్ 15న ఎన్‌ఐఎ దాఖలు చేసిన 1,597 పేజీల ప్రధాన చార్జ్‌షీట్‌కు కొనసాగింపుగా ఈ తాజా అనుబంధ నివేదికను సమర్పించారు. అందులో ఎన్‌ఐఎ పాకిస్థానీ హ్యాండ్లర్ సాజిద్ జట్‌తో పాటు, 2025 జూలైలో 'ఆపరేషన్ మహాదేవ్' సమయంలో భద్రతా దళాల చేతిలో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అలాగే అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను నిందితుడిగా పేర్కొంది. పహల్గామ్ ఉగ్రదాడిని ప్రణాళిక చేయడం, సులభతరం చేయడం, అమలు చేయడంలో దాని పాత్రకు గాను, నిషేధిత ఎల్‌ఇటి/టిఆర్‌ఎఫ్ ఉగ్రవాద సంస్థను ఒక చట్టబద్ధమైన సంస్థగా కూడా ఇది ఆరోపించింది. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఘోర దాడిలో, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 25 మంది పర్యాటకులు సహా ఒక స్థానికుడిని కాల్చి చంపారు. దీనిపై పహల్గాంలోని పోలీస్ స్టేషన్‌లో తొలుత ఒక ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ప్రాథమిక విచారణల అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ కేసును ఎన్‌ఐఎకు బదిలీ చేసింది. పహల్గాం ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌పై దాడులు చేపట్టి ఉగ్రమూకల క్యాంపులను ధ్వంసం చేసింది.

# ఐసియులోకి విద్యావ్యవస్థ

● నరేంద్ర మోదీ ప్రభుత్వంపె విరుచుకుపడిన ఎన్‌ఎస్‌యుఐ



**న్యూఢిల్లీ :** దేశంలో విద్యా వ్యవస్థను మోదీ ప్రభుత్వం ఐసియులోకి నెట్టివేసిందని కాంగ్రెస్ సోమవారం ఆరోపించింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్ మాఫియాతో ఆయనకు సంబంధాలు ఉన్నట్లు వెల్లువెత్తుతున్న ఆరోపణలపై విచారణ జరపాలని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది.విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే లక్ష్యంతో, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా విద్యార్థులను కలుస్తూ వారి సమస్యలను వింటున్నారని పార్టీ నాయకుడు, ఎన్‌ఎస్‌యుఐ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ తెలిపారు. ఇదే లక్ష్యంతో రాహుల్ గాంధీ రాజస్థాన్ కోటాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో ఒక ప్రజెంటేషన్ ఇచ్చారని, తాము ఇప్పుడు ఈ ప్రచారాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. సోమవారం కన్హయ్య కుమార్ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్, పార్టీ నాయకులు కిరణ్ ముగబసవ్, నిశాంత్ మండల్, కె.కె. శాస్త్రితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో, విద్యా వ్యవస్థను మార్చడానికి, దానిని సరిదిద్దడానికి తాము ఒక 'విద్యా చార్టర్'ను రూపొందిస్తామని కన్హయ్య కుమార్ పేర్కొన్నారు. 'భారత విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరమని, దీని కోసం గతంలో యుపిఎ ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది, కానీ ఎన్‌డిఎ ప్రభుత్వం ఏకపక్షంగా ఎన్‌టిఎను ఏర్పాటు చేసింది. యువత కోసం క్రమబద్ధమైన ఉద్యోగ క్యాలెండర్, పరీక్షలు, నియామక ప్రక్రియల కోసం అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయాలి' అని కుమార్ డిమాండ్ చేశారు. దేశ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, విద్యా సంస్థలు నాశనం అవుతున్నాయని జాఖర్ ఆరోపించారు. కుట్రలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఎన్నికలను నిలిపివేశారు, దీనివల్ల కళాశాల, విశ్వవిద్యాలయ ప్రాంగణాలపై బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు తమ నియంతృత్వ పట్టును కొనసాగించే అవకాశం ఏర్పడిందని ఆరోపించారు.

## సమాధానాలు గోప్యంగా ఉంచాలి

● ఎంపిలకు గుర్తు చేసిన లోక్‌సభ సచివాలయం

**న్యూఢిల్లీ :** ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రులు స్వయంగా వెల్లడించే వరకు లిఖితపూర్వక సమాధానాలలోని అంశాలు పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు నుంచే అత్యంత గోప్యంగా ఉండాలని ఎంపిలకు లోక్‌సభ సచివాలయం గుర్తుచేసింది. సభలో ప్రశ్న అడిగి, దానికి సమాధానం చెప్పే వరకు, మౌఖిక సమాధానం కోసం ఉద్దేశించిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు కూడా అత్యంత గోప్యంగా ఉండాలని స్పష్టం చేసింది. సభలో మౌఖిక సమాధానం కోసం ఆ ప్రశ్నను చేపట్టనంత వరకు, ప్రశ్నోత్తరాల సమయం ముగిసే వరకు ఆ ప్రశ్నకు సంబంధించిన సమాధానాన్ని బయటపెట్టకూడదని పేర్కొంది. శనివారం విడుదల చేసిన ఒక బులెటిన్ ప్రకారం, లిఖితపూర్వక సమాధానాల జాబితాలో ఉన్న ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను సభలో అధికారికంగా సమర్పించి, ప్రశ్నోత్తరాల సమయం ముగిసే వరకు గోప్యంగా పరిగణించాలి. ఒక నిర్దిష్ట తేదీన సభ కార్యకలాపాల రికార్డులో ఏ రూపంలోనైతే సమాధానం నమోదవుతుందో, ఆ రూపంలో ఉన్న సమాధానాన్ని మాత్రమే తుది సమాధానంగా పరిగణిస్తారని అది స్పష్టం చేసింది. పార్లమెంటు అధికారులు ఆ సమాధానాలను బహిర్గతం చేయకముందే, తాము అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఎంపిలు మీడియాకు వెల్లడించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు ఎంపిలు సోషల్ మీడియాలో కూడా సమాధానాలను పంచుకున్నారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ఉదయం 11 నుండి 12 గంటల మధ్య జరుగుతుండగా, రాజ్యసభలో ఇది మధ్యాహ్నం 12 నుండి 1 గంట మధ్య జరుగుతుంది.

# ఉక్రేన్‌పై రష్యా డ్రోన్ల వర్షం: 19 మంది మృతి

- దెబ్బతిన్న అనేక నివాస భవనాలు
- శిథిలాల్లో సహాయక చర్యలు

**కీవ్:** ఇటీవలికాలంలో తీవ్రస్థాయిలో రష్యాపై యుద్ధ దాడులు చేస్తున్న ఉక్రేన్ సోమవారం తెల్లవారకముందే భీకర దాడులకు గురైంది. రష్యా 23 బాలిస్టిక్ క్షిపణులతో పాటు వందల డ్రోన్ల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో మొత్తం 19 మంది మరణించారు. మరో 60 మంది గాయపడ్డారు. ఒక్క కీవ్ నగరంలోనే 13 మరణించగా ఇతర ప్రాంతాల్లో ఆరుగురు మరణించారు. కీవ్‌లోని నివాసిత ప్రాంతాలు,ఇతర మౌలిక సదుపాయాలు ఎక్కువగా ధ్వంసమైనట్లు ఉక్రేన్ ప్రకటించింది. కీవ్‌లోని ఎనిమిది మంది మరణించారు. నివాసిత ప్రాంతాల్లో దాడులతో కుప్పకూలిన శిథిలాలలో పలువురు చిక్కుకుపోయారు. వారిని వెలికి తీసేందుకు 20కి పైగా ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఐతే తమ వద్ద ఇంటర్‌సెప్టర్ల కొరత ఏర్పడిందని,అందువల్లనే ఒక్క క్షిపణిని కూడా కూల్చివేయలేకపోయామని ఉక్రేన్ సైన్యం పేర్కొంది. రెండు రోజుల్లోనే ఉక్రేన్‌పై రష్యా రెండోసారి విరుచుకుపడింది. ఎక్కువగా రష్యా ఈసారి గ్లైడ్ బాంబులు,క్షిపణులు,కామికాజ్ డ్రోన్లతో దాడులు చేసింది. దాడులవల్ల ఝెజోరిజియా ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. కీవ్‌లో ఆయుధ కర్మాగారం లక్ష్యంగా దాడులు చేసినట్లు రష్యా రక్షణశాఖ ప్రకటించింది. వందలాది డ్రోన్లు, క్షిపణులను రష్యా ప్రయోగించిందని, 29 క్షిపణులు లక్ష్యాలను దెబ్బతీశాయని ఉక్రేన్ అధికారులు చెప్పారు. అంతకుముందు ఉక్రేన్ చేసిన దాడుల్లో రష్యాలోని అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలచిపోయింది. ఇంతకుముందు గడచిన గురువారం రష్యా చేసిన దాడుల్లో 31 మంది ఉక్రేనియన్లు మరణించారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 16,000 మంది ఉక్రేనియన్లు మరణించారు. ఎక్కువమంది నివాసిత ప్రాంతాలలో నిద్రిస్తున్న సాధారణ పౌరులు వీరిలో ఉన్నారు. టర్కీ నగరం అంకారాలో నాటో కూటమి రెండు రోజుల సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో నాటో కూటమి దేశాలు రక్షణ బడ్జెట్ పెంచడంపై దృష్టి సారించాలని, ఇది ముఖ్య విషయంగా పరిగణించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో రష్యా భీకర దాడులు జరిగాయి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జి–7 శిఖరాగ్ర సమావేశంలో ఉక్రేన్‌కు అన్నివిధాల అండదండలు అందిస్తామని యూరప్ దేశాలు ప్రతిజ్ఞ చేసిన తర్వాత రష్యాపై దీర్ఘశ్రేణి డ్రోన్లు,క్షిపణులతో దాడులు బాగా పెరిగాయి. రష్యా తీవ్ర నష్టాలను చవిచూడటంతోపాటు దేశంలో చమురు సంక్షోభం తలెత్తింది. ఇటీవలికాలంలో యూరప్ దేశాల అండదండలతో ఉక్రేన్ భారీస్థాయిలో దీర్ఘశ్రేణి క్షిపణులు,ఎక్కువదూరం ప్రయాణం చేయగల డ్రోన్లను ప్రయోగించి రష్యా చమురు శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేస్తోంది. మాస్కో పరిసర ప్రాంతాలలో కూడా పౌర ప్రాంతాలను ధ్వంసం చేస్తోంది. దీనికి ప్రతీకార చర్యగా రష్యా తీవ్రస్థాయిలో స్పందించింది. మరోవైపు ఉక్రేన్ కూడా తమ దేశంపై దాడులు చేసిందని, రష్యా ప్రాంతాలు,అజోవ్ సముద్రంపై 519 ఉక్రేన్ డ్రోన్లు కూల్చివేశామని రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. క్రిమియాలోని కెర్చ్ నగరంలో ఒక మహిళ మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. రోస్తావ్ నగరంలో మరో ఇద్దరు గాయపడ్డారు. కలుగా పారిశ్రామిక సముదాయంలో డ్రోన్‌దాడులతో అగ్ని ప్రమాదం సంభవించిందని రష్యా వర్గాలు తెలిపాయి.

### నాటో సమావేశంలో కఠిన నిర్ణయాలు

**జెలెన్స్కీ విజ్ఞప్తి**

టర్కీ నగరం అంకారాలో మంగళవారం నుండి రెండురోజులపాటు జరిగే నాటో శిఖరాగ్ర సదస్సుకు రష్యా దాడులపై కఠిన నిర్ణయం తీసుకోవాలని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. 32 మిత్రదేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ 36వ నాటో శిఖరాగ్ర సదస్సుకు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డోగాన్ నాయకత్వం వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్,బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్,జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్,ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ,ఫిన్నిష్ ప్రధానమంత్రి అలెగ్జాండర్ స్టబ్,స్లోవాక్ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే, యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా కూడా పాల్గొంటారు. ప్రధానంగా యూరప్ దేశాలు తమ రక్షణ వ్యవస్థలను పటిష్టం చేసుకోవడానికి అదనపు నిధులు కేటాయించే విషయం, నాటో భద్రత గురించి చర్చిస్తారు.

# ట్రంప్‌ను చంపండి

**ఖమేనీ అంతిమయాత్రలో నినాదాలు**
**శత్రువులపై ప్రతీకార తీర్చుకోవాలని డిమాండ్**



**టెహ్రాన్:** అమరుడైన ఇరాన్ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ (86) ఆయన కుటుంబ సభ్యుల పార్థివదేహాల అంతిమయాత్ర టెహ్రాన్‌లో సోమవారం ప్రారంభమైంది.దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి వచ్చిన లక్షలాది భారీ జనసమూహం అంతిమయాత్ర రథం వెంట నడిచింది. ''ట్రంప్‌ను చంపండి'', అమెరికాకు మరణశిక్ష, ఇజ్రాయెల్‌కు మరణశిక్ష'' అనే నినాదాలు ఆజాదీ వీధుల్లో మారుమోగుతున్నాయి. శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవాలని సర్వత్రా నినాదాలు,డిమాండ్లు మాటిమాటికీ వినిపించచాయి. ట్రంప్‌ను చంపండి అని రాసి ఉన్న ఎరుపురంగు బ్యానర్లు అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో కనిపించాయి. స్త్రీలు, పురుషులు అనే భేదం లేకుండా వేలమంది సంతాపసూచకంగా నల్ల దుస్తులు ధరించి ఈ యాత్రలో నడిచారు. ఇరాన్ మతపాలనను సమర్థిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు రాజధానికి తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొనాలని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు ప్రవాహంలా తరలివచ్చారు. ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసిన హెలికాప్టర్ దృశ్యాలలో జనం క్రమశిక్షణగా అనేక వరుసలలో కిలోమీటర్ల దూరం పొడవునా ఒకరువెంట ఒకరు నడుస్తూ కనిపించారు. 2020లో రివల్యూషనరీ గార్డ్ జనరల్ ఖాస్సెం సోఏమానీ అంతిమయాత్రలో పాల్గొన్న 10 లక్షలమంది కంటే ఎక్కువ జనం ఈ అంతిమయాత్రలో కనిపించారు. లక్షలాదిమంది జనానికి ఎండ వేడి నుండి ఉపశమనం కల్పిండానికి భవంతుల పైనుండి అగ్నిమాపక సిబ్బంది నీటి తుంపరల వర్షం కురిపంచారు. ప్రజలు నెమ్మదిగా నడవాలని, ఒకరినొకరు తోసుకోవద్దని,ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటనలు చేశారు. ఈ యాత్ర కోసం టెహ్రాన్‌ను సాధారణ జీవన కార్యకలాపాలు లేకుండా మూసివేశారు. వీధుల్లో కేవలం అంతిమయ యాత్రకు వచ్చిన లక్షలమంది ప్రజలు మాత్రమే ఉన్నారు. ఖురాన్ వచనాలు,అంతిమయాత్ర వస్త్రాలు పార్థివదేహాలకు చుట్టారు.రివల్యూషనరీ గార్డ్ కోర్ రక్షణలో ఈ అంతిమయాత్ర కొనసాగింది. సిటీహాల్ పైకప్పుపై 200 మంది విదేశీ జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుండి వారు ఈ అంతిమయాత్ర దృశ్యాలను వీక్షించారు.స్త్రీలు,పురుషులు గుండెలు బాదుకుంటూ కన్నీళ్ళు కారుస్తూ పార్థివదేహాల వెంట నడిచారు. రద్దీ లేకుండా నివారించడానికి ప్రజలను వరుసలో నడిపించారు. వేలాదిమంది భద్రతాసిబ్బంది వలయంగా ఉన్నారు. తల్లీపిల్లలు,కుటుంబసభ్యులు ఈ యాత్రలో పాల్గొన్నారు. రాజధాని టెహ్రాన్ నుండి ఈ అంతిమయాత్ర రథాన్ని పవిత్రమైన ఖోమ్ నగరానికి తీసుకువెళతారు. నజఫ్‌లో కూడా వీడ్కోలు కార్యక్రమం నిర్వహిస్తారు. అక్కడ మంగళవారం యాత్ర జరుగుతుంది. జులై 8వ తేదీ బుధవారం ఇరాక్‌లోని పవిత్రమైన కర్బలా నగరంలో ఖమేనీ మృతదేహాన్ని ఊరేగిస్తారు. ఇమామ్ రెజా మందిరం ఉన్న ఖమేనీ స్వస్థలం మషద్‌లో గురువారంనాడు ఆయనతోపాటు కుటుంబసభ్యుల మృతదేహాలను సమాధి చేస్తారు.

# ఖమేనీని అంతం చేసింది మేమే

**ఇజ్రాయెల్ కట్జ్ బహిరంగ ప్రకటన**



**జెరూసలెం:** అమరుడైన ఇజ్రాయెల్ సర్వోన్నత నాయడు అలీ ఖమేనీని అంతం చేసింది తామేనని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ సోమవారం బహిరంగ ప్రకటన చేశారు. ఒకవైపు టెహ్రాన్‌లో ఖమేనీ మూడు రోజుల అంతిమయాత్ర కార్యక్రమాలు ప్రారంభమైన తరుణంలో కట్జ్ పైవిధంగా స్పందించారు. ఇజ్రాయెల్‌ను నాశనం చేసే ప్రణాళికను ముందుకు తీసుకువెళ్ళే ఏ నాయకుడినైనా ఇదే విధంగాఅంతం చేస్తాం, వారిని వదిలిపెట్టం, అడ్డుకుంటాం అని కట్జ్ పేర్కొన్నట్లు సిఎన్ఎన్ వార్తాసంస్థ తెలియజేసింది. దుఃఖంలో ఉన్న ఇరానీయులు లక్షలమంది తమ నాయకుడికి అంతిమ వీడ్కోలు పలికే ప్రార్థనా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న తరుణంలో కట్జ్ ఈ విధంగా వారిని రెచ్చగొట్టే ప్రకటన చేశారు. ''ప్రస్తుతం అంత్యక్రియలు జరుగుతున్న ఖమేనీని అంతం చేసింది ఇజ్రాయెల్ సైన్యమే, ఎందుకంటే ఇరాన్‌లో ఈ ప్రాంతం అంతటా ఇజ్రాయెల్‌ను నాశనం చేసే ప్రణాళికను ఆయనే ప్రారంభించారు. దానిని అమలు చేసే ప్రక్రియ కూడా చేపట్టి నాయకత్వం వహించారు'' అని కట్జ్ ప్రకటన చేశారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడిగా దాడులు చేయడంవల్ల నిలువరించగలిగామని, ఇజ్రాయెల్ ఉనికికి ఎదురయ్యే తక్షణ ప్రమాదాన్ని నివారించగలిగామని, ఇరాన్ వ్యూహాత్మక సామర్థ్యాలను తీవ్రంగా దెబ్బతీశామని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు చేశాయి. ఐతే ఈ దాడుల్లో ఖమేనీనీ చంపింది ఎవరనే విషయంలో స్పష్టత లేదు. ఇద్దరూ ఉమ్మడిగా హతమార్చారని ఇరాన్ నిర్ణయానికి వచ్చింది. కానీ ఇప్పుడు కట్జ్ ప్రకటనతో ఇరాన్‌కు పూర్తిస్పష్టత వచ్చింది. ట్రంప్‌కు మరణశిక్ష విధించాలి అని ఇరాన్‌లో లక్షలమంది ప్రజలు నినాదాలు చేస్తున్న తరుణంలో నిందను ఆయన నుండి తప్పించేందుకు కట్జ్ నుండి ఈ తాజా ప్రకటన విడుదల కావడం గమనార్హం.

## 250వ స్వాతంత్ర్య వేడుకలకు 4.22 లక్షలమంది వచ్చారు: ట్రంప్

**వాషింగ్టన్:** వాతావరణ పరిస్థితులు ఎంత మాత్రం అనుకూలించకపోవడంతో అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కళ తప్పాయి. వాషింగ్టన్‌లో తలపెట్టిన భారీ కార్యక్రమానికి ప్రజలు రాలేకపోయారు. తీవ్రమైన ఎండలు, ఆ తర్వాత భారీ వర్షాలతో కార్యక్రమం విఫలమైనప్పటికీ ట్రంప్ ఈ విషయంలో ఆలస్యంగా ఒక ప్రకటన చేశారు. ఈవేడులకు 4.22 లక్షలమంది ప్రజలు వచ్చారని, కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వారంతా వెనుదిరిగి వెళ్ళిపోయారని సవరించిన ప్రకటన విడుదల చేశారు. ఉరుములు, వర్షం వల్ల వెళ్ళిపోయారని, ఈ విషయం తనకు తెలిసిన తర్వాత వారంతా తిరిగి వస్తారని తాను ఆశతో ఎదురుచూశానని, చెప్పారు. తాను కోరుకున్నవిధంగానే జనం తిరిగి వచ్చారని, దాదాపు 1.50 లక్షలమంది ఈ వేడుకలలో పాల్గొన్నారని చివరకు అదొక అసాధారణమైన, అద్భుతమైన సాయంత్రంగా మారిపోయిందని ట్రంప్ చెప్పారు. వెళ్ళిపోయిన ప్రజలు ఈ వేడులకు తిరిగి రావడానికి సీక్రెట్ సర్వీసెస్, పోలీసులు ఎంతో కృషి చేశారని చెబుతూ వారి కృషికి అభినందనలు తెలియజేశారు. ఆకాశంలో నభూతో అన్నరీతిలో రికార్డు సృష్టించేవిధంగా ఒక బ్రహ్మాండమైన బాణసంచా వెలుగులు విరజిమ్మే ప్రదర్శన కొనససాగిందని, ఈ ప్రదర్శన పూర్తయిన వెంటనే భారీస్థాయిలో పెద్ద వర్షం కురిసిందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయంతంగా కొనసాగించడానికి బ్రహ్మాండమైన భద్రతా ఏర్పాట్లు చేశారని ట్రంప్ ప్రశంసించారు. అదేవిధంగా ట్రంప్ మరోసారి కమ్యూనిస్టులపై విరుచుకుపడ్డారు. కమ్యూనిస్టులవల్ల దేశానికి ప్రమాదం పొంచి ఉందని భయాలు వ్యక్తం చేశారు.

# గాజాలో హమాస్ ప్రభుత్వం రద్దు

**ఎన్‌సిఎజికి బాధ్యతలు అప్పగింత**



**గాజా:** గాజాలో తన ప్రభుత్వాన్ని హమాస్ సోమవారం రద్దుచేసింది. టెక్నోక్రాటిక్ నేషనల్ కమిటీ ఫర్ ద అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ గాజా (ఎన్‌సిఎజి) కు హమాస్ తన అధికారాన్ని బదిలీ చేసేముందుగా ఇప్పటివరకూ కొనసాగిన పరిపాలనను హమాస్ రద్దుచేసింది. గాజాలో హమాస్‌కు చెందిన అత్యవసర కమిటీ దీనితో రద్దయింది. పౌర ఉద్యోగులందరూ యథావిధిగా తమ బాధ్యతలు కొనసాగిస్తారని, ఇకమీదట వారంతా ఎన్‌సిఎజికి విధేయులుగా ఉంటారని హమాస్ ప్రకటించింది. అధికార బదిలీకి సంబంధించిన అన్ని సంప్రదాయాలను, ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలియజేసింది. గాజాలో యుద్ధం నివారించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల శాంతి ప్రణాళికలో భాగంగా ఈ అధికారాలను హమాస్ ఎన్‌సిఎజికి స్వాధీనం చేసింది. ఐతే హమాస్ ఆయుధాలను కూడా వదిలేయాల్సి ఉంది. కానీ ఆయుధాలను వదిలిపెట్టేదిలేదని హమాస్ ప్రకటించింది. అందువల్ల ఈ చర్యలన్నీ కేవలం కంటితుడుపు చర్యలుగా ఇజ్రాయెల్ పేర్కొంది. 2026 జనవరిలో ఈ ఎన్‌సిఎజి ఏర్పడింది. కొత్త ప్రభుత్వానికి అధికారం స్వాధీనం చేసేవరకూ ఎన్‌సిఎజి బాధ్యతలు నిర్వహిస్తుంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చేసిన 2803 తీర్మానం ప్రకారం, గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రకటించిన సమగ్ర ప్రణాళికకు అనుగుణంగా ఈ ఎన్‌సిఎజి బాధ్యతలు నిర్వహిస్తుంది. దోహా వేదకగా ట్రంప్ ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ పీస్‌కు ఈ ఎన్‌సిఎజి గాజాలో జరిగే రోజువారీ కార్యకలాపాల నివేదికను ఇకమీదట తెలిజేస్తూ ఉంటుంది.

## మిలిటెంట్ల మెరుపుదాడి
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయానికి (సాంగ్‌షాక్ వద్ద ఉన్నది) కాన్వాయ్ తిరిగి వెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది' అని ఆ అధికారి తెలిపారు. దాడి తర్వాత ఆ ప్రాంతంలో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీప ప్రాంతంలో కేంద్ర బలగాలకు, సాయుధ మిలిటెంట్లకు మధ్య కాల్పులు కూడా జరిగాయని ఆయన చెప్పారు. ఘటనా స్థలాన్ని భద్రతా వలయంలోకి తీసుకున్నామని, తనిఖీ కోసం ఇంఫాల్ నుండి ఫోరెన్సిక్ బృందాన్ని పంపినట్లు అధికారి తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో సమీపంలోని వరి పొలాల్లో పనిచేస్తున్న పలువురు రైతులను భద్రతా దళాలు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఇద్దరు అసోం రైఫిల్స్ సిబ్బంది హత్యను ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి అమానుష హింసను ప్రభుత్వం సహించదని, ఈ అరాచకాలకు మూగ సాక్షిగా ఉండిపోదని ఆయన స్పష్టం చేశారు. 'ఈ హత్యకు బాధ్యులైన వారిని అరెస్టు చేసి, చట్టం ప్రకారం శిక్షిస్తాం' అని పేర్కొన్నారు.

## నేడు పూర్తి చేయాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. సంబంధిత సూపర్‌వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏర్పాటు చేసిన 16 హెల్ప్‌డెస్క్‌లతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలపై ఓటరు, బిఎల్ఓ సంతకాలతో పాటు ఫొటోలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇఆర్ఓలు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పూర్తయిన ఫారాల డిజిటలైజేషన్‌ను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా చేపట్టి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో కాకుండా ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఫారాల భర్తీపై బిఎల్ఓలు, సూపర్‌వైజర్లకు మరోసారి శిక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే బిఎల్ఓలు రాజకీయ పార్టీలతో తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిఈఓ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, పిఎం ఐటి చిరంజీవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ప్లాంట్ హబ్‌గా సనత్‌నగర్ టిమ్స్



**మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు కేంద్రంగా (ట్రాన్స్‌ప్లాంట్ హబ్‌గా) సనత్‌నగర్ టిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లతో కలిసి సోమవారం మంత్రి దామోదర్ రాజనర్సింహా టిమ్స్‌లోని అత్యాధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఐసియూలు, వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నరసింహా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అన్ని రకాల అత్యాధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.సనత్‌నగర్ టిమ్స్‌ను అన్ని రకాల అవయవ మార్పిడి సేవలు ఒకేచోట అందించే ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్గా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలకు అవసరమైన ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసియూలు, వైద్య పరికరాలు టిమ్స్‌లో సిద్ధంగా ఉన్నాయని ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు తెలిపారు. దశలవారీగా కిడ్నీ, గుండె, కాలేయం తదితర అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించవచ్చని వైద్యులు మంత్రికి వివరించారు. నిమ్స్‌లో ఆపరేషన్ థియేటర్ల కొరత కారణంగా ఆలస్యం అవుతున్న న్యూరో, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, కార్డియోథొరాసిక్ వంటి సూపర్ స్పెషాలిటీ శస్త్రచికిత్సలను టిమ్స్‌లో నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. టిమ్స్ పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించిన వెంటనే నిమ్స్ వైద్య బృందాలు అక్కడి ఆపరేషన్ థియేటర్లను వినియోగించుకునేలా పరిపాలనా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి సంస్థగా నిర్వహించి, దేశంలోనే అత్యాధునిక ట్రాన్స్‌ప్లాంటేషన్, సూపర్ స్పెషాలిటీ వైద్యం, వైద్య విద్య, పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. టిమ్స్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు రోగుల నిరీక్షణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు.

## కృష్ణమోహన్
(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో చర్చలు జరిపారని ట్రస్ట్ కోశాధికారి గోవింద్ గిరి చెప్పారు. అయోధ్య రామాలయ నిర్మాణ ఉద్యమాన్ని నడిపించిన బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పటివరకూ ఈ విషయంలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు సమస్యను పరిష్కరించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. భక్తులు ఇచ్చిన విరాళాల డబ్బాలను దొంగతనం చేయడ తీవ్ర ఆవేదనకు, సంకట పరిస్థితికి దారితీసిందని అన్నారు. వందల సంవత్సరాలక్రితం నిర్మించిన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు జరిగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది చేసిన త్యాగాలపై ఈ వివాదం కారణంగా నీలినీడలు కమ్ముకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనప్పటికీ చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్టు ఆమోదించింది. ఐనప్పటికీ కూడా రామాలయ ఉద్యమంలో, రామాలయ నిర్మాణంలో చంపత్ రాయ్ చేసిన కృషి, ఆయన పాత్రను ట్రస్టు ఏకగ్రీవంగా అభినందించిందని గోవింద్ గిరి చెప్పారు. చంపత్ రాయ్‌ను ఆయన సమర్థిస్తూ, ''మా దృష్టిలో ఆయన నిష్కళంకుడు'' అని కొనియాడారు. రామాలయంకోసం ఆయన గొప్ప సేవలు చేశారని, ఎంతో కృషి చేశారని చెప్పారు. చంపత్‌రాయ్ గారు స్వచ్ఛంధంగా తనకు తానుగా రాజీనామా చేశారు. ఈ పదవిలో ఉండలేనని ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఈ పదవిలో కొనసాగడం సమర్థనీయం కాదని ఆయన భావించి రాజీనామా చేశారని చెప్పారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయ్యేవరకూ బాధ్యులను గుర్తించి న్యాయస్థానం ముందు నిలబెట్టే వరకూ ఆయన పదివిలో ఉండబోరన్నారు. ట్రస్టు నిబంధనల ప్రకారం ఒకసారి రాజీనామా చేసిన తర్వాత ఆ రాజీనామా అమలులోకి వస్తుందని, సీనియర్ ట్రస్టీ కె.పరాశరన్ చెప్పినందువల్ల ఇక ట్రస్టుకు ఆమోదం తెలియజేయడంతప్ప మరోమార్గం లేదన్నారు. ఈ నిధుల దుర్వినియోగం కేసులో పోలీసులు ఇప్పటివరకూ ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరిలో ఎక్కువమంది ఆ ధనాన్ని లెక్కించడంలో, నిర్వహించడంలో బాధ్యత వహించినవారే. ట్రస్టీలలో ఎవ్వరిపేర్లూ ఎఫ్ఐఆర్‌లో లేవు. భక్తులు విరాళంగా ఇచ్చిన వస్తువులు జాడ తెలియకుండా పోవడంపై గిరి మాట్లాడుతూ, అవి ఇంకా దొరకలేదన్నారు. భక్తుల నుండి నగదు కాకుండా 2,926 రకాల వస్తువులు రామాలయానికి వచ్చాయి. టస్టు ఈ విషయంలో రిజిస్టర్లు నిర్వహిస్తోందని చెప్పారు.

## పూర్తి చేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు.టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు.ఎస్ఎల్‌బిసి ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టిఎంసిల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు.ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నొక్కుతున్నారు
(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలు కేవలం పెద్ద పారిశ్రామికవేత్తలకే అనుకూలంగా ఉన్నాయని, 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' అనేవి కేవలం నినాదాలేనని రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఇటీవల తాను సందర్శించిన ఒక స్థానిక బస్సు, ట్రక్కు బాడీబిల్డింగ్ వర్క్‌షాప్‌కు సంబంధించిన వీడియోను సోమవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అక్కడ ఆయన తయారీ ప్రక్రియలో పాల్గొన్న వారితో ముచ్చటించారు. 'ఇనుప రేకులు... వెల్డింగ్ నిప్పురవ్వలు... సుత్తుల చప్పుడు... వీటన్నిటి మధ్య, కళాకారులు తమ కఠోర శ్రమ, నైపుణ్యంతో భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. జైపూర్‌లోని స్థానిక బస్సు, ట్రక్కు బాడీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లలో ఉపాధిని, దేశ పురోగతిని తన చేతులతోనే సృష్టిస్తున్న భారతదేశాన్ని మనం చూడవచ్చు' అని రాహుల్‌గాంధీ వీడియోతో పాటు హిందీలో పెట్టిన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'అయినప్పటికీ, ఢిల్లీలోని రవాణా మంత్రిత్వ శాఖలో రూపొందించిన నిబంధనలు దేశవ్యాప్తంగా ఈ చిన్న తరహా పరిశ్రమలను అణచివేస్తున్నాయి. సాంకేతిక లోపాల వల్ల బస్సుల్లో మంటలు చెలరేగడానికి, కేవలం వాహనాల బాడీలను నిర్మించే ఈ కళాకారులపై నింద మోపుతున్నారు' అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలు కేవలం పెద్ద పారిశ్రామికవేత్తలకు మాత్రమే అనుకూలంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఈ ఫ్యాక్టరీలు మూతపడితే, వ్యాపారం ఆగిపోవడమే కాకుండా, నైపుణ్యాలు కోల్పోవడం, ఉద్యోగాలు మాయమవడం, సామాన్యులపై ద్రవ్యోల్బణం భారం పెరగడం వంటివి జరుగుతాయని, ఎప్పటిలాగే, కష్టపడి పనిచేసే, నైపుణ్యం ఉన్న భారతీయులే దీనికి మూల్యం చెల్లిస్తూనే ఉంటారన్నారు. ఈ వీడియోలో, రాహుల్ స్థానిక ట్రక్, బస్ బాడీ బిల్డర్ల సమస్యలను వింటూ, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం కనిపిస్తుంది. ఈ వీడియోతో పాటు ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్‌లో 'రాజస్థాన్‌లోని స్థానిక బస్, ట్రక్ బాడీ బిల్డర్లను కలవడం ద్వారా, భారతదేశం తనంతట తానుగా ఉపాధిని సృష్టించుకోవడంతో పాటు, దేశాన్ని ముందుకు నడిపించే ఊపును కూడా ఇస్తుందని వెల్లడైందని' అన్నారు. మోదీ ప్రభుత్వపు ఎంఎస్ఎంఇ వ్యతిరేక విధానాలు పరిశ్రమల గొంతు నొక్కుతున్నాయన్నారు. 'చిన్న పరిశ్రమలు మూతపడినప్పుడు కేవలం ఒక కర్మాగారం మాత్రమే మూతపడదు; భారతదేశపు ప్రతిభ దెబ్బతింటుంది. కష్టపడి పనిచేసే కళాకారులు తమ జీవనోపాధిని కోల్పోతారు. ఈ నైపుణ్యాన్ని కొనసాగించే వారి హక్కును వారికి దూరం కానివ్వము' అని స్పష్టం చేశారు. రాజస్థాన్‌కు చెందిన చిన్న ట్రక్, బస్సు బాడీ తయారీదారుల బృందంతో కలిసి రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మార్చి 18న కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరిన కొన్ని వారాల తర్వాత ఈ పర్యటన జరిగింది. గడ్కరీని కలిసే ముందు, ఆ బృందం రాహుల్ గాంధీని కలిసి, ప్రభుత్వ కొత్త ప్రమాణాలు, అధిక రుసుముల కారణంగా అనేక చిన్న తయారీ సంస్థలు వ్యాపారం నుండి వైదొలగాల్సి రావచ్చని, తద్వారా లక్షలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడవచ్చని పేర్కొంది.

## ఎకో పార్కులు
(మొదటి పేజీ తరువాయి)

ఎకో పార్క్ తరహాలో హైదరాబాద్ నగరంలో ఎకో పార్కులు తీర్చిదిద్దాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖపై సిఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో సిఎం సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలని, తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను అధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, ప్రధానంగా వికారాబాద్‌లోని శ్రీవీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. యాదగిరిగుట్ట తరహాలో దేవస్థానానికి పాలకమండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను ముమ్మరం చేయాలని చెప్పారు. నగరంలో పురానాపూల్ వంటి వారసత్వ సంపదగా నిలిచిన బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి చేసిన తర్వాత అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు.

## రైతుల ఆగ్రహం
(మొదటి పేజీ తరువాయి)

తాము ఈ భూములను నమ్ముకునే సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నోటికాడి కూడును లాక్కోవద్దని, జీవనాధారమైన పోడు భూములను తమకు తిరిగి అప్పగించే వరకు పోరాటం ఆపేది లేదని రైతులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. జిల్లాలో సుదీర్ఘ కాలంగా పోడు భూముల సమస్య అపరిష్కృతంగానే ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పోడు పట్టాలు పంపిణీ చేస్తామని గతంలో పాలకులు హామీలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేకమంది గిరిజన, గిరిజనేతర రైతులు పట్టాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు సాగు హక్కుల కోసం రైతులు దరఖాస్తులు చేసుకుని ఎదురు చూస్తుంటే, మరోవైపు అధికారులు భూములను స్వాధీనం చేసుకోవడం గిరిజన గూడాల్లో అలజడి రేపుతోంది. చట్ట ప్రకారం తమకు లభించాల్సిన హక్కులను కాపాడాలని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సుర్దాపూర్ వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సుర్దాపూర్ గ్రామానికి చెందిన బాధితులు, పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## శాంసన్‌పై వేటు..

# జింబాబ్వే పర్యటనకు రింకూ, ప్రభ్‌సిమ్రన్



ఐర్లాండ్ చేతిలో వైట్ వాష్‌తో మేల్కొన్న భారత సెలెక్టర్లు టి–20 స్క్వాడ్‌లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కన పెట్టి.. ఐపిఎల్‌లో, దేశవాళీ క్రికెట్లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్‌గా విఫలమవుతున్న సంజూ శాంసన్‌పై వేటు వేస్తూ.. జింబాబ్వే పర్యటనకు రింకూ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లను తీసుకున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్ను ప్రకటించింది. జింబాబ్వేతో టి–20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాండ్‌తో తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడగా.. ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది. ఇషాన్ కిషన్‌కు బ్యాకప్ వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. ఐపిఎల్ 19వ సీజన్‌లో మెరిసి ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్ బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో మూడు టి–20ల సిరీస్ మొదలవ్వనుంది.

**భారత స్క్వాడ్ :** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్ కీపర్), శివం దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

# బ్రెజిల్‌పై నార్వే స్టన్నింగ్ విక్టరీ



ఫిఫా వరల్డ్‌కప్‌లో సంచలనం నమోదు అయ్యింది. అయిదు సార్లు ప్రపంచ కప్ విజేత బ్రెజిల్.. రౌండ్16లో ఓటమి పాలైంది. న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 2–1 గోల్స్ తేడాతో నార్వే విజయం సాధించి క్వార్టర్స్‌కి ఎంట్రీ ఇచ్చింది. ఫిఫా వరల్డ్‌కప్‌లో నార్వే క్వార్టర్స్కు ప్రవేశించడం ఇదే మొదటిసారి. స్టార్ ప్లేయర్ ఎర్లింగ్ హాలాండ్ అద్భుతమైన గేమ్‌తో ఆకట్టుకున్నాడు. అతను రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 1990 వరల్డ్‌కప్ తర్వాత రౌండ్16లో బ్రెజిల్ ఓడిపోవడం ఇదే మొదటి సారి. ఈ వరల్డ్‌కప్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న హాలాండ్ మరోసారి అదే దూకుడు ప్రదర్శించాడు. టోర్నమెంట్లో ఆరు, ఏడవ గోల్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే టోర్నీలో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాప్పే, మెస్సీతో సమంగా హాలాండ్ నిలిచాడు.

### హోరాహోరీలో మెక్సికో ఔట్.. క్వార్టర్స్‌లోకి ఇంగ్లండ్ ఎంట్రీ

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆతిథ్య జట్టు మెక్సికో కథ ముగిసింది. రౌండ్16 మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 3–2 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. మెక్సికో సిటీలోని అజ్టెకా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో. మెక్సికో జట్టు ఆఖరి నిమిషం వరకు తీవ్రంగా పోరాడింది. అయితే తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మ్యాచ్‌ను గంట ఆలస్యంగా ప్రారంభించారు. సొంత స్టేడియంలో ఆడుతున్న మెక్సికో ఇప్పటి వరకు 89 మ్యాచుల్లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే అక్కడ ఓడింది. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చాకచక్యంగా గేమ్ ప్రదర్శించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడే బెల్లింగ్హామ్ తొలి అర్ధభాగంలో కేవలం 98 సెకన్ల తేడాతో రెండు గోల్స్ చేశాడు. 36, 38వ నిమిషాల్లో అతను గోల్స్ చేసి ఇంగ్లండ్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఇంగ్లండ్ గోల్ కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ తన సూపర్ ఫామ్‌తో అద్భుతమైన షాట్లను జోర్డాన్ పిక్‌ఫోర్డ్ అడ్డుకున్నాడు. కానీ మెక్సికో ప్లేయర్ జులియన్ క్వినోన్స్ గోల్ చేసి ఆ జట్టులో ఆశలు రేపాడు. ఇంగ్లండ్ ప్లేయర్ కేన్ 60వ నిమిషంలో గోల్ చేయగా, మెక్సికో తరపున 69వ నిమిషంలో జిమినేజ్ గోల్ చేశాడు.

### క్వార్టర్స్కు ఫ్రాన్స్ పరాగ్వేను ఓడించి ముందంజ

రెండుసార్లు ప్రపంచ చాంపియన్ ఫ్రాన్స్ ఫిఫా వరల్డ్ కప్ క్వార్టర్స్‌లో ప్రవేశించింది. ఆ జట్టు సారథి కిలియన్ ఎంబాపె ఈ టోర్నీలో ఏడో గోల్తో మాజీ చాంపియన్‌కు మరో విజయం అందించి తన జట్టు ముందంజ వేయడంలో కీలకపాత్ర పోషించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున జరిగిన మ్యాచ్లో ఫ్రాన్స్.. 1–0తో పరాగ్వేను ఓడించి వరుసగా నాలుగో సారి క్వార్టర్స్కు అర్హత సాధించింది. అత్యంత నాటకీయంగా సాగిన పోరులో స్టార్ స్ట్రైకర్ ఎంబాపె మాత్రమే ఏకైక గోల్ కొట్టాడు. ఈ విజయంతో ఫ్రాన్స్.. గురువారం జరిగే క్వార్టర్స్ పోరులో మొరాకోను ఢీకొననుంది.


## యువతరంగం

# విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన




భారతదేశంలో విద్య కేవలం ఉద్యోగం సాధించడానికి మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలి కాలంలో విద్యా వ్యవస్థకు సంబంధించిన అనేక సమస్యలు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. ప్రశ్నాపత్రాల లీకేజీలు, ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలు, ఫలితాల ఆలస్యం, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నిధుల కొరత, పెరుగుతున్న ఫీజులు, విద్య క్రమంగా ప్రైవేటీకరణ వైపు సాగడం వంటి అంశాలు విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితిని పెంచుతున్నాయి. ఈ పరిస్థితులకు నిరసనగా రాజధానిలో కొందరు విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడం దేశ విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. విద్యార్థుల అభిప్రాయం ప్రకారం, సమస్య కేవలం ఒకటి లేదా రెండు పరీక్షలకు మాత్రమే పరిమితం కాదు. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, సాంకేతిక లోపాలు, పరీక్షల రద్దు, ఫలితాల్లో జాప్యం వంటి పరిణామాలు లక్షలాది మంది యువత జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన విద్యార్థులు ఒక్కసారిగా ఏర్పడే లోపాల వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ పరిస్థితులు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయడంతో పాటు భవిష్యత్తుపై నిరాశను కూడా కలిగిస్తున్నాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో నిధుల కొరత మరో ప్రధాన సమస్యగా మారింది. విద్యార్థి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల లేమి, ఆహారశాలల నిర్వహణలో ఇబ్బందులు, అధ్యాపకుల ఖాళీలు, పరిశోధనకు అవసరమైన వనరుల కొరత వంటి అంశాలు ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతున్నాయి. ఒక వైపు నిధులు తగ్గుతుండగా, మరోవైపు ఫీజులు పెరుగుతుండటం వల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య మరింత దూరమవుతోంది. విద్య క్రమంగా ఒక సేవగా కాకుండా వ్యాపార వస్తువుగా మారుతోందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రైవేటు విద్యాసంస్థల పెరుగుదలతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలపై పెట్టుబడులు తగ్గితే, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండదనే ఆందోళన విద్యార్థుల్లో కనిపిస్తోంది. రాజ్యాంగం కల్పించిన సమాన విద్యావకాశాలు క్రమంగా ఆర్థిక స్థోమతపై ఆధారపడే పరిస్థితి ఏర్పడితే సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. విద్యా సంక్షోభం ఉద్యోగ అవకాశాలతో కూడా ముడిపడి ఉంది. పోటీ పరీక్షల్లో పదేపదే ఎదురయ్యే అవకతవకలు, నియామకాలలో జాప్యం, ఖాళీల భర్తీలో ఆలస్యం వంటి అంశాలు యువతలో భవిష్యత్తుపై అనిశ్చితిని పెంచుతున్నాయి. విద్య పూర్తయినా ఉద్యోగం దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తోంది. ఇటీవల పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై కూడా సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవి వ్యక్తిగత వైఫల్యాల కంటే వ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తున్నాయని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల నిరసనల్లో మరో ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం. ప్రజా వ్యవస్థలో నిర్ణయాధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించాలి, విద్యార్థుల సమస్యలకు సమాధానం చెప్పాలి, లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. విద్యా విధానాల రూపకల్పనలో విద్యార్థుల అభిప్రాయాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. భారతదేశ అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి. ఆ యువతకు నాణ్యమైన, అందుబాటులో ఉండే, సమాన అవకాశాలు కల్పించే విద్య అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. విద్యార్థులు కోరుకునేది ప్రత్యేక సౌకర్యాలు కాదు; పారదర్శకమైన పరీక్షా విధానం, సమయానికి ఫలితాలు, అందుబాటులో ఉండే ఉన్నత విద్య, తగిన మౌలిక సదుపాయాలు, పరిశోధనకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలకు దారి తీసే సమర్థమైన విద్యా వ్యవస్థ. మొత్తంగా చూస్తే, విద్యార్థుల ఆందోళనలు కేవలం ఒక నిరసన కార్యక్రమంగా కాకుండా భారత విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న విస్తృత సమస్యలకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి. విద్యను అందరికీ అందుబాటులో ఉండే ప్రజా హక్కుగా కాపాడటం, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడం, నిధులను పెంచడం, విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడం నేటి అత్యవసర అవసరం. ఎందుకంటే బలమైన విద్యావ్యవస్థే సమానత్వం, సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధికి శాశ్వత పునాది.

### చెరగని చిరునవ్వు..



ఆత్మవిశ్వాసానికి, గుండె నిబ్బరానికి నిదర్శనంగా చరిత్ర పుటల్లో నిలిచిపోయే అతికొద్ది మందిలో జో ఆరిడీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. తన వద్ద ఉన్న రైలు బొమ్మను నవ్వులు చిందిస్తూ, మరో వ్యక్తికి అందిస్తున్న ఆరిడీ ఫొటోను చూస్తే, ఇది ఏదో ఫంక్షన్‌లో తీసి ఉండవచ్చని అనుకుంటారు. కానీ, మరికొద్ది సేపట్లో మరణ శిక్షను విధించకనుండా, తనకు ప్రీతిపాత్రమైన బొమ్మను ఆరిడీ తన తోటి ఖైదీకి అప్పచెప్తున్న ఈ దృశ్యం హృదయాన్ని ద్రవింప చేస్తుంది. జైలు గోడల మధ్య చివరి శ్వాసలు లెక్కపెడుతుండగానే ఒక మనిషి ముఖం మీద చిరునవ్వు వికసించడం అసాధారణం. మరణశిక్ష ఎదురుచూస్తూ కూడా అందరిని ఆశ్చర్యపరిచిన వ్యక్తి ఆరిడీ. అతని జీవితకథ ఒకవైపు విషాదం, మరొకవైపు ప్రేరణతో నిండినది. అతనికి ఒక నేరానికి శిక్ష విధించారు. కానీ ఆ నేరం అతను చేశాడా? లేదా? అన్నది ఇప్పటికీ ప్రశ్నగానే మిగిలింది. వాస్తవం ఏమైనా, జైల్లో ఉన్నప్పుడు అతని మనసులో కోపం, అసహనం, నిరాశ ఎక్కడా కనిపించలేదు. మరణాన్ని ఎదుర్కొంటున్నా, అతను కరుణ, సహజ సౌమ్యతను ప్రదర్శించాడు. జైలులో ఉండగా అతని వద్దున్న చిన్న రైలు బొమ్మల సెట్ అతనికి ఎంతో అమూల్యమైన వస్తువుగా మారింది. అది అతని జీవితంలో ఆనందాన్ని నింపిన ఏకైక ఆస్తి. కానీ మరణదండనకు ముందు రోజే, ఆ రైలు సెట్‌ను అతను మరో ఖైదీకి కానుకగా ఇచ్చేశాడు. తాను చివరికి వాడుకోలేనిదాన్ని, మరొకరి చేతిలో సంతోషంగా చూడాలని అతను కోరుకున్నాడు. ఈ బహుమానం చిన్నదే కావచ్చు... కానీ, అతను ప్రదర్శించిన స్థైర్యాన్ని లెక్కకట్టలేం. అతని ప్రవర్తన గమనించిన జైలు గార్డులు కూడా విస్మయానికి గురయ్యేవారు. మరణం దగ్గర్లో ఉన్నప్పటికీ అతని పెదవులపై చిరునవ్వు తగ్గేది కాదు. జైలు కారిడార్‌లలో అతని మాటలు, పంచిన ఆనందం వారిని కదిలించివేశాయి. అందుకే అతనిని 'మరణశిక్షలో సంతోషవంతుడు' అనే పేరు స్థిరపడింది. మనసులోని దయ, వినయం, సద్భావన వంటి లక్షణాలకు ఎలాంటి పరిస్థితులూ బంధించలేవని ఆరిడీ జీవితం స్పష్టం చేస్తుంది. ఒక చిన్న త్యాగం, ఒక చిన్న నవ్వు, ఒక చిన్న ఉదారత ఈ ప్రపంచాన్ని మార్చగలవని, మన పేరును చిరస్థాయిగా నిలపగలవని నిరూపిస్తుంది.

# కమ్యూనిస్టుయోధుడు కాల్వ నర్సయ్యయాదవ్

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు, గిట్టుబాటు ధర కోసం పోరాటాలు చేసి కార్మికుల, కర్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు కాల్వ నర్సయ్యయాదవ్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. కరీంనగర్‌లోని 6వ డివిజన్ బొమ్మకల్‌లో కాల్వ నర్సయ్య యాదవ్ 7వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఆయన స్థూపం వద్ద నిర్వహించారు. లారీ అసోసియేషన్ ఆఫీసు బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద నర్సయ్య యాదవ్ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కాల్వ నర్సయ్యయాదవ్ హమాలీ కార్మికుడిగా ప్రస్థానం మొదలు పెట్టి, ఎఐటియుసి అనుబంధ సంఘమైన హమాలీ సంఘంలో చేరి కార్మికుల హక్కుల కోసం, వేతనాల పెంపు కోసం పోరాటాలు నిర్వహిస్తూ కార్మిక నాయకుడిగా ఎదిగారన్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక కార్మిక సంఘాలను నెలకొల్పి వారిని చైతన్య పరుస్తూ, కార్మిక చట్టాలను కాపాడడం కోసం, వేతనాల పెంపు కోసం అహర్నిశలు పనిచేశారని, సిపిఐలో గ్రామ స్థాయి కార్యదర్శి నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎదిగారన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్‌లో పార్టీ నిర్మాణాన్ని ప్రారంభించి నియోజకవర్గం మొత్తం సిపిఐ విస్తరించడానికి ఆయన ఎంతో కృషి చేశాడన్నారు. గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం స్థాపనలో కీలక భూమిక పోషించారని, పెంపకందారుల సమస్యలపై ఆందోళనలు చేశారన్నారు. ఆయన చేసిన పోరాటాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడన్నారు. కాల్వ నర్సయ్య యాదవ్ ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చడానికి కార్మికులు, కమ్యూనిస్టు శ్రేణులు కృషి చేయాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాల్వ నర్సయ్య యాదవ్ ఉమ్మడి జిల్లాలో కార్మికుల కోసం, కర్షకుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయినీ అశోక్, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, నలువాల సదానందం, కుటుంబ సభ్యులు కాల్వ లక్ష్మీ, శ్రీనివాస్, నవీన్, జ్యోతి, మల్లేశం, గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్, నాయకులు జంగ తిరుపతి, సాయవేణి రాయమల్లు, తంగెళ్ళ సంపత్, ఆవునూరి రమేష్, కదారి భీరయ్య, జక్కుల ఆగయ్య, చిగుళ్ల శ్రీనివాస్, అల్లేపు రాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో

# డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి

### ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాల బకాయిలు తక్షణమే మంజూరు చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రదర్శనగా వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీనితో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఐదేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మంజూరు చేయడం లేదన్నారు. ప్రభుత్వం మారిన పాలన మాత్రం అలాగే ఉందన్నారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ నాన్ ప్రొఫెషనల్ రూ.2వేల కోట్లు, ప్రొఫెషనల్ రూ.4వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పలు మార్లు నిరవధిక బంద్ నిర్వహించినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సుమారు రూ.10వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయడంతో పాటు ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతంచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగులమీరా, మనోజ్, నాయకులు పవన్, మనోజ్, సుకుమార్, ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం

### ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి ఇమ్రాన్




**ప్రజాపక్షం/భువనగిరి :** కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ పేర్కొన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని రాఘవేంద్ర కన్వెన్షన్ హాల్లో ఎఐటియుసి భువనగిరి మండల 5వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయన్నారు. 44 కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం కార్మికులకు శాపంగా మారాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడం వల్ల కార్మికులు, మధ్యతరగతివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచడం వలన పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారన్నారు. కనీస వేతనం ప్రతి కార్మికుడికి రూ.26వేలు ఇవ్వాలని, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సామల శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి గనబోయిన వెంకటేష్, సభ్యులు సామల భాస్కర్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయకార్యదర్శి చింతల మల్లేష్, నాయకులు ముంతాజ్ బేగం, పల్లె శ్రీనివాస్, పిన్నం జగన్, గుర్రాల శ్రీనివాస్, మట్ట కుమార్, కొత్త కృష్ణ, దంతూరి జ్ఞానేశ్వర్, రాసాల భాస్కర్, ముదిగొండ బసవయ్య, కొలిపాక మల్లయ్య, పసాగళ్ల శంకరయ్య, గౌరిగే శంకరయ్య, మంద బాబు, ఖలీల్, కిషన్ పాల్గొన్నారు.

# నల్ల చట్టాలతో కార్మికులను మోసం చేస్తున్న మోదీ

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి




**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్రంలో మోదీ ప్రభుత్వం నల్లచట్టాలతో కార్మిక, కర్షక, ప్రజలను మోసం చేస్తున్నాడని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో జరుగుతున్న సిపిఐ మహబూబాబాద్ జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను రెండవ రోజు విజయసారథి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ మోదీ సర్కార్ అవలంభిస్తున్న కార్మిక ప్రజా కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బిజెపి ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడానికి సెప్టెంబర్ 1న లక్షలాది మందితో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామని, రామ్‌లీలా మైదానంలో లక్షలాదిమందితో భారీ నిరసన ఆందోళన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ 12ఏళ్ల పాలనలో అంబానీ, ఆదానీలకు మాత్రమే పని చేశారని, దేశంలో ఏ ఒక్కరికి మోదీ చేసిందేమిలేదన్నారు. మోదీ పాలనలో పేదరికం పెరిగిపోయిందని, నిరుద్యోగ పెరిగిందన్నారు. ఇటు కార్మికులను, ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూ నడ్డి విరుస్తున్నాడన్నారు. నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికులను మోసం చేశాడన్నారు. దేశ ప్రజలు మోదీపై తిరుగుబాటు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. సిపిఐ బలోపేతానికి శిక్షణా శిబిరాలు తోడ్పడుతాయన్నారు. రానున్న కాలంలో జిల్లాలో ప్రజా సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం కులం, వర్గం, వర్గపోరాటాలు, సామాజిక న్యాయంపై సింగు నర్సింహారావు మాట్లాడారు. రాజ్యాంగం ప్రాముఖ్యత, పరిరక్షణపై రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్ నారాయణ మాట్లాడారు. భారత స్వాతంత్ర్యోద్యమం, సిపిఐ పాత్ర అనే అంశంపై జితేందర్‌రెడ్డి మాట్లాడారు. సిపిఐ ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిగమించే మార్గాలపై విజయసారథి మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో సిపిఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు బి.అజయ్ సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, ఓమ బిక్షపతి, బందు మహేందర్, కిరణ్, లక్ష్మణ్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, వరిపెల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి




**ప్రజాపక్షం/ఖమ్మం :** పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ఏనుగు గాంధీ మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి మొదలైన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్రోల్ ధరలతో ఆటో కార్మికులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేలు ఆటో కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, కార్పొరేట్ ఆన్‌లైన్ సర్వీసులను రద్దు చేయడంతో పాటు ఆటో కార్మికులకు ఉచిత ప్రమాద బీమాను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జాకీర్, కార్మికులు పాల్గొన్నారు.



## అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 43 దరఖాస్తులు, డిపిఓ 5, మున్సిపాలిటి 5, డిడబ్లుఓ 4, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి మొత్తం 76 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, జడ్‌పి సిఇఓ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ, డిఏఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్ పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాలో 99.2 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

### వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ లో భాగంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు 99.2 శాతం ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ వెల్లడించారు.సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతోఎస్ఐఆర్ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తక్కిన ఎన్యుమరేషన్ ఫారాలను మంగళవారంలోగా పంపిణీ చేస్తామని తెలిపారు. "ఎస్.ఐ.ఆర్"కు సంబంధించి డిజిటైజేషన్ 25 పూర్తయిందని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతిరోజు 10 శాతం పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని సీఈఓకు వివరించారు.అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు నమోదు, బి.ఎల్.ఓ, బి.ఎల్.ఓ సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల తరఫున ఎన్నికైన బూత్ అసిస్టెంట్ల భాగస్వామ్యం,సాంకేతిక సమస్యలు,పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా రెవెన్యూ అధికారి దశరథ తదితరులు హాజరయ్యారు.

## బీసు సోములు ఆశయాలు సాధించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాలదామోదర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మోత్కూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు బీసు సోములు ఆశయాలను సాధించాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. బీసు సోములు 9వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో టెలిఫోన్ ఎక్స్చేంజి సమీపంలో బి సోములు స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్థూపంపై సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జెండా ఎగరవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బీస్ సోములు చిన్ననాటి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడై యువజన సంఘంలో మోత్కూరు తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఆనాటి పరిస్థితుల్లో యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై గుండాల ఆత్మకూరు మోత్కూరు అడ్డగూడూరు ప్రాంతాల నుండి యువతను చైతన్యం చేసి అనేక పోరాటాల నిర్వహించారన్నారు. సోములు ఆశయాలు సాధించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జెల్ది రాములు, మోత్కూరు మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీతా పనివాళ్ల సంఘం జిల్లా అధ్యక్షులుచాపల అంజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషిపాక నర్సింహ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జిట్టా రాములు, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి మొగుళ్ళ శేఖరరెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పులుకరం మల్లేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగా నరసింహపాల్గొన్నారు.

## ప్రతీ ఓటును కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలదే

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ కార్యక్రమాంపై బిఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవరకొండ మండలం, పట్టణ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల కోసం పట్టణంలోని పిపిఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ అవగాహన సదస్సు కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రతి ఓటును కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ బిఎల్ఏలపై ఉందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి బిఎల్ఏ పూర్తి స్థాయిలో అవగాహనతో నిర్వహించాలని, ప్రతి ఇంటిని సందర్శించిఅర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత పేర్లను నమోదు చేయడంతో పాటు, తప్పుగా తొలగించిన లేదా పొరపాట్లు ఉన్న ఓట్లను వెంటనే సవరించాలని కోరారు. ఈకార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షులు మారుపాకుల సురేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు రయిస్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



# వాసాలమర్రిని ఆదర్శ గ్రామం చేస్తాం

### త్వరలో గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. సోమవారం ఉదయం ఆయన గ్రామంలో 'మార్నింగ్ వాక్' నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కరరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి..**

గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే నిశితంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్లు, విద్యుత్ సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. త్వరలో జరగనున్న ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నేపథ్యంలో, వాసాలమర్రి గ్రామాన్ని అన్ని రంగాల్లో నమూనా గ్రామంగా తీర్చిదిద్దుతున్నాం. ఈ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రానున్నారు' అని వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలోపు గ్రామంలోని అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ అనురాధ బాబు, మండల అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సూర్యాపేట (తుంగతుర్తి) :** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని గిరిజన సాంఘీక సంక్షేమ గురుకులంలో విద్యావసతి గృహానికి రూ.4కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన నూతన భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. సాంఘీక సంక్షేమ, గిరిజన గురుకులాలు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మోడల్ స్కూల్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. గురుకుల విద్యార్థి రాష్ట్ర ర్యాంకును పొందినట్లయితే రూ.50వేలు బహుమతి అందిస్తానని తెలిపారు. నియోజక వర్గంలోని 9 మండలాలకు, నూతన మండల పార్టీ అధ్యక్షులను, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ సహకారంతో కృషితో ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజక వర్గంలోని 144 లబ్ధిదారులకు సుమారు 45 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. నూతన అధ్యక్షులైన రేగటి రవి గౌడ్, పచ్చిపాల వెంకన్న, సుంకరి జనార్ధన్, మల్లారెడ్డి, వెంకటేశం, సుధాకర్ రెడ్డి తదితరులను నాయకులు, కార్యకర్తలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్‌సిఓ జాను నాయక్, ప్రిన్సిపాల్ అరుణ, తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులుపాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల రాయితీ కల్పించాలి

### టియుడబ్ల్యూజె(ఐజెయు) ఆందోళన



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల రాయితీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యూజె(ఐజెయు) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు రాస్తారోకో,నిరసన ఆందోళన చేపట్టి, అనంతరం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబ సభ్యుల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల రాయితీ కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసినప్పటికీ,విద్యా శాఖ అధికారులు అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.జిల్లా కమిటీ పిలుపు మేరకు స్వల్ప వ్యవధిలోనే జిల్లాలోని అన్ని మండలాలు,పట్టణాలు,నియోజకవర్గ,డివిజన్ కేంద్రాల్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేశారని నాయకులు తెలిపారు.ఈఉద్యమానికి సహకరించిన ప్రతి జర్నలిస్టుకు జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో కూడా రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ ఇచ్చే పిలుపులకు ఇదే ఐక్యతతో స్పందిస్తూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.ఈ అంశంపై గతంలో జిల్లా విద్యాశాఖాధికారికి, కలెక్టరేట్‌లో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కోసంసర్క్యులర్లు జారీ చేసిన నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో కూడా 75 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సంఘం జిల్లా సహాయ జిల్లా యాదయ్య,డివిజన్ కార్యదర్శి కత్తుల యాదగిరి,ఉపాధ్యక్షుడు చింత యాదగిరి,తెల్గమళ్ల దశరథ,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కల పరమేష్,ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు మాదారి యాదగిరి,అశ్వక్ అహ్మద్, ఆబోజు మదన చారి,పిట్టల రామకృష్ణ,గంగాధర వెంకటేశ్వర్లు, ఎస్‌కె సలీం,సోమశేఖర్,గుడిపాటి శ్రీనివాస్,అశోక్ కుమార్,బోగారి రామకృష్ణ,డి ఎస్ యాదవ్,బందేలస్వామి,భజరంగ్ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను వేగంగా స్పందించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజా సమస్యలపై అధికారులు ఆలస్యం చేయకుండా వేగంగా స్పందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

## ఆర్‌డిఒకు భూమి సమస్యలపై వినతి

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్యంగా భూ సమస్యలపైనే వినతి పత్రాలు అందాయి. తమ వ్యసాయ భూములకు సమస్యల పరిష్కారమార్గం చూపాలని కోరుతూ రైతులు 5 ఫిటినన్లు ఆర్డీఓ వందనపు శ్రీదేవిని కలిసి వినతి పత్రాలను అందజేశారు.

# కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ

### పార్టీ కోసం కష్టపడ్డ వారికి మొండిచెయ్యి

### ఎంపికల్లో కొరవడిన సామాజిక న్యాయం

### పార్టీ శ్రేణులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్న వైనం




(ఫైల్ ఫోటో)

**ప్రజాపక్షం/సూర్యాపేట :** అధికార కాంగ్రెస్ పార్టీలో జిల్లా నాయకుల మధ్య పార్టీ పదవుల పంచాయితీ తారాస్థాయికి చేరింది. పార్టీ కోసం ఏండ్ల తరబడి నుండి కష్టపడ్డ వారికి పార్టీ పెద్దలు మొండిచెయ్యి చూపారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పదవుల ఎంపికలో సామాజిక న్యాయం పూర్తిగా కొరవడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పార్టీ శ్రేణులు ఏకంగా రోడ్డెక్కి తమ నిరసనలు తెలుపుతున్న పరిస్థితి.

కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య పార్టీ పదవుల పంచాయితీ మొదలైంది. జిల్లాలోని మొత్తం 23 మండలాల్లో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ప్రతిపాదిస్తూ పంపిన జాబితా ప్రకారం పట్టణ, మండల పార్టీ అధ్యక్షుల పేర్లను గత మూడు రోజుల క్రితం అధికారికంగా ప్రకటించడం జరిగింది. సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాలలో పట్టణ, మండల అధ్యక్ష పదవుల ఎంపిక పార్టీ శ్రేణులందరికి ఆమోద యోగ్యంగా ఉండగా హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజక వర్గాల్లో పార్టీ పదవుల ఎంపికపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పెద్దలు ఏండ్ల తరబడి నుండి పార్టీ కోసం పనిచేసిన కరుడు గట్టిన కాంగ్రెస్ వాదులను పక్కకు బెట్టి ఏ మాత్రం సమన్యాయం పాటించకుండా పార్టీలోకి వలస వచ్చిన వారికే పదవులు కట్టబెట్టారంటూ మెజార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజక వర్గాలలో ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి, శాసనసభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యులు మందుల సామేల్ ఏకపక్షంగా తన అనుయాయులకే పదవులు కట్టబెట్టారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

పార్టీ పదవుల ఎంపికలో సామాజిక న్యాయం ఏ మాత్రం పాటించలేదని నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 07 మండలాలు, 02 పట్టణ పార్టీకి ప్రకటించిన అధ్యక్ష పదువుల్లో మఠంపల్లి మండల పార్టీ అధ్యక్షుడుగా ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన భూక్యా మంజూ నాయక్ మినహా మిగతా 06 మండలాలైన హుజూర్‌నగర్ రూరల్, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల రూరల్, గరిడేపల్లి, చింతలపాలెం మండలాలకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి అధ్యక్ష పదవులు కట్టబెట్టగా, పాలకవీడు మండల పార్టీ అధ్యక్షుడిగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఎన్.వి. సుబ్బారావును ప్రకటించారు. హుజూర్‌నగర్ పట్టణ పార్టీ అధ్యక్షునిగా వైశ్య కమ్యూనిటికి చెందిన గెల్లి రవికి, నేరేడుచర్ల పట్టణ పార్టీ అధ్యక్షుడిగా నూకల సందీప్ రెడ్డిని నియామకం చేయడం జరిగింది. దీనిని బట్టి చూస్తే నియోజక వర్గంలోని పార్టీ పదవుల పంపకాల్లో ఎక్కడ కూడా సామాజిక న్యాయం పాటించలేదని ఇట్టే స్పష్టమవుతుంది. దీనిపై పార్టీశ్రేణులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎదురించి బహిరంగంగా మాట్లాడకున్నా లోలోన మాత్రం తీవ్రంగా మదనపడుతున్నారు. పార్టీ కోసం ఏండ్ల తరబడి కష్టపడ్డ మాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎప్పుడు అగ్రవర్ణాల వారికే పదవులు కట్టబెట్టడంపై పెదవి విరుస్తున్నారు. సోషల్‌మీడియాలో కూడా దీనిపై పెద్దఎత్తున చర్చ సాగుతుంది.

**ఇదిలా ఉంటే తుంగతుర్తి నియోజక వర్గంలో....**

తుంగతుర్తి నియోజక వర్గంలో కూడా పార్టీ పదవుల ఎంపికలో సామాజిక న్యాయం ఏమాత్రం పాటించలేదని పార్టీ కోసం మొదటి నుండి పనిచేస్తున్న వారికి మొండి చెయ్యి చూపారని పార్టీశ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ పార్టీ కోసం ఏండ్ల తరబడి నుండి పనిచేస్తున్న వారిని పక్కకు పెట్టి ఎన్నికల ముందు తనతో పాటు బిఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు మొదటి నుండి అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతోపాటు పార్టీ పదవులు కూడా వారికే కట్టబెట్టారని ఆరోపిస్తున్నారు.

ఈ నియోజక వర్గంలో మొత్తం 9 మండల పార్టీ అధ్యక్ష పదువులు వలస వాదులకు కట్టబెట్టారని దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనుచరులు ఎమ్మెల్యే మందుల సామేల్ తీరును తప్పుబడుతూ ఏకంగా ఆదివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. సామాజిక న్యాయంతోపాటు పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు ఇవ్వలేదని సూర్యాపేట జనగాం 365 జాతీయ రహదారిపై నాయకులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే కబంద హస్తాల నుండి కాంగ్రెస్‌ను కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రకటించిన పదవుల జాబితాను రద్దు చేయకుంటే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.



## హామీలు అమలు చేయాలని జెన్‌కో బాధితుల ధర్నా

**ప్రజాపక్షం/చింతలపాలెం :** పులిచింతల జలవిద్యుత్ (జెన్‌కో) ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలు, నిర్మాణ సమయంలో ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు సోమవారం జెన్‌కో ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో బాధిత కుటుంబాలకు శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పటికి అమలు చేయలేదని ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం గత 16 సంవత్సరాలుగా కేవలం కాంట్రాక్ట్ ప్రాతిపదికన మాత్రమే విధులు నిర్వహింపజేస్తున్నారని తెలిపారు. ఇటీవల స్థానికంగా పనిచేస్తున్న 12 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించి, వారి స్థానంలో రామగుండం నుంచి ఆర్టిజన్లను నియమించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వల్ల నష్టపోయిన కుటుంబాలను పక్కనపెట్టి ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలు కల్పించడం సరికాదన్నారు. ధర్నా సమాచారం అందుకున్న ఎస్ఐ పరమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో, జెన్‌కో అధికారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎస్‌సిదేశ్య నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ గడువు ముగిసిందని, అయినప్పటికి స్థానిక ఉద్యోగుల కొనసాగింపునకు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్ణయం తమ పరిధిలో లేదని, బాధితుల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అయితే చర్చలు ఫలించకపోవడంతో ఆందోళన కొనసాగించిన 12 మంది బాధితులను పోలీసులు ప్రివెంటీవ్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నా సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన తమ కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయకుండా, ప్రస్తుతం ఉన్న ఉపాధిని కూడా కోల్పోయే పరిస్థితి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే బాధిత కుటుంబాలు మొత్తం పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు.

## బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని బీబీనగర్ ఎయిమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. 1885లో శాస్త్రవేత్త Louis Pasteur మొదటి సారిగా రేబిస్ వ్యాక్సిన్‌ను విజయవంతంగా అందించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. జంతువుల నుంచి మనుషులకు, అలాగే మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే అంటు వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, అలాగే 'వన్ హెల్త్ (One Health)' భావనను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. మానవ ఆరోగ్యం, పశు ఆరోగ్యం, పర్యావరణం పరస్పర అనుసంధానమై ఉన్నాయని ఈ భావన తెలియజేస్తుంది. ఈ కార్యక్రమాన్ని ఎయిమ్స్ బీబీనగర్ సూక్ష్మ జీవ శాస్త్ర విభాగాధిపతి, డీన్ (రిసెర్చ్), ఆర్సీఓహెచ్ఎన్సీడీసీ నోడల్ అధికారి డా. రాహుల్ నారంగ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, అదనపు ప్రొఫెసర్, కోప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా. ఆర్. శ్యామల సమన్వయం చేశారు. కార్యక్రమంలో సూక్ష్మ జీవ శాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి తెలంగాణ (ఆల్ ఇండియా రేడియో, హైదరాబాద్) ద్వారా డా.రాహుల్ నారంగ్ ప్రత్యేక ప్రసంగం చేశారు. జూనోటిక్ వ్యాధులు, వాటి నివారణ, 'వన్ హెల్త్' విధానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమాజం, వైద్యులు, పశువైద్యులు, పర్యావరణ నిపుణులు కలిసి పనిచేస్తేనే జూనోటిక్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో 'సమాజ భాగస్వామ్యంతో జూనోటిక్ వ్యాధుల నివారణ' అనే అంశంపై డా. రాహుల్ నారంగ్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. వివిధ శాఖల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, వన్ హెల్త్ విధానం ద్వారా జూనోటిక్ వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు. వీటి నివారణకు సమగ్ర నిఘా, ముందస్తు గుర్తింపు, బాధ్యతాయుతమైన పశు సంరక్షణ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని ఎయిమ్స్ బీబీనగర్ వైద్య నిపుణులు సూచించారు.

## పోలీసుల అవినీతి అంతం కావాలంటూ పొర్లు దండాలు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీసుల అవినీతి అంతం కావాలంటూ పొర్లు దండాలతో ఒక వ్యక్తి నిరసన నిరసన తెలిపిన సంఘటన హన్మకొండలో చోటు చేసుకుంది. పోలీస్ శాఖలో అవినీతి నిర్మూలన చేయాలని డిమాండ్ చేస్తూ దుగ్గొండి మండలానికి చెందిన సురేందర్ హనుమకొండ అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద వినూత్నంగా సోమవారం నిరసన చేపట్టారు. పొర్లు దండాలు చేస్తూ తన నిరసనను వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థలో అవినీతి నశించాలని, ప్రజలకు పారదర్శకంగా న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన భూమిని కొంత మంది అక్రమంగా కబ్జా చేశారని పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులే తనను వేధించారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతులు



**ప్రజాపక్షం /నల్లబెల్లి :** ప్రమాదకంగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి సిపిఐ మండల కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది . సోమవారం నల్లబెల్లి తహసీల్దార్‌కు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరమ్మత్తులు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు . మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిపైకప్పు పెచ్చులు ఊడిపోయిన భవనాన్ని పరిశీలించారు . 108 సిబ్బంది ఆసుపత్రిలో రాత్రి వేళ నిద్ర పోయినప్పుడు పెచ్చులు ఊడిపోయి మీద పడిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని సిపిఐ మండల పార్టీ కార్యదర్శి బట్టు సాంబయ్య చెప్పారు . వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఆసుపత్రి మరమ్మత్తులు చేపట్టాలని కోరినారు . సిపిఐ పార్టీ నాయకులు పరికి కోర్నెల్ ,కడియాల క్రాంతికుమార్ ,మామిండ్ల పెద్ద అయిలయ్య ,ఎంసిపిఐ మండల నాయకలు దామ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు .

## సన్న రకాల వడ్ల కొనుగోలును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** రైతులు సన్న రకం వడ్ల కొనుగోలును డీలర్లు సీడ్ గ్రోవర్ వెబ్సైట్లో తప్పకుండా నమోదు చేయాలనీ మండల వ్యవసాయ అధికారి అక్కిరెడ్డి కరుణాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రం లోని రైతు వేదికలో విత్తన లైసెన్స్ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు సన్న రకం వడ్ల అమ్మకాలను విత్తన లైసెన్స్ డీలర్లు సీడ్ గ్రోవర్ వెబ్సైట్లో ఎలా నమోదు చేయాలి అనే దానిపై అయన వివరించారు. రైతులు సన్నరకం వడ్ల కొనుగోలును డీలర్ల వద్ద తప్పకుండా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని అయన సూచించారు. ఏడు రకాల సన్న రకం వరి విత్తనాల పేర్లు ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, జైశ్రీరామ్, హెచ్ఎంటి సోనా, కేఎన్ఎం 7715, బిపిటి 5204, వరంగల్ 44 వంటి ఏడు వరి సన్న రకాలను రైతులు కొనుగోలు చేసిన వెంటనే డీలర్ల వద్ద ఆన్లైన్ లో తప్పకుండా నమోదు చేసుకోవాలని అయన అన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ సమస్యలపైన వినతులను సమర్పించే ప్రజలకు నమ్మకం కలిగేలా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవరం కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్‌ల్‌లో నిర్వహించిన ప్రజావాణి ద్వారా ప్రజల నుండి జేసి బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 396 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వినతులను పెండింగ్‌లో లేకుండా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ ప్రజావాణిలో డిఆర్‌డిఒ భాస్కర్, గృహ నిర్మాణపిడి మాతృ నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారమే పోలీస్ శాఖ లక్ష్యం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన నలుమూలల నుండి ఫిర్యాదుదారుల నుండి వచ్చిన 16 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా దివాస్ లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు.

# పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారు?

బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ధ్వజం
కొత్తగూడలో డిగ్రీ కళాశాల ప్రారంభం
అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో
తెలంగాణ ప్రజల సంక్షేమమే
ప్రభుత్వ ధ్యేయం





**ప్రజాపక్షం/కొత్తగూడ/గూడూరు/ములుగు:** గత పదేళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం భ్రష్టుపట్టిపోయిందని అసలు ప్రజల కొరకు మాజీ సిఎం కెసిఆర్ ఏం చేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండ ల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలతో పాటు మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం తె లంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని మంత్రి సీతక్క ఆరోపించారు.మరి పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదు? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిఆర్ఎస్ నాయకులపై ఉంది అని ఆమె ప్రశ్నించారు.ప్రజల మధ్య ఉండాల్సిన నాయకుడు ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కంటే కొద్ది మంది నాయకుల సంపాదనకే ఎక్కువ ప్రాధాన్యం లభించిందని గ్రామీణ ప్రాంతాల్లో విద్య వైద్యం ఉపాధి మౌలిక వసతుల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆమే ఆరోపించారు.రైతులు మహిళలు యువత విద్యార్థులు పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ అభివృద్ధికార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ మండలంలో విద్యా అవకాశాలను విస్తరించాలనే ఉద్దేశంతో కొత్త విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు . ఈకార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకలు కార్యకర్తలు విద్యార్థులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ములుగు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించా రు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హే మంత్ సహదేవరావుతో కలిసి నిర్వహించిన సమీక్ష స మావేశంలో మేడారం ఆలయ అభివృద్ధి ఐడిఒసి పనులు వర్షాల పరిస్థితి సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించా రు. మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధికి స మగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించి భూసేకరణ రహదారు ల విస్తరణ క్యూలైన్లు అతిథి గృహాలు పార్కింగ్ పారిశు ధ్యం జంపన్న వాగు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి 6000కోట్ల పనుల టెండర్లు పూర్తయ్యాయని సిఎం పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలకు ప్రతిపాదన లు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామచంద్రపురం భూసర్వే పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ రామప్ప లక్నవరం పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని సూచించా రు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క సూచించారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం

ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** ఓటర్ల జాబితా ప్ర త్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని వర్ధన్నపేట శాసనసభ్యులు,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరా జు అన్నారు.సోమవారం వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండలాలకు చెందిన బిఎల్‌ఎలకు కిట్లను అందజేశారు.మున్సిపాలిటీ, మండల పరిధిలో ని పార్టీ ఇన్‌చార్జిలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు.ఓటరు జా బితా ప్రక్రియను పారదర్శకంగా,సమర్థంగా ని ర్వహించాలన్నారు.ప్రజలకు అవగాహన కల్పి ంచి ఓటరు జాబితాలో మార్పులు,చేర్పులు చే సుకునేలా బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించా రు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షు ణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తా వులేకుండా సర్వే నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మెన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి రాజేందర్,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, మండల అధ్యక్షులు పోశాల వెంకన్న,సొసైటీ చైర్మన్ రాజేష్ ఖ న్నా,ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్,మాజీ మ ండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, మాజీ బ్లాక్ కా ంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి,మాజీ పట్టణ అధ్యక్షుడు మైస సురేష్,సీనియర్ నాయకులు మహ్మద్ చోటు,సుధీర్ గౌడ్,మరుపట్ల సాయి, కీమా నాయక్,రజిత రె డ్డి, తుళ్ళ రవి,కౌన్సిలర్లు, సర్పంచులు,మండల ముఖ్య నాయకులు,కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఆరోపణలు సరికాదు

స్థానిక ఎమ్మెల్యే జిఎస్ఆర్,
ప్రభుత్వ విప్ విజయరామరావు



**ప్రజాపక్షం/చిట్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను అలోచించి ఎక్కడా లేనివిధంగా భూపాలపల్లి నియోజకవర్గంలో మక్కల కొనుగోలు జరపడం జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పైసా అవినీతి జరగకుండా సాఫీగా జరిగిన కొనుగోళ్లను గిట్టని బిఆర్ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదని, వారు ఊకదంపుడు మాటలతో ప్రజల్లో పబ్బం గడుపుతూ,సోషల్ మీడియాను వేదికగా చేసుకొని అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.చిట్యాల ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు, రైతులకు అండగా ఉండి రైతు కష్టాలు తెలిసిన ప్రభుత్వమని, అది మరిచిన బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం కొనుగోలు చేసిన మక్కలలో రైతులకు అన్యాయం జరిగిందని, తెలిసీ తెలియని బుద్ధిలేని మాటలతో సోషల్ మీడియాను వేదిక చేసుకొని అసత్యపు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మీద కావలని బురద జల్లడం సిగ్గుచేటు అన్నారు.కొంతమంది మధ్య దళారులు రైతుల దగ్గర మొక్కజొన్నలు కొనుగోలు చేసి అమ్మడం వల్ల ఏ మైనా వాళ్ల దగ్గరే లోటుపట్లు ఏమోకాని, మార్క్ ఫెడ్ తో ప్రభుత్వం కొనుగోలు చేసిన మక్కలలో ఎలాంటి అవినీతి జరగలేదని ఏమైనా జరిగిన కూడా ఎవ్వరిని వదిలి పెట్టేది లేదని మండిపడ్డారు. ప్రభుత్వ విప్ విజయరామారావు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రం లో మక్కల కొనుగోలు భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగినట్లు గా ఎక్కడ జరగలేదని, భూపాలపల్లి ప్రాంతంలో మొక్కజొన్న ఎ క్కువ విస్తీర్ణంతో దిగుబడి ఎక్కువగా వచ్చిందని నిల్వలు చేయడం లో కూడా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చాలా శ్రమ తీసుకొని రైతులకు న్యాయం చేశాడని అవి మరిచిన సోయిలేని బిఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలతో రాద్ధంతం చేయడం బుద్ధిమాలిన పని అని ఎద్దేవా చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మ ండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల,జిల్లా నాయకులు,సర్పంచులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజు దోపిడీని నియంత్రించాలి

అమరవీరుల స్థూపం వద్ద పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/నర్సంపేట:** ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు దోపిడీని వెంటనే నియంత్రించాలని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ కమిటీ బాధ్యులు అన్నారు. నర్సంపేట నియోజక వర్గ వ్యాప్తంగా గల ప్రైవేట్ పాఠశాలలో అనియంత్రిత ఫీజుల తగ్గింపు ల క్ష్యంగా పేరెంట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం ధర్నాను అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిన ప్రైవేట్ స్కూళ్ళ యాజమాన్యాలు పెంచుతున్న ఫీజులను సవరించాలని, ప్రైవేట్ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ, ఆర్‌టిఐ నిబంధనలు పాటించాలని, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీని అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు హాజరై విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. పేరెంట్స్ అసోసియేషన్ చేస్తున్న న్యాయమైన డిమాండ్స్ ను నెరవేర్చాల్సి ప్రైవేట్ స్కూళ్ళ యాజమాన్యాలను కో రారు. ధర్నా విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసిపి, ఆర్‌డిఒ పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులను కార్యాలయానికి పిలిపించారు. అనంతరం పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులు ధర్నా చేపట్టడానికి గల కారణాలను అధికారులకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఏసిపి రవీందర్ రెడ్డి ఆర్‌డిఒతో మాట్లాడారు. స్కూళ్ళ యాజమాన్యాలతో మాట్లాడి చర్చలకు తేదీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాకు సంఘీభావం తెలియచేసిన నర్సంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్స్ బీరం భరతరెడ్డి, హన్మకొండ శ్రీధర్‌లకు, విద్యార్థి సంఘాలకు, ప్రజా సంఘాలకు, యూత్ క్లబ్ లకు పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## జిడబ్ల్యుఎంసిలో సర్కిల్ కార్యాలయాల ఏర్పాటు

ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు




**ప్రజాపక్షం/హసన్ పర్తి:** వరంగల్ జిడబ్ల్యుఎంసి పరిధిలో సర్కిల్ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు.ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో నగరవాసుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. చిన్న పని కోసం కాజీపేట సర్కిల్ కార్యాలయానికి వెళ్ళవలసి వస్తున్నదని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో రవాణా చార్జీలతో పాటు సమయం వృధా అవుతున్నదని విలీన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనన, మరణ, నూతన భవన ధ్రువీకరణ పత్రాలు, నూతన ఇంటి నెంబర్లు, ఆస్తుల విభజన పేరు మార్పిడి,నల్లా కనెక్షన్లు, మార్ట్ గేజ్ రిలీజ్ తో పాటు ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. పనుల కోసం సుదూరంలో ఉన్న కాజీపేట్ సర్కిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బల్దియా సేవలు ప్రజలకు అత్యంత ముఖ్యమైనవి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ లో ప్రజల సౌకర్యార్థం జిడబ్ల్యుఎంసి సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.66వ డివిజన్ హసన్ పర్తి లో డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లయితే సుమారు 10డివిజన్ ల ప్రజలకు సత్వరం బల్దియా సేవలు పొందే అవకాశం ఉంటుంది. సర్కిల్ కార్యాలయం ఏర్పాటుతో అన్ని శాఖల అధికారులు,సిబ్బంది అందుబాటులో ఉండడం వలన సకాలంలో సేవలను పొందగలుగుతారు. కార్పొరేషన్ ఎన్నికల ముందే సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విలీన గ్రామాల ప్రజల సౌకర్యార్థం తక్షణమే స్పందించి హసన్ పర్తి 66వ డివిజన్ లో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేనట్లైతే అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి దశల వారిగా ఆందోళన చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## 'ప్రజలకు ఇచ్చిన హామీల అమలే లక్ష్యం'

**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ దత్తక్షేత్రం, కాపువాడ ప్రాంతాల్లో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సిసిరోడ్లు, సిసిడ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పలు అంశాలపై మా ట్లాడారు.నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడ ంలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అత్యవసర అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్య త ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన ప నులను వర్షాకాలానికి ముందే పూర్తి చేసి ప్రజలకు అం దుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రభావం లేని ప్రాంతాల్లో ముందుగా రోడ్లు, సిసి డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామని, అవసరాలను బట్టి పనులను ఎ,బికేటగిరీలుగా విభజించి అమలు చేస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కెటిఆర్ కాళేశ్వరం పర్యటనపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రూ.30 వేల కోట్లలో పూర్తయ్యే ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో లక్ష కోట్లకు పైగా ఖర్చు చేశారని ఆరోపించారు. ముందుగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా వరంగల్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత మూడేళ్లలో ప్రతి డివిజన్‌కు రూ .10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. హనుమకొండలో ఇటీవల జరిగిన భూవేలంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకే భూములు విక్రయించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని చెప్పారు. నిజంగా అం త తక్కువ ధరకే భూమి దొరుకుతుందని భావిస్తే వేల ంలో పాల్గొని కొనుగోలు చేయాలని ప్రతిపక్ష నాయకుల కు సవాల్ విసిరారు. హనుమకొండ బస్‌స్టాండ్, స్టేడి యం వంటి కీలక అభివృద్ధి పనులకు అవసరమైన నిధు లు సమకూర్చేందుకే భూముల వేలం నిర్వహిస్తున్నామ ని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ,మాజీ ప్రతినిధులు,నాయకులు, కార్యకర్త లు,అధికారులు,స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## బాలలు బడిలో ఉండాలి.. పనిలో కాదు: కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** బాలలు సమాజ సంపదని, బాలలు బడిలో ఉండాలి కానీ పనులలో కాదని, జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, కార్మిక, విద్యా, వైద్య, చైల్డ్ లైన్, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూటషన్స్, ఎన్జీఓ లతో ఆపరేషన్ ముస్కాన్XII జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన అనాథ, నిరాశ్రయ, భిక్షాటన, ప్రమాద స్థితుల్లో ఉన్న పిల్లలను గుర్తించి రక్షించడం ప్రతి శాఖ యొక్క బాధ్యత అన్నారు. ఆపరేషన్ ముస్కాన్XII కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేసి, ప్రతి అర్హత కలిగిన బాలబాలికకు రక్షణ, విద్య, పునరావాసం కల్పించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో బాలల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం, ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి అవసరమైన సేవలు అందించడం వంటి అంశాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ శాఖలు అందిస్తున్న సేవలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని, బాలల సమస్యలపై ఎవరైనా 1098కు సమాచారం అందించిన వెంటనే స్పందించాలని సూచించారు. రక్షించిన ప్రతి ఒక్క చిన్నారి చట్టపరమైన రక్షణతో పాటు విద్య, పునరావాసం, కుటుంబ పునరేకీకరణ వంటి చర్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, అదనపు ఎస్పి నరేష్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, సహాయ కార్మిక అధికారి వినోద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, ముస్కాన్ భూపాలపల్లి, కాటారం సబ్‌డివిజన్ బృందాల సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని ఇందిరాపార్క్ మహాధర్నాకు బయలుదేరిన వరంగల్ జిల్లా సిపిఐ కార్యకర్తలు



**ప్రజాపక్షం/ వరంగల్ :** పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇప్పటికే కట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లను త్వరగా అర్హులైన పేద ప్రజలకు పంచాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఇందిరా పార్క్ వద్ద జరుగే మహాధర్నాకు వరంగల్ నుండి సిపిఐ కార్యకర్తలు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు, ఇళ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా పేదలకు పంచడానికి కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా పేద ప్రజలకు పెంచాలని లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆ ఇళ్లను అర్హులైన పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, రాచర్ల రాజేందర్,తస్లీం, రజిని, కరుణాకర్, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

" అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ మూవీకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. "

రీల్

# 'ఆనందాల వేళ' పాట విడుదల



రాయిన్‌లో సినిమాస్ బ్యానర్ మీద ధనలక్ష్మి బాద్ర నిర్మాణంలో వైకుంఠ్ బోసు తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతో న్నారు.మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మరో పాటను రిలీజ్ చేశారు.'ఆనందాల వేళ' అంటూ సాగే పాటను లక్కీ హీరో అతి విడుదల చేశారు. లిరికల్ వీడియోని వీక్షించి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ప్రామిసింగ్ ఉందని, టీంకి ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇక ఈ పాటకు చైతన్య ప్రసాద్ రాసిన సాహిత్యం, సాయి చరణ్ భాస్కరుణి, శృతిక సముద్రాల గాత్రం, మణిశర్మ బాణీ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ఫ్యామిలీ అంతా కలిసి సందడి చేసేలా ఈ పాట కనిపిస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన కంటెంట్‌ను గమనిస్తే ఇదొక ఫ్యామిలీ ఓరియెంటెడ్ సినిమా అని అర్థం అవుతోంది. అన్ని రకాల అంశాలను జోడించిన ఈ మూవీని తెరకెక్కించినట్టుగా కనిపిస్తోంది.ఈ చిత్రానికి జిజ్జు సన్ని (పార్కింగ్ ఫేమ్) కెమెరామెన్‌గా పని చేశారు.



# 10న వస్తున్నాడు ..హిట్టు కొడుతున్నాడు

## 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ మూవీకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగార్జున మాట్లాడుతూ నందు ముందుగా శ్రీరామపురంలో జరిగే కథ అని చెప్పారు. నాన్న శ్రీరామపురంలో అనే ఊర్లోనే పుట్టారు. నందు చెప్పిన కథ నాకెంతో నచ్చింది. ప్రతీ పాత్రలో రకరకాల కోణాలున్నాయి. సెకండాఫ్లో వచ్చే ట్విస్టుల్ని ఎవ్వరూ ఊహించలేరు. ప్రేమ కోసం రాజ్యాలు కూలిపోయాయి.యుద్ధాలు జరిగాయి.'లెనిన్'లోనూ ఓ ప్రేమ కథ ఉంది. భారతి (భాగ్యశ్రీ బోర్సే) కోసం ఎన్ని యుద్ధాలైన చేయొచ్చు. భారతికి ఈ సినిమాకి హార్ట్ బీట్ లాంటిది. శివాజీ, బ్రహ్మాజీ ఈ చిత్రంలో పాత్రలను పోషించడం ఆనందంగా ఉంది. సునీల్‌తో కలిసి ఎన్నో సినిమాలు చేశాను. 'లెనిన్' మీద ప్రేమతో వీరంతా చాలా కష్టపడ్డారు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నవీన్ ఎడిటింగ్, బ్రిట్టో కెమెరావర్క్ అద్భుతంగా ఉంటుంది. 'లెనిన్' సీమ కథ, సీమ మట్టి కథ, సీమలో ఉన్న మనుషుల కథ, సీమలో జరుగుతున్న మహా భారతం. అఖిల్ ఇలాంటి కథకు సూట్ అవుతాడా? అని మొదట్లో చాలా భయపడ్డాను. కానీ సినిమా చూశాక అందరూ ఆశ్చర్యపోయారు. అఖిల్ కనిపించలేదు.లెనిన్ మాత్రమే కనిపించాడు. లెనిన్ ప్రేమను, పగను ప్రేమిస్తారు. జూలై 10 వస్తున్నాం.. మనవాడు కొడుతున్నాడు'అని అన్నారు. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ సీమ బిడ్డ నందు నాకు అద్భుతమైన కథ చెప్పారు. నా జర్నీ, నా పెయిన్ అంతా కూడా ఈ కథలోనే కనిపించింది. అందుకే నేను వెంటనే ఓకే చెప్పాను. వంశీ ఒక్కడే ఈ మూవీని చేయాలని అనుకున్నాడు. కానీ కథ విన్నాక ఇద్దరికీ ఓ పాజిటివ్ వైబ్ వచ్చి నాన్నకి చెప్పాం. అందరం కలిసి పని చేద్దామని నిర్ణయించుకున్నాం. నేను 'లెనిన్' చిత్రం గురించి ఎక్కువగా మాట్లాడను. జూలై 10న సినిమానే మాట్లాడుతుంది అని అన్నారు.సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ ఇంటర్వెల్, చివరి 40 నిమిషాలు మాత్రం ఖంగుతినేలా ఉంటుంది. రెగ్యులర్ ఫార్మాట్లో మాత్రం అస్సలు ఉండదు. స్క్రీన్ ప్లే చాలా కొత్తగా ఉంటుంది. మా కాంబోలో అసలు అపజయం అన్నదే లేదు. నాగార్జున గారు ...మనం హిట్టు కొట్టిన తర్వాత మాట్లాడదాం అని అన్నారు.భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ .. 'లెనిన్'లో నాకు భారతి అనే పాత్రను పోషించాను. ఇలాంటి గొప్ప పాత్రను నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. నా కెరీర్లో భారతి అనే పాత్ర నిలిచిపోతుంది అని అన్నారు.నటుడు శివాజీ మాట్లాడుతూ .. 'అన్నపూర్ణ బ్యానర్, నాగార్జున వల్లే నా సినీ కెరీర్ ప్రారంభమైంది. 'లెనిన్' నా హార్ట్‌కి దగ్గరైన చిత్రం. మేం ఇప్పుడు ఎక్కువగా మాట్లాడం. రిలీజ్ అయ్యాక సినిమానే మాట్లాడుతుంది. మూవీలో మేం ఎక్కడా కనిపించం. కేవలం పాత్రలే కనిపిస్తాయి. కొడుకు సక్సెస్ కోసం నాగార్జున 'లెనిన్' కోసం చాలా కష్టపడ్డారు. అఖిల్‌కి ఇది పర్ ఫెక్ట్ మూవీ అని అన్నారు.నటుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ అక్కినేని ఫ్యామిలీలో అందరితో నటించాను. నెక్ట్స్ జనరేషన్ కిడ్‌తోనూ నటించాలని వెయిట్ చేస్తున్నాను అని అన్నారు. నటుడు సునీల్ మాట్లాడుతూ .. ''అఖిల్ అంటే నాకు చాలా ఇష్టం. అఖిల్‌కి ఉన్నంత ఎనర్జీ మాకు ఉండదు. ఈ చిత్రం కోసం అఖిల్ చాలా కష్టపడ్డాడు. చిత్తూరు బ్యాక్ డ్రాప్ని, ఆ వాతావరణాన్ని నందు తెరపైకి తీసుకు వచ్చారు అని అన్నారు.

# 17న థియేటర్లలోకి 'వదలా'



జగపతి బాబు, లయ ప్రధాన పాత్రలో సస్పెన్స్, మిస్టరీతో సైకలాజికల్ థ్రిల్లర్ గా తెరకెక్కించిన సినిమా 'వదలా'. అకెళ్ల వి. కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హృతిక శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చరిత చిత్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'ఫస్ట్ గ్లింప్స్'తో ఆసక్తిని రేకెత్తించగా, టీజర్ అంచనాలను మరింత పెంచింది.ఈ చిత్రం జూలై 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఆకట్టుకునే కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. విడుదల తేదీ పోస్టర్ సినిమా మిస్టీరియస్ వాతావరణాన్ని ఆసక్తికరంగా ప్రతిబింబిస్తోంది. రెడ్ బ్యాక్ డ్రాప్ లో హృతికా శ్రీనివాస్ లోలోపల ఎన్నో రహస్యాలు దాచుకున్నట్లుగా కనిపించే ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. విడుదల తేదీ ఖరారైన నేపథ్యంలో రానున్న మరింత జోరు పెంచనున్నారు. త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు.ఈ చిత్రానికి ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కార్తీక్ కొడకండ్ల సంగీతం సమకూరుస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, బజ్జా బ్రహ్మయ్య ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.జగపతి బాబు, లయ, హృతికా శ్రీనివాస్, అవసరాల శ్రీనివాస్, రవి వర్మ, జెన్నీ, రీను, చిత్రానికి రచయిత: లక్ష్మి భూపాల, ఆర్ట్ డైరెక్టర్: బజ్జా బ్రమయ్య, స్టంట్స్: డ్రాగన్ ప్రకాష్, సాహిత్యం: కృష్ణవేణి మల్లవజ్జల, వీరు గడ్డం అందిస్తున్నారు.

# 'అమీర్ లోగ్' టీజర్ లాంచ్



అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'అమీర్ లోగ్'. ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో వేద జలంధర్ , రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి పలువురు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీని రానా స్పిరిట్ మీడియా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో నిర్మాత వంశీ నందిపాటి మూవీ టీజర్ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సందీప్ మాట్లాడుతూ 'అమీర్ లోగ్' టీజర్ లాంచ్ ఈవెంట్కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి మాట్లాడుతూ ''అమీర్ లోగ్' నాకెంతో ప్రత్యేకం. షూటింగ్ అంతా లంగర్ హౌజ్లో, మ్యూజిక్ అంతా కాచిగూడలో జరిగింది. ప్రాపర్ హైదరాబాద్ సినిమా. ఈ మూవీలో బిర్యానీ గురించే ఎక్కువగా ఉంటుంది. అందరూ కొత్త వారే నటించారు. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. ఈ మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి, దర్శకుడు రమణా రెడ్డి, కామ్రేడ్ కళ్యాణ్ నిర్మాత వెంకట కృష్ణ, మనోహర్ రెడ్డి, నటుడు మనోజ్, వేద జలంధర్, నటుడు విశ్వేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మా బ్యానర్స్‌కు ఒక మార్క్ క్రియేట్ చేస్తుంది

## చిట్ చాట్ లో' చెన్నై లవ్ స్టోరీ ' నిర్మాత ఎస్ కెఎన్



టాక్సీవాలా, బేబి వంటి చిత్రాల ప్రొడ్యూసర్ గా ఎదిగిన జర్నలిస్ట్ ఎస్ కె ఎన్ . తాజాగా చెన్నై లవ్ స్టోరీ నిర్మిస్తున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 24న 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.తెలుగు జంట చెన్నైలో నివసిస్తుంటారు. అందుకే చెన్నై లవ్ స్టోరీ అని సినిమా టైటిల్ పెట్టాం. బేబి సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత మేకర్స్ గా మాపై అంచనాలు పెరిగాయి. నేషనల్ అవార్డ్ విన్నర్ సాయి రాజేష్ చెప్పిన ఈ కథ, కథనం బాగా నచ్చాయి. మా కాంబినేషన్ లోనే ఈ సినిమా ప్రొడ్యూస్ చేయాలని అనుకున్నాం. ప్రస్తుతం మా సినిమా తెలుగు రిలీజ్ వరక్స్ స్పీడ్ గా జరుగుతున్నాయి. తమిళ్ రిలీజ్ అదే వారం చేయాలా, ఒకట్రెండు వారాలు ఆగి చేయాలా అనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఎందుకంటే తమిళంలో కొన్ని పెద్ద మూవీస్ రిలీజ్ కు వస్తున్నాయి.మేము అనుకున్న కథకు కిరణ్ అబ్బవరం వందశాతం న్యాయం చేశారు. ఆయన ఇప్పటిదాకా బాయ్ నెకట్స్ డోర్ క్యారెక్టర్స్ చేశారు. మాస్ క్యారెక్టర్స్ లో నటించారు.'చెన్నై లవ్ స్టోరీ'లో అలాంటి వివాదాస్పద కంటెంట్ ఉండదు. అయితే వాళ్లు కొన్ని నెలల ముందే ప్రొడ్యూసర్ కు చెబుతారు. ఈ విషయంలో నాకు ఒత్తిడి ఎదురుకాలేదు. కొందరు ప్రొడ్యూసర్స్ తాము ఇబ్బంది పడ్డామని చెబుతున్నారు. మా 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ ఓటీటీ డీల్ కంప్లీట్ అయ్యింది. ఇప్పుడు ఇంత కలెక్ట్ చేస్తుందని నేను చెబితే ఓవర్ కాన్ఫిడెన్స్ అంటారు. మా సినిమా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవుతుంది. బేబి లాగే మాకు మంచి పేరు తీసుకొస్తుంది. మేకర్స్ గా మాకు ఒక మార్క్ క్రియేట్ చేస్తుందని గట్టిగా నమ్ముతున్నాం.

# ఎల్‌నినో తీవ్ర ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం చూపిస్తాయి, అదేవిధంగా నీటి వనరుల కొరత ఏర్పడుతుంది. జలాశయాలు ఎండిపోతాయి. దీంతో జలవిద్యుత్ ఉత్పత్తి కూడా మందగిస్తుంది. టర్బైన్ల ద్వారా వచ్చే జల విద్యుత్ క్షీణిస్తుంది. ఉష్ణోగ్రతల పెరుగుదలవల్ల దేశవ్యాప్తంగా ప్రజలు భారీస్థాయిలో ఎయిర్ కండిషనర్ల వాడకాన్ని పెంచుతారు. ఈ విధంగా విద్యుత్ ఉత్పత్తి—వినియోగం మధ్య తీవ్ర అసమతుల్యత ఏర్పడుతుంది. 2026 జులై నుండి 2027 జూన్ వరకూ దేశ వాతావరణం లా నినో నుండి ఎల్ నినోస్థాయికి పరివర్తన చెందనున్నది. లానినో అంటే ఎల్‌నినో వచ్చేముందునాటి శీతలదశ.

మనదేశం ఇప్పటికే ప్రాణాంతకమైన వడగాలులను చవిచూసింది. దీనివల్ల విద్యుత్ వినియోగం కూడా గణనీయస్థాయి పెరుగుదలను మనం గమనించాం,దీనివల్ల విద్యుత్ డిమాండ్ 270 గిగావాట్లకు పెరిగింది. ఇక రాబోయేకాలంలో ఈ సూపర్ ఎల్‌నినో వల్ల విద్యుత్ డిమాండ్ గతంకంటే భారీగా పెరుగుతుంది. వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. భూగర్భ జల వనరులపైన కూడా గణనీయ ప్రభావం కనిపిస్తుంది. ఎల్‌నినో వల్ల కోల్పోయిన పునర్వినియోగ ఇంధన ఉత్పత్తులు,పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను చూస్తే దాదాపు గటకు 18 టెర్రావాట్ ఇంధన ఉత్పత్తి లోటు ఏర్పడుతుంది. ప్రస్తుతం బొగ్గు మండించడం ద్వారా థర్మల్ విద్యుత్‌ను మనం తయారు చేస్తున్నాం. దీనివల్ల 17 మిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ గాలిలోకి విడుదలవుతుందని ఒక అంచనా. తీవ్రమైన ఎల్‌నినో పరిస్థితులమధ్య అదనంగా బొగ్గు ద్వారా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 24 టెర్రావాట్స్‌కు పెంచాలి. అంగే గత ఏడాది పెరిగిన బొగ్గు వాడకంలో ఇది సగం మేరకు పెరిగినట్టే. ఈ ఏడాది ఎల్‌నినో ముందస్తు హెచ్చరికల ప్రకారం వేడెక్కుతున్న ప్రపంచంలో తీవ్ర పరిస్థితులు సాధారణంగా మారిపోతాయి. ఎల్‌నినో అనేది రెండు సంవత్సరాల నుండి ఏడు సంవత్సరాల పరిభ్రమణంలో సంభవిస్తుంది. అందువల్ల భారతదేశం రాబోయే రోజుల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి అదనంగా సౌర విద్యుత్ నిల్వ చేసుకోవడంతోపాటు, గ్రిడ్‌ల శక్తి సామర్థ్యాలు తట్టుకుని నిలబడతాయా అనే దానిపై ఆధారపడి ఉంటాయి.

పైగా భారతదేశం వాతావరణ రక్షణ నిమిత్తం కొన్ని లక్ష్యాలను కూడా రాబోయేకాలంలో నిర్దేశించుకుంది. అందువల్ల 2030 నాటికి లక్ష్యం ప్రకారం భారత్ 500 గిగావాట్ల మేరకు శిలాజేతర ఇంధనాన్ని అభివృద్ధి చేసుకుని దానిపై ఆధారపడాలి. బొగ్గును మండించి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను తగ్గించుకోవాలి, బ్యాటరీల స్థాయిని పెంచాలి. గ్రిడ్‌ల శక్తిసామర్థ్యాలను కూడా పెంపొందించుకోవాల్సి ఉంది. ఈ విధమైన చర్యలను తీసుకుంటేనే తక్కువ ధరలకు ప్రజలకు స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించగలుగుతుందని 'క్రెయా' నివేదిక తెలియజేసింది. కానీ తక్కువ సమయంలో ఈ లక్ష్యాలను భారత్ ఎలా సాధించగలదు?దానికి సంసిద్ధత ఉందా? లక్ష్యాలకు అనుగుణంగా తన కార్యక్రమాన్ని కొనసాగిస్తోందా? లేక ఇప్పటికిప్పుడే ఆదరాబాదరాగా చర్యలు ప్రారంభిస్తుందా? అనేవన్నీ ప్రశ్నార్థకాలు.



# మనుగడ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)



గోపాలపురం, మహబూబాబాద్, యాదాద్రి జిల్లా కొలనుపాక, చేవెళ్ల, అబ్దుల్లాపూర్‌మెట్, అశ్వారావుపేట వంటి ప్రాంతాల్లో వరుసగా జరిగిన కూల్చివేతలను తీవ్రంగా ఖండించారు. 'భూదాన్ భూములు, ప్రభుత్వ భూములను ల్యాండ్ మాఫియా దొం గల్లా దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని, మరో వైపు నోరు లేని మూగజీవాల్లాంటి పేదలు తలదాచుకోవడానికి గుడిసె వేసుకుంటే మాత్రం కూల్చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి అంతగా సమర్థత ఉంటే, ల్యాండ్ మాఫియా దగ్గర నుంచి ఎన్ని వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారో 'శ్వేత పత్రం' విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'హైడ్రా' పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయడం కాదు, పెద్ద పెద్ద కబ్జాకోరులను, 10 మంది పెద్ద చేపలను పట్టి జైల్లో పెట్టండి, మేం స్వాగతిస్తూ మీకు దండలు వేస్తాం' అని సాంబశివరావు అన్నారు. వరంగల్ గుండ్ల సింగారంలో స్థానిక ఎంఎల్‌ఎకు ఇష్టం లేకపోయినా కలెక్టర్లు స్వయంగా వెళ్లి కూల్చివేతలు జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజాప్రతినిధుల మాట వినని అధికారులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. 'కమ్యూనిస్టులుగా మీరు పోరాటం చేయండి, ఆ డిమాండ్లను మేము అమలు చేస్తాం' అని ఖమ్మం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సాంబశివరావు కోరారు. సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), మావోయిస్టులు, అడవిలో ఉన్నా, నగరాల్లో ఉన్నా ఎర్ర జెండాలన్నీ ఒకటేనని, అందరికీ తల్లి పార్టీ కమ్యూనిస్టు పార్టీయేనన్నారు. ఆ ఎర్రజెండలన్నీ ఒక్క జెండాగా మారి పేదల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఆయన ప్రకటించారు. 'అధికారులు ఎవరైనా ఇళ్లు కూల్చడానికి వస్తే భయపడకుండా ఎదురుతిరగండి. అవసరమైతే లాఠీలను, తుపాకులను మీ గుండెలతో అడ్డుకోండి. కమ్యూనిస్టు నాయకత్వం మీతో పాటే నిలబడుతుంది. లాఠీలు, బుల్లెట్లకు భయపడకుండా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ భూపోరాటం కొనసాగుతుంది' అని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు, ఇళ్లు వేసుకున్న వారందరికీ తక్షణమే పట్టాలు ఇవ్వాలని, ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు లేదా సొంతంగా ఇల్లు కట్టుకోవడానికి స్థలాలు కేటాయించాలని, రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పెండింగ్ లేకుండా పట్టాలు పంపిణీ చేయాలని, ఈ మూడు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడుతున్నామన్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా తక్షణమే కమ్యూనిస్టు పార్టీలను చర్చలకు పిలవాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించనట్లయితే డిమాండ్ల సాధన కోసం తమ ఉద్యమ కార్యాచరణ తమకు ఉంటుందని సాంబశివరావు స్పష్టంచేశారు.

**ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి : జాన్ వెస్లీ**



రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయాలని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు సొంత ఇళ్లు లేవని, హైదరాబాద్‌లో 60 శాతం మంది అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుడిసెల కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని, పేదలను రోడ్డున పడేయవద్దన్నారు. గుడిసెల కూల్చివేతలు కొనసాగితే బుల్డోజర్లకు ఎదురొడ్డి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పేదలు, శ్రామిక వర్గం ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**పాలకులు సిగ్గుతో తల దించుకోవాలి : సాధినేని**



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా నేటికి 80 కోట్ల మంది రేషన్ కార్డుల ద్వారా బియ్యం తీసుకుంటున్నారంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వరు అన్నారు. పేదల గుడిసెలు, ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం బుల్డోజర్ విధానాన్ని కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

**ఇందిర్మ ఇళ్లకు రూ.10లక్షలివ్వాలి : హన్మేష్**




సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు హన్మేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్లు లేవని, గత ప్రభుత్వాల హామీలు కూడా పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు. ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రూ.5 లక్షల సహాయం సరిపోదని, కనీసం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు ఇవ్వాలన్నారు.

**ప్రమాదంలో పేదల భూముల, గుడిసెలు : గాదగోని రవి**



ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ పేదలకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ ప్రభుత్వ భూములను వేలం వేయడం ద్వారా పేదలను బయటకు పంపే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మియాపూర్, వరంగల్, నర్సంపేట వంటి ప్రాంతాల్లో పేదల భూములు, గుడిసెలు ప్రమాదంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులకు భారీ ఖర్చు పెడుతున్న ప్రభుత్వం, పేదలకు మాత్రం న్యాయం చేయడంలేదని విమర్శించారు.

**రాష్ట్రం ఏర్పడినా తీరని పేదల సమస్యలు : మురహరి**



ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా పేదల సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు. పేదల హక్కుల కోసం ప్రారంభమైన ఈ పోరాటం చివరికి కార్మిక వర్గ రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా కొనసాగించాలన్నారు.

**చీర సారేలు ఇచ్చినట్లు ఇళ్ల స్థలాలివ్వాలి : టి.జ్యోతి**



సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి మాట్లాడుతూ ఇల్లు మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, సిఎం రేవంత్‌రెడ్డి మహిళలకు చీర సారేలు ఇచ్చినట్లుగా ఇళ్ల స్థలాలు ఇళ్లు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ హామీని పూర్తిగా అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు.

**ఇల్లు ప్రాథమిక హక్కు : వి.సంధ్య**



పిఒడబ్ల్యు జాతీయ నాయకురాలు వి.సంధ్య మాట్లాడుతూ లక్షలాది మంది పేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉపయోగించకుండా పాడైపోయాయని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు తీసుకున్నా ఇళ్లు ఇవ్వడం లేదని, ఇల్లు ప్రజల ప్రాథమిక హక్కు అని ఆమె పేర్కొన్నారు.

**పేదల గుడిసెలు కూల్చితే ఖబర్దార్ : తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు**



మరోసారి ప్రభుత్వం పేదల గుడిసెల వైపు కన్నెత్తి చూస్తే ఖబర్దార్ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. నిరుపేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించకుండా కూల్చివేస్తోందని, ఇది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని, గుడిసెలు కూల్చిన అదే స్థలంలో పేదలకు పట్టాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

**గచ్చిబౌలిలో పెద్దల అక్రమాలు కనిపించవా : ఇటి నరసింహా**

రాష్ట్రంలో పేదలకు పట్టాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం, వారిని రోడ్డు మీదకు నెట్టేస్తూ అమానవీయంగా వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా అన్నారు. ఒక వైపు సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని గొప్పగా చెబుతుంటే, మరోవైపు అనేక ఏళ్లుగా గుడిసెల్లో జీవిస్తున్న పేదల ఇళ్లు కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూములు అనే సాకులు చూపుతూ పేదలపై మాత్రమే దాడులు చేయడం అన్యాయమన్నారు.



**ఇందిరమ్మ రాజ్యంలోను పేదలకు అన్యాయమేనా: నెల్లికంటి**



ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వకుండా, వారి నివాసాలను కూల్చివేయడం అన్యాయమని సిపిఐ ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం అన్నారు. గత ప్రభుత్వం 'బంగారు తెలంగాణ' పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం 'ఇందిరమ్మ రాజ్యం', 'ప్రజా ప్రభుత్వం' పేరుతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా వామపక్ష పార్టీలు శాసనసభలోనూ, ప్రజా ఉద్యమాల ద్వారానూ ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. భూదాన్ భూములు, కోర్టు కేసులు వంటి కారణాలు చూపుతూ కాలయాపన చేస్తూనే, మరోవైపు గుడిసెల కూల్చివేతలు ఆరోపించారు.

**బుల్డోజర్ పాలన కొనసాగిస్తే ఇక ఊరుకోం : పశ్యపద్మ**



ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారెంటీలు అంటూ గొప్పగా హామీలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు అదే పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేయడం దారుణమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, బుల్డోజర్ రాజ్యం అని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుని కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. ఒక్క పేదవాడి దరఖాస్తును ఆమోదించకపోయినా కోర్టును ఆశ్రయిస్తామని, అవసరమైతే రోడ్లపై తేల్చుకుంటామని హెచ్చరించారు. ప్రజలను సమీకరించి చలో ముఖ్యమంత్రి ఇంటికి వంటి పెద్ద ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**పేదల ఇళ్లను కూల్చేస్తే... రోడ్డెక్కి తేల్చుకుంటాం: గణేష్**



పేదోడు గుడిసె వేసుకుంటేనే ప్రభుత్వం కన్నెర్ర చేస్తోందని, ఇదేనా ప్రజాపాలన? అని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ప్రశ్నించారు. ఇల్లు లేని వాడిని రోడ్డు మీదకి నెట్టే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. మొన్న అశ్వారావుపేట, కొత్తగూడెం ప్రాంతాల్లో 350 ఇళ్లను కూల్చి స్మశానంలా మార్చారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సిపిఐ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవీంద్ర చారి వేదికపై ఆశీనులయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com